ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఒంగోలు
: fb.com/vaartha Digital

సంబరాల జీవితం సౌభాగ్యాల సౌరభం
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం


Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
5-11-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 274 పేజీలు: 12 వెల: 6.50

# సమృద్ధిగా జలరవాణా వనరులు

## అరుదైన ఖనిజాల వెలికితీతకు వర్సిటీల భాగస్వామ్యం

## లండన్‌లో పారిశ్రామికవేత్తలతో సిఎం చంద్రబాబు భేటీ

### వారికి విశాఖ భాగస్వామ్య సదస్సుకు ఆహ్వానం



మంగళవారం లండన్‌లో పారిశ్రామికవేత్తలతో భేటీ అయిన సిఎం చంద్రబాబు

**విజయవాడ నవంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** అంతర్గత జలరవాణా మార్గాల ద్వారా అతి తక్కువ వ్యయంతో సరుకు రవాణా చేసేందుకు ఆస్కారం ఉందని ఎపిలో ఈ జల రవాణాకు పుష్కలంగా అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. లాజిస్టిక్ కారిడార్‌ద్వారా ఎపిని అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రచిస్తున్నట్టు సిఎం లండన్‌లోని పారిశ్రామిక వేత్తలకు వివరించారు. లండన్ పర్యటనలోఉన్న సిఎం చంద్రబాబు వివిధ పారిశ్రామిక వేత్తలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎపిలో పెట్టుబడులు పెట్టాలని.. అలాగే ఈ నెల జరగనున్న భాగస్వామ్య సదస్సుకు హాజరు కావాలని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయా సంస్థలతో రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాష్ట్రంలో రోడ్డు, రైలు, వాయు మార్గాలతో పాటు అంతర్గతంగా ఉన్న జలవనరుల్లో జల రవాణా ద్వారా సరకు రవాణాపై పని చేసేందుకు ముందుకు రావాలని లండన్‌లోని అరుప్ సంస్థను సిఎం కోరారు.

లండన్‌లోని ప్రముఖ నిర్మాణ రంగ సంస్థ ఆరుప్ గ్లోబల్ అఫైర్స్ డైరెక్టర్ జేమ్స్ కెన్నీ, డిజిటల్ రిస్క్ మేనేజ్మెంట్ కంపెనీ అల్టెరిన్ టెక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫ్రెడీ వూలాండ్, పీజీ పేపర్ కంపెనీ సిఇఒ పూనమ్‌గుప్తా, జూలీబి యూనివర్సిటీనుంచి గౌరవ్ మార్వాహా, >>2



# గ్రామీణ రోడ్లకు 2000 కోట్లు

## 'సాస్కీ' నిధులతో నిర్మిస్తున్నాం

## అన్ని స్థాయిల్లో క్వాలిటీ చెక్

### నాణ్యతా ప్రమాణాల బాధ్యత అధికార యంతాంగానిదే: డిసిఎం పవన్

**విజయవాడ,నవంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామీణ రహదారులు అభివృద్ధికి రూ. 2000 కోట్లు సాస్కి నిధులను వినియోగిస్తున్నామని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేసారు.ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారంతో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శకంలో మరో ముందడుగు వేసామన్నారు. ప్రజలకు సాస్కి నిధుల ఫలాలు అందించాలి అని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులకు ఉప ముఖ్యమంత్రిఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేసారు.

రాష్ట్రంలోని గ్రామాల్లో రహదారుల స్థితిగతులను మార్చి నూతన రోడ్లు నిర్మించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం 'సాస్కి' పథకం ద్వారా ఎపికి రూ. 2వేల కోట్లు నిధులు సమకూర్చింది. ఈ నిధులను సద్వినియోగం చేసుకొని, ప్రజలకు పటిష్టమైన రహదారులు అందించే కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టింది అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో దెబ్బతిన్న పంచాయతీరాజ్ రోడ్లను పునర్నిర్మించే కార్యక్రమం చేపడుతున్నామని, ఇందులో బాగా దెబ్బతిన్నరోడ్లకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంనుంచి అందుతున్నసహకారం మూలంగా రాష్ట్రానికి సాస్కి నిధులు సమకూరాయని చెప్పారు. సిఎం చంద్రబాబు నేతృత్వంలో వీటిని సద్వియోగం చేసుకుందామన్నారు. సాస్కి నిధుల వినియోగించే ప్రణాళికపై పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ అధికారు >>2

# ప్రపంచ పర్యాటక పటంలోకి ఎపి

## లండన్‌లో జరుగుతున్న డబ్ల్యుటిఎంలో మంత్రి దుర్గేష్, ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్

### అంతర్జాతీయ ప్రతినిధులకు అరకు కాఫీతో స్వాగతం




మంగళవారం లండన్‌లో జరుగుతున్న వరల్డ్ ట్రావెల్ మార్కెట్ 2025లో ఏర్పాటు చేసిన అరకు కాఫీ స్టాల్‌లో మంత్రి కందుల దుర్గేష్, పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్ ఇతరులు

**విజయవాడ,నవంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిని ప్రపంచ పర్యాటక పటంలో సగర్వంగా నిలుపుతామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్. అన్నారు. వరల్డ్ ట్రావెల్ మార్కెట్ ఎపి పర్యాటక ఖ్యాతిని వివరించామన్నారు. గ్లోబల్ టూరిజం మ్యాప్‌లో అందరిని ఆకర్షించే దిశలో నిలబెడతామని మంత్రి కందుల దుర్గేష్‌అన్నారు. ఇప్పటికే ప్రపంచం ఎపిని అత్యంత ఆహ్లాదకరమైన, ప్రకృతి సోయగాల ప్రదేశంగా గుర్తించిందన్నారు.లండన్‌లోని ఎక్సెల్ లండన్ వేదికగా నవంబరు 4 నుండి 6 వరకు జరుగుతోన్న వరల్డ్ ట్రావెల్ మార్కెట్ 2025 ఎగ్జిబిషన్‌లో మంత్రి కందుల దుర్గేష్, పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్‌లు పాల్గొని రాష్ట్ర పర్యాటక వాణిని వినిపించారు. తొలి రోజు మంత్రి కందుల దుర్గేష్ సారథ్యంలోని బృందం బిజీబిజీగా గడిపింది.

తొలుత భారత పర్యాటక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన స్టాల్‌ను డిప్యూటీ హై కమిషనర్, దేశంలోని వివిధ రాష్ట్రాల పర్యాటకమంత్రులతో కలిసి మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర సంస్కృతి ప్రతిబింబించేలా కూచిపూడి నృత్యంతో ఎపి పర్యాటక స్టాల్‌ను అక్కడి ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. వరల్డ్ ట్రావెల్ మార్కెట్ వేదికగా ఏర్పాటు చేసిన ఎపి స్టాల్ ద్వారా రాష్ట్రంలోని ప్రకృతి సహజ సిద్ధ ప్రదేశాలు, చారిత్రాత్మక కోటలు, సుదీర్ఘమైన తీర ప్రాంతం, వారసత్వ సంపదను ప్రపంచ దేశాల పర్యాటకులకు తెలిపేలా వరల్డ్ ట్రావెల్ మార్కెట్ వేదికగా ప్రచారం కల్పించారు. అదే విధంగా దాదాపు 20కి పైగా అంతర్జాతీయ టూర్ ఆపరేటర్లు, హోటల్స్ ప్రతినిధులు, మైస్ ఇన్వెస్టర్లు,ప్రఖ్యాత ట్రావెల్ మాగజైన్స్ యజమానులు, మీడియా బ్లాగర్స్, అడ్వెంచర్ ట్రావెల్ కంపెనీలు, టైలర్ మేడ్ ట్రావెల్ కంపెనీ, ఆన్ లైన్ ట్రావెల్ మీడియా, టూరిజం బోర్డులు, కృతి రిటైల్ వెంచర్స్ ఎల్ఎల్‌పీతో విడివిడిగా సమావేశమై రాష్ట్ర పర్యాటక రంగంలో ఉన్న పెట్టుబడులకు ఉన్న విస్తృత అవకాశాలను, ఎపి పర్యాటక రంగ ప్రత్యేకతలను వివరించారు. ఎపి స్టాల్‌కు వచ్చిన అంతర్జాతీయ ప్రతినిధులకు >>2

## వివేకా హత్య కేసు:

# సిబిఐ కోర్టులో సునీల్ యాదవ్ కౌంటర్ దాఖలు

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త:** మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసులో ఎ2 గా వున్న కడపకు చెందిన సునీల్ యాదవ్ మంగళవారం నాంపల్లి సిబిఐ కోర్టులో కౌంటర్ దాఖలు చేశాడు. ఈ కేసును మరోసారి విచారించాలని వివేకాతనయ సునీతారెడ్డి సిబిఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేయడం తెలిసిందే. దీని తరువాత చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో సునీల్ యాదవ్ ఈ పిటిషన్ దాఖలు చేస్తూ అనేక అంశాలను ప్రస్తావించాడు. కడప జైల్లో దస్తగిరిని డాక్టర్ చైతన్య రెడ్డి బెదిరించిన ఘటనపై సిబిఐ విచారించలేదని, 2017 ఎంఎల్‌సి ఎన్నికల్లో వివేకా ఓటమి వెనుక అవినాష్ రెడ్డి కుట్ర కోణంపై నిగ్గు తేల్చాలని, వివేకా హత్య కేసులో సాక్షులుగావున్నవారిలో ఆరుగురు మరణించిన విషయంపైనా సిబిఐ విచారణ చేయాలని సునీల్‌యాదవ్ కోరాడు. కల్లూరు గంగాధర్ రెడ్డి అనంతపురం ఎస్‌పికి ఫిర్యాదు చేసిన తరువాత కూడా ఆయనకు రక్షణ కల్పించలేక పోయారని సునీల్ యాదవ్ తన పిటిషన్‌లో తెలిపాడు.



# లాజిస్టిక్ హబ్‌గా ఎపిని మారుస్తాం

### దుబాయ్‌లో మంత్రి నారాయణ

**సచివాలయం, నవంబరు 4,ప్రభాతవార్త :** రాష్ట్రాన్ని అన్నిరకాల లాజిస్టిక్ హబ్‌గా మారే ్చం దుకు చర్యలు చేపడుతున్నట్లు పురపాలక శాఖమంత్రినారాయణ వివరించారు. పెట్టుబ డులు ఆహ్వానించేందుకు దుబాయ్‌లో రెండో రోజు కొనసాగుతున్న మంత్రి నారాయణ పర్యటనలో భాగంగా పెట్టుబడిదారులకు వివరించారు.రాష్ట్రానికి పెట్టుబడుల సాధనకోసం దుబాయ్‌లో వివిధ రకాలపారిశ్రామికవేత్తలతో మంత్రి మంగళవారంభేటీ అయ్యారు.ఇందులో భాగంగా అపరెల్ గ్రూప్ చైర్మన్ నీలేష్ వేద్‌తో కలసి ఫ్యాషన్, ఫుట్‌వేర్ >>2

# ట్రక్కును ఢీకొన్న కారు

## బారాబంకిలో ఘోర ప్రమాదం

### ఆరుగురు మృతి, పలువురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

**బారాబంకి, నవంబరు 4:** రాజస్థాన్, తెలంగాణలో జరిగిన సంఘటనలు మరవక ముందే యూపీలో మరో ఘోర రోడ్డు ప్రమాదం వెలుగు చూసింది. బారాబంకిలోని దేవా ఫతేపూర్ రహదారిపై ఓ కారును ట్రక్కు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో స్పాట్‌లోనే ఆరుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయిగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం హాస్పిటల్‌కు తరించారు. దేవా పోలీస్ స్టేషన్ ప్రాంతంలో మంగళవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. దేవా ఫతేపూర్ హైవేపై వేగంగా దూసుకొచ్చిన ఒక ట్రక్కు కారును బలంగా ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఎని >>2



తుఫాన్ కారణంగా పంట నష్టంపై మంగళవారం కృష్ణా జిల్లాలో రైతులను ఆరా తీస్తున్న జగన్

# ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకోవాలి

## చంద్రబాబు తప్పిదంవల్లే పంటలకు పరిహారం రావడం లేదు..

### తూతూ మంత్రంగా ఇ-క్రాప్: మాజీ సిఎం జగన్ విమర్శ

**విజయవాడ,నవంబరు4,ప్రభాతవార్త ప్రతినిధి:** వ్యవసాయం దండగ అన్న సిఎం చంద్రబాబు అదే ధోరణితో వ్యవహరిస్తున్నారని వైయస్సార్సీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ 18 నెలల్లో దాదాపు 16 ప్రకృతి వైపరీత్యాలు సంభవించాయన్నారు. దాంతో రైతులకు నష్టం కలుగుతోందని, అయినా ఏ ఒక్క రైతును ఆదుకున్న దాఖలా లేదని మాజీ ముఖ్యమంత్రి, వెల్లడించారు. మొక్కుబడిగా చాలా తక్కువగా పెట్టుబడి సాయం, ఉచిత పంటల బీమా రద్దు, ఇన్‌పుట్ సబ్సిడీ రద్దు, పంటలకు లేని కనీస మద్దతు ధర, రైతులకు తగిన యూరియా కూడా సరఫరా చేయకపోవడం, చివరకు పంటలు కూడా కొనేవారు లేకపోవడంతో.. రాష్ట్రంలో ఈ కూటమి ప్రభుత్వంలో రైతులు నానా అగచాట్లు పడుతున్నారని ఆయన తెలిపారు. ఇప్పుడు తుపాన్‌లో నష్టపోయిన రైతును ప్రభుత్వం ఆదుకోవాలని, వారికి న్యాయం జరిగేవరకు పోరాడతామని, రైతులకు అండగా వైయస్సార్సీ నిలుస్తుందని >>2

# ప్రజా దర్బార్‌కు అపూర్వ ఆదరణ

## నాలుగు గంటలపాటు 4 వేల మందిని పైగా కలిసి సమస్యలు తెలుసుకున్న మంత్రి లోకేష్

### అందరిని ఆప్యాయంగా పలుకరించి వినతుల స్వీకరణ

### 70వ రోజు ప్రజా దర్బార్



మంగళవారం ప్రజా దర్బార్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి లోకేష్

**మంగళగిరి, నవంబరు 4 ప్రభాతవార్త:** టిడిపి కేంద్ర కార్యాలయంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ 70వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. మంత్రి లోకేష్‌ను కలిసి సమస్యలు విన్నవించేందుకు రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ప్రజలు, కార్యకర్తలు పార్టీ కార్యాలయానికి తరలివచ్చారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించిన మంత్రి లోకేష్.. వారినుంచి వినతులు స్వీకరించారు. నాలుగు గంటల పాటు దాదాపు 4 వేలమందికిపైగా కలిసి వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ప్రతి విజ్ఞప్తిని పరిశీలించి సిబ్బందికి అప్పటికప్పుడే ఆదేశాలు జారీచేశారు. కూటమి ప్రభుత్వంలో అందరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

వైఎస్సార్సీ పాలనలో అక్రమ కేసులతో పాటు ఆస్తులు లాగేసుకున్నారు టిడిపి కార్యకర్తనైన తనపై వైఎస్సార్సీ పాలనలో అక్రమ కేసులు నమోదు చేయడంతో పాటు ఆ పార్టీ నేతల ప్రోద్బలంతో తన భూమిని బలవంతంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, విచారించి తగిన న్యాయం చేయాలని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం బుడ్డేపుపేట గ్రామానికి చెందిన దనపాన హరికృష్ణ మంత్రి నారా లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. విచారించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసాఇచ్చారు. తనకు వారసత్వంగా సంక్రమించిన వ్యవసాయ భూమిని తప్పుడు పత్రాలతో కబ్జా చేసేందుకు వైఎస్సార్సీ కార్యకర్త అన్నలదాసు జోసెఫ్ యత్నిస్తున్నారని, విచారించి తగిన న్యాయం చేయాలని గుంటూరు జిల్లా కాకుమాను గ్రామానికి చెందిన మెరిగల రవిబాబు మంత్రి నారా లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి ఫలితం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. టిడిపి సానుభూతిపరుడిననే కక్షతో >>2



గూడ్సు బోగీలపైకి ఎక్కిన రైలు ఇంజన్

# గూడ్సును ఢీకొన్న ప్యాసింజర్ రైలు

2లో

## బిలాస్‌పూర్‌లో దారుణం.. దెబ్బతిన్న 3 బోగీలు

### 10 మంది మృతి, పలువురికి తీవ్ర గాయాలు

# 'భోగాపురం' 90% పూర్తి



మంగళవారం మీడియాతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

## ఇది దేశం గర్వించే విమానాశ్రయం: కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**విశాఖపట్నం, నవంబరు 4, ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచాన్ని గెలిచే శక్తి ఉత్తరాంధ్రకు ఉందని.. అందుకు వనరుగా భోగాపురం విమానాశ్రయం ఉపయోగపడాలని కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. మంగళవారం ఆయన భోగాపురం విమానాశ్రయ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, ఎస్పీ ఎ. ఆర్. దామోదర్ స్థానిక ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే లోకం మాధవి, మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, కలసి పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రామ్మోహన్ నాయుడు మాట్లాడారు. రెండు నెలల క్రితం తాను పరిశీలనకు వచ్చేసరికి విమానాశ్రయ నిర్మాణ పనులు 86.61 శాతం పూర్తి అవ్వగా.. నేడు.. 91.70 శాతానికి చేరుకుందని తెలిపారు. కూటమి సర్కారు ఏర్పడిన తొలిరోజుల్లో.. తాను కేంద్రమంత్రిగా బాధ్యతలు తీసుకున్నసందర్భంలో సిఎం నారా చంద్రబాబునాయుడు.. >>2



మంగళవారం సిఎం చంద్రబాబుతో భేటీ అయిన భారత హై కమిషనర్ విక్రమ్ దొరైస్వామి

## 'భోగాపురం' 90% పూర్తి

>> ఒక ఛాలెంజ్ గా ప్రాజెక్టు తీసుకొన్నామని.. దానికి దీటుగానే డెడ్ లైన్ డిసెంబర్ 2026 కన్నా ముందుగానే వచ్చే సంవత్సరం జూన్ నాటికి విమానాశ్రయాన్ని ప్రారంభిస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. ఇంకా కేవలం 8.3 శాతం పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని.. ఈలోగా ఈ డిసెంబర్, జనవరి నాటికి వ్యాలిడేషన్ ఫ్లైట్స్ నడపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సిఎం చంద్రబాబును నాయుడు ఆహ్వానించనున్నట్లు తెలిపారు. స్థానికంగా ఏవియేషన్ యూనివర్సిటీకి కూడా చంద్రబాబు నాయుడు ఆలోచనతో ముందుకు వెళ్తున్నట్లు స్పష్టం చేశారు. గడచిన పదకొండేళ్ళ నెలలో ప్రధాని మోదీ మార్గదర్శకంలో దేశంలో అనేక కోట్ల విమానాశ్రయాలు నెలకొల్పామని.. అంతకుమించిన వృద్ధిని భోగాపురంలో చూస్తామని రామ్మోహన్ నాయుడు స్పష్టంచేశారు. భోగాపురం విమానాశ్రయంలో జరుగుతున్న పనుల తీరుపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈనెల 14,15 తేదీల్లో ఇన్వెస్టర్ సమ్మిట్ విశాఖలో జరగనుందని.. విమానయాన శాఖకు సంబంధించి కూడా స్థానికంగా అభివృద్ధికి ఐదువందల ఎకరాలు అందుబాటులో ఉండేట నేపథ్యంలో.. అందుకోసం సమ్మిట్లో డెమోనిస్ట్రేషన్ కూడా సిద్ధం చేసినట్లు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ప్రధాని మోడీని ఆహ్వానించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని.. అల్లూరు సీతారామరాజు పేరుతోనే విమానాశ్రయం ప్రారంభం అవుతుందని స్పష్టంచేశారు.



శ్రీశైలం డ్యాం వ్యూపాయింటు వద్ద జారిపడ్డ కొండరాయి

# సమృద్ధిగా జలరవాణా వనరులు

>> మాంచెస్టర్ యూనివర్సిటీ నుంచి నానోసైన్స్ ప్రొఫెసర్ రాధాబోయా, ఏఐ పాలసీ ల్యాబ్స్ ఫౌండర్ డైరెక్టర్ ఉదయ్ నాగరాజు, ఫ్యుయెంట్ గ్రిడ్ ప్రెసిడెంట్ రత్న గారపాటి, బ్రిటిష్ హెల్త్ ఇండస్ట్రీ అసోసియేషన్ ప్రతినిధి పాల్ బెంటన్ తదితరులు హాజరయ్యారు. ఏపీలో టెక్నాలజీ రంగాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయని.. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కాబోతోందని సిఎం వివరించారు. అమరావతిలోనూ వచ్చే జనవరి నాటికి ఏఐ క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ ప్రారంభం కానుందని తెలిపారు. ఏపీలో ఏఐ వినియోగం, నిపుణుల తయారీ వంటి అంశాలతో పాటు ఎకోసిస్టం అభివృద్ధికి ఉన్న అవకాశాలను కూడా పరిశీలించాలని సిఎం స్పష్టం చేశారు. అలాగే అరుదైన భూగర్భ ఖనిజాల వెలికితీతపై వివిధ యూనివర్సిటీలు కూడా భాగస్వామ్యం వహించాలని తద్వారా వాటిని వెలికితీసి ప్రపంచ అవసరాలకు వినియోగించే అవకాశం ఉందని సిఎం స్పష్టం చేశారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**సిఎంతో భారత హైకమిషనర్ భేటీ**

లండన్‌లోని భారత హైకమిషనర్ విక్రమ్ దొరైస్వామి సిఎం చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. యుకెలోని వివిధ యూనివర్సిటీలు ఏపీతో నాలుగు అంశాల్లో భాగస్వామ్యం ఏర్పాటు చేసుకునే అంశంపై చర్చించారు. ఏపిలో ఆయా యూనివర్సిటీ కేంద్రాలను ప్రారంభించే అంశం, కేంద్రం సహకారంతో జాయింట్ వెంచర్లు ఏర్పాటు చేసుకునే అంశంపై ఇరువురు చర్చించారు. అక్కడి యూనివర్సిటీలు ఇక్కడి విద్యా సంస్థలతో భాగస్వామ్యాలు కుదుర్చుకునే అంశంపై చర్చించారు. అలాగే యూనివర్సిటీలు, విద్యాసంస్థల మధ్య విద్యార్థుల ఎక్స్ఛేంజ్ అంశం, లైఫ్ సైన్సెస్, బయో జెనెటిక్స్, ఖనిజాల వెలికితీత, మెటల్స్ అంశాల్లో ఏపీ యుకె యూనివర్సిటీల మధ్య భాగస్వామ్యాల ఏర్పాటు గురించి చర్చ జరిపారు. అలాగే ఎఐ, సెమీ కండక్టర్, స్పేస్ టెక్నాలజీ, కోర్ ఇంజనీరింగ్, మెరైన్ ఇండస్ట్రీ 4.0 లో సహకారం గురించి కూడా ఇరువురు మధ్య చర్చ జరిగింది.మరో వైపు అమరావతిలో వచ్చే జనవరి నాటికి ఎఐ,క్వాంటం కంప్యూటింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని సిఎం చంద్రబాబు తెలిపారు. లండన్‌లో పారిశ్రామికవేత్తలు,వివిధ రంగాలకు చెందిన నిపుణులతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సాంకేతిక రంగంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలు,ప్రభుత్వ ప్రోత్సాహకాలను వివరించారు. విశాఖలో ఈ నెల 14,15 తేదీల్లో జరుగనున్న భాగస్వామ్య సదస్సుకు వారిని ఆహ్వానించారు. ఏపిలో ఉన్న అంతర్గత జల రవాణా మార్గాల ద్వారా అతి తక్కువ ఖర్చుతో సరకు రవాణా చేసేందుకు అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలను వివరించారు. 'లాజిస్టిక్ కారిడార్ ద్వారా ఏపిని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఏఐ వినియోగం,నిపుణుల తయారీ వంటి అంశాలతో పాటు ఎకోసిస్టం అభివృద్ధికి ఉన్న అవకాశాలను పరిశీలించండి. అరుదైన భూగర్భ ఖనిజాల వెలికితీతకు వివిధ విశ్వవిద్యాలయాలు కూడా భాగస్వాములు కావాలి.వీటిని వెలికి తీయడం ద్వారా ప్రపంచ అవసరాలకు వాటిని వినియోగించవచ్చు' అని చంద్రబాబు పేర్కొన్నారు. సమావేశంలో ప్రముఖ నిర్మాణ సంస్థ ఆరుప్ గ్లోబల్ ఎక్స్పర్ట్ డైరెక్టర్ జేమ్స్ కెన్నీ,డిజిటల్ రిస్క్ మేనేజ్‌మెంట్ కంపెనీ అల్టెరిన్,టెక్ ఎగ్జిక్యూటివ్ వైరెక్టర్ ఫ్రెడీ పూలాండ్,పీజీ పేపర్ కంపెనీ సీఈఓ పూనమ్ గుప్తా,బడ్లీఎంజీ యూనివర్సిటీ నుంచి గౌరవ్ మార్వాహా,నానోసైన్స్ ప్రొఫెసర్ రాధాబోయా,ఏఐ పాలసీ ల్యాబ్స్ ఫౌండర్ డైరెక్టర్ ఉదయ్ నాగరాజు,ఫ్యుయెంట్ గ్రిడ్ ప్రెసిడెంట్ రత్న గారపాటి,బ్రిటిష్ హెల్త్ ఇండస్ట్రీ అసోసియేషన్ ప్రతినిధి పాల్ బెంటన్ తదితరులు పాల్గొన్నారు.

## 'కల్తీ నెయ్యి'లో మరికొందరు?

**ఇక సిట్ దర్యాప్తు కీలకం • 2022 నుంచి 24 దాకా నెయ్యి సరఫరా మూలాలపై ఆరా**

**తిరుమల, నవంబరు 4, ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి భక్తులు ఎంతో పవిత్రంగా భావించే తిరుమల లడ్డూప్రసాదం తయారీకి కల్తీనెయ్యి సరఫరా బాగోతం వెనుక సిబిఐ సిట్ ప్రస్తుత దర్యాప్తు కీలకంగా మారింది. ఇప్పటికే ఈ కేసులో తొలినుండిధారిగా భావించిన టిటిడి బోర్డు మాజీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి అంతరంగికుడు,వ్యక్తిగత సహాయకుడు చిన్నఅప్పన్నను గతవారం సిట్ అరెస్ట్ చేసి కటకటాల వెనక్కుపంపింది. అతని నుండి రాబట్టిన కీలక సమాచారంతో ఇప్పుడు ముందుకు కదులుతోంది. ఈకల్తీనెయ్యిపావంలో ఇంకెందరికి ఉచ్చు బిగియనుందనేది టిటిడి వర్గాల్లో సంచలనం కలిగిస్తోంది. 2022వ సంవత్సరం నుండి 2024 ఏప్రిల్ వరకు సరఫరా అయిన కల్తీనెయ్యి ఉదంతంలో రాజకీయ అధికారులతో బాటు టిటిడీమార్కెటింగ్, కొనుగోళ్ళ విభాగంలో కూడా అరెస్టులు తప్పవనేది భయంగొల్పుతోంది. బోలేబాబా డెయిరీ నుండి నెయ్యి సరఫరా జరగడం, ఆ తరువాత నాలుగు డెయిరీలకు నెయ్యిసరఫరా చేసే టెండర్లు అప్పగించడం కూడా చర్చనీయాంశమైన వ్యవహారంలోనే సాగాయనేది సిట్ రాబట్టిన కీలక సమాచారం. ఈ సమాచారంతోనే మిగతావారిగురించిలో మాజీలను విచారణకు పిలిచేందుకు నోటీసులు జారీ కానున్నాయనేది తెలుస్తోంది. 2022లోనే కల్తీనెయ్యి వ్యవహారం అప్పటి బోర్డు తీవ్రంగా పరిగణించినా ఎందుకు కేసు నమోదు చేయలేదు? నెయ్యి నాణ్యతపై పరిశీలనకు మైసూరుల్యాబ్‌కు పంపవపోవడం వెనుక కథనడిపిన కీలక సూత్రధారి ఎవరు అనేది తేల్చే పనిలో సిట్ అధికారులు నిమగ్నమయ్యారు. 2021 నుండి 2024వరకు నాలుగేళ్లలో 250కోట్ల రూపాయలు విలువైన 68లక్షల కిలోల నెయ్యిని టిటిడి సరఫరా చేసుకుందనేది సమాచారం. ఈ వ్యవహారంలో ఎంతమొత్తంలో కమీషన్ల రూపంలో చేతులు మారాయనేది ప్రాథమికంగా ఆధారాలు సిట్ చేతికి జిక్కాయి.

## శ్రీశైలం ఘాట్‌లో విరిగిపడ్డ కొండ చరియలు

### శ్రీశైలం రోప్‌వే వద్ద జారిపడ్డ బండరాయి

**శ్రీశైలంప్రాజెక్టు, నవంబరు4,ప్రభాతవార్త:** గత రెండు రోజుల నుండి కురుస్తున్న బారీ వర్షాల కారణంగా శ్రీశైలం,సుండిపెంటలో వర్షం నీరు పొంగిపొర్లుతున్నాయి.రహదారులన్ని నీటి మడుగులతో నిండుకునా న్నయి.వర్షం నీటితో కొన్ని ప్రాంతాల్లో వాహనదారులు,పాదచారులు ఇబ్బందులకు గురి అయ్యారు.ఈ నేపథ్యంలోనే శ్రీశైలం టు హైదరాబాద్ రహదారి ఘాట్ డ్యాం వ్యూపాయింట్ స్వీచ్ యార్డ్ మధ్యలో కొండ మీద నుండి రాళ్లు జారి రోడ్డు ప్రక్కన పడ్డాయి.రాళ్లు జారిపడే క్రమంలో చెట్లు కూడా విరిగిపడ్డాయి.కొండ రాళ్లు జారిపడే క్రమంలో వాహనాల రాకపోకలు లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం లేదు.హైదరాబాద్,శ్రీశైలంకు వచ్చే వాహనాల రాకపోకలు కొనసాగుతునా న్నయి.అదే విధంగా శ్రీశైలంలో పాతళగంగ రోప్‌వే వద్ద పెద్ద బండరాయి జారి క్రిందకు పడింది.దానితోపాటు చెట్లు కూడా విరిగిపడ్డాయి. సమీపంలో అటువైపు ఎవ్వరు లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం లేదు.భక్తులు పాతళగంగ వైపు పుణ్యస్నానాలు అచరించే రహదారి కావడంతో విరిగిపడ్డ చెట్లను తొలగించే పనిలో అధికారులు, స్థానికులు నిమగ్నం అయ్యారు.

## గూడ్సును ఢీకొన్న ప్యాసింజర్ రైలు

**బిలాస్‌పూర్, నవంబరు 4:** ప్రయాణీకులతో వెళుతున్న మెమూరైలు ఎదురుగా వస్తున్న సరుకురవాణా గూడ్స్ రైలును ఢీకొనడంతో కనీసం పది మంది మృతిచెందారు. మరికొందరికి తీవ్ర గాయాలయ్యాయి. బిలాస్‌పూర్‌లో మంగళవారం జరిగిన ఈప్రమాదంలో అనేక కోచ్‌లు పట్టాలు తప్పాయి. కాగామెము రైలు ముందుభాగం గూడ్స్ కంపార్టుమెంట్లపైకి ఎక్కింది. సీనియర్ రైల్వే అధికారులు, స్థానిక యంత్రాంగం మొత్తం స్పాట్‌కు చేరుకుని ప్రయాణీకులను రైలునుంచి దిగి ప్రత్యామ్నాయ రైళ్లలో పంపించారు. సాయంత్రం నాలుగు గంటలప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. వెంటనే అన్ని కోచ్‌లను తప్పించారు. తీవ్ర గాయాలపాలయిన వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. మెమూరైలు కోర్బాప్యాసింజర్ రైలు అని అధికారులు తెలిపారు. మొదటి రెండు బోగీలు, మొట్టమొదటి రిజర్వు బోగీ కూడా తీవ్రస్థాయిలో దెబ్బతిన్నది. రైల్వే అధికారులు బాధితుల సమాచారం కోసం అత్యవసర నంబర్లు ప్రకటించారు. అలాగే మృతుల కుటుంబాలకు తక్షణ పరిహారంకూడా ప్రకటించారు. మృతులకుటుంబాలకు రూ.10 లక్షలుచొప్పున తీవ్ర గాయాలపాలయినవారికి రూ.5లక్షలు చొప్పున మంజూరుచేసారు. అలాగే ప్రమాదంలో ఒకమోస్తరు గాయాలుపాలయినాసరే వారికి లక్ష పరిహారం తక్షణఖర్చుల కింద చెల్లిస్తున్నట్లు రైల్వేశాఖప్రకటించింది.

## ట్రక్కును ఢీకొన్న కారు

>> మిది మందిలో ఆరుగురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానిక వాహనదారులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వాహనంలో ఇరుక్కుపోయిన మృతదేహాలను వెలికి తీసి పోస్ట్‌మార్టం నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం రోడ్డుకు అడ్డంగా ఉన్న ట్కక్కు కారును క్రేన్ సాయంతో పక్కకు తీసి ట్రాఫిన్ క్లియర్ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## గ్రామీణ రోడ్లకు2000 కోట్లు

>> లకు దిశానిర్దేశం చేశారు. రహదారుల నాణ్యతలో రాజీపడబోమని పవన్ కల్యాణ్ తెలిపారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో సమన్వయంతో ముందుకు సాగుతున్నాయి. ప్రతి నియోజకవర్గంలో రోడ్లు మెరుగుపడే విధంగా నిధులు సమకూరుస్తున్నాము. ఎక్కడా నాణ్యత విషయంలో రాజీపడవద్దు. రహదారుల నిర్మాణంలో నిబంధనలకు అనుగుణంగా, ప్రమాణాలు పాటిస్తున్నారో లేదో పరిశీలించాల్సిన బాధ్యత అధికారులదే అన్నారు. రోడ్ల నిర్మాణం విషయంలో గత ప్రభుత్వం పూర్తి అలక్ష్యంతో వ్యవహరించింది. వివిధ మార్గాల్లో రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు వచ్చే వెసులుబాటు ఉన్నప్పటికీ, దానిని విస్మరించింది. కూటమి ప్రభుత్వం కేంద్ర సహకారంతో ఎప్పటికప్పుడు రాష్ట్రంలోని వివిధ అభివృద్ధి పనులకు నిధులు సాధిస్తోంది. గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కృతజ్ఞతలు తెలియచేస్తున్నామన్నారు. నిధులు పొందటంలో, వాటిని వినియోగించే ప్రక్రియలో సిఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు తగిన సూచనలు అందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందించాలని కృత నిశ్చయంతో ఉంది. ఇందులో అధికార యంత్రాంగం కీలక భూమిక పోషించాలన్నారు.

## జోగి బ్రదర్స్ కస్టడీకోసం ఎక్సైజ్ పోలీసుల పిటిషన్

**విజయవాడ,నవంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** నకిలీ మద్యం కేసులో నిందితులు జోగి రమేష్, జోగి రాములను కస్టడీకి కావాలని కోరుతూ భవానీపురం ఎక్సైజ్ పోలీసులు పిటిషన్లు దాఖలు చేశారు. 10 రోజుల పాటు కస్టడీకి కావాలని కోరుతూ పిటిషన్‌లో పేర్కొన్నారు. నిందితుల నుంచి నకిలీ మద్యం తయారీ కుట్రపై కీలక విషయాలు రాబట్టాల్సి ఉందన్నారు. పిటిషన్లపై విజయవాడ ఎక్సైజ్ కోర్టు విచారణ జరిపింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది. తదుపరి విచారణను న్యాయస్థానం ఈనెల 4కి వాయిదా వేసింది.ఈ కేసులో ఏ18గా జోగి రమేష్, ఏ19గా జోగి రాములు ఉన్నారు. ప్రస్తుతం నిందితులు జోగి బ్రదర్స్ నెల్లూరు కేంద్రకారాగారంలో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. మరోవైపు నకిలీ మద్యం కేసులో నిందితులు జనార్ధనరావు, జగన్మోహన రావులను మరోసారి కస్టడీకి కోరుతూ ఎక్సైజ్ అధికారులు దాఖలు చేసిన పిటిషన్ పై న్యాయస్థానం విచారణ జరిపింది. 5 రోజులపాటు కస్టడీకి కావాలని ఎక్సైజ్ అధికారులు కోరారు. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 6వ తేదీకి వాయిదా వేసింది.నకిలీ మద్యం కేసులో తిరుమలశెట్టి శ్రీనివాసరావు కస్టడీ ముగిసింది. శ్రీనివాసరావును ఎక్సైజ్ అధికారులు ఐదు రోజులపాటువిచారించారు. కస్టడీముగియడంతో నెల్లూరు జైలుకు శ్రీనివాసరావును తరలించారు. ఇప్పటికే జోగి రమేష్, జోగి రామునుసైతం నెల్లూరు జైలుకు తరలించారు. జోగిరమేష్, ఆయన సోదరుడు రాముకు ఈనెల 13 వరకు రిమాండ్ విధించిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకూ నకిలీ మద్యం కేసులో నిందితుల సంఖ్య 23 కి చేరింది. నకిలీ మద్యం కేసులో ఏ18గా జోగి రమేష్, ఏ19గా జోగి రాము, ఏ20గా మనోజ్ కొఠారి, ఏ21గా సుదర్శన్, ఏ22గా సింధిల్, ఏ 23గా ప్రసాద్ ఉన్నారు.

## మద్యం కుంభకోణంలో ఎ-49గా అనిల్ చోఖ్రా

**విజయవాడ, నవంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** వైఎస్సార్సీ హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణం కేసు నిందితుల జాబితాలో మరొకరు చేరారు. ముడుపుల సొమ్ము రూటింగ్,మనీ లాండరింగ్ కోసం పెద్ద ఎత్తున డొల్ల కంపెనీలు ఏర్పాటు చేసిన ముంబయి వాసి అనిల్ చోఖ్రాను 49వ నిందితుడిగా చేరుస్తూ సిట్ అధికారులు తాజాగా విజయవాడ ఎసిబి కోర్టులో మెమో దాఖలు చేశారు. గత ప్రభుత్వంలో అత్యధికంగా మద్యం సరఫరా ఆర్డర్లు దక్కించుకున్న అదాన్ డిస్టిలరీస్, ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్, లీలా డిస్టలరీస్ సంస్థలు నాటి ప్రభుత్వ పెద్దలకు ముడుపులుగా చెల్లించాల్సిన మొత్తాన్ని ఓల్విక్ మల్టీ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్(ఉ11), క్రిపాటి ఎంటర్ ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్(ఎ 12), నైన్న మల్టీ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్(ఎ13), ట్రిఫెర్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్(ఉ14), విక్సో ఎంటర్‌ప్రైజెస్ (ఎ15) తదితర డొల్ల కంపెనీల ఖాతాల్లో జమ చేసేవి. అక్కడి నుంచి మరికొన్ని కంపెనీల ద్వారా రెండు మూడు అంచెల్లో రూటింగ్ జరిగి, చివరిగా ముడుపుల సొమ్ము నగదు రూపంలో వైకాపా ముఠాకు, అంతిమ లబ్ధిదారుకు చేరేది.

ఈ అక్రమ దందా కోసం పైన పేర్కొన్న డొల్ల కంపెనీలన్నీ అనిల్ చోఖ్రాయే ఏర్పాటు చేసినట్లు సిట్ గుర్తించింది. రికార్డుల్లో పేర్కొన్న చిరునామాల్లో అలాంటి కంపెనీలేవీ లేవని తేల్చింది. ఈ నేపథ్యంలో మరింత సమాచారం రాబట్టేందుకు మూడు రోజులుగా సిట్ బృందాలు ముంబయిలో సోదాలు చేస్తున్నారు. అనిల్ చోఖ్రాను ప్రశ్నిస్తున్నాయి.

మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద అనిల్ చోప్రాపై అనేక కేసులున్నాయి. గతంలో ఆయన్ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి) అరెస్ట్ చేసింది. ముంబయి విడిచిపెట్టి వెళ్ళకూడదనే షరతుతో తర్వాత బెయిల్ లభించింది.

## ఎపిని మారుస్తాం

>> రంగాల్లో 14దేశాల్లో ప్రసిద్ధి పొందిన అపరెల్ గ్రూప్‌ను ఆహ్వనించారు.ట్రాన్స్ వరల్డ్ గ్రూప్ చైర్మన్ రమేష్ రామకృష్ణన్‌తో భేటీ అయిన అనంతరం షిప్పింగ్, లాజిస్టిక్స్ రంగంలో దుబాయ్ కేంద్రంగా అనేక దేశాల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్న ట్రాన్స్‌వరల్డ్ గ్రూప్‌ను రావలసిందిగా కోరారు.రాష్ట్రంలో లాజిస్టిక్స్ రంగం అభివృద్ధికి సిఎం చంద్రబాబునాయుడు తీసుకుంటున్న నిర్ణయాలను వివరించిన మంత్రి ఎపిని లాజిస్టిక్ హబ్‌గా మార్చేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు.ఇందులో భాగంగా ఈనెల 14,15తేదీల్లో విశాఖలో జరిగే భాగస్వామ్య సదస్సుకు హాజరు కావాలని ఆయా కంపెనీలకు ఆహ్వానం పలికారు మంత్రి నారాయణ.

## రాష్ట్రంలో పిడుగులతో కూడిన వర్షాలు

**విజయవాడ, నవంబరు 4, ప్రభాతవార్త ప్రతినిధి:** వాతావరణంలో నెలకొన్న పరిస్థితులతో ఏపీలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్‌జైన్ తెలిపారు. కోస్తా తీరానికి ఆనుకుని పశ్చిమమధ్య బంగాళా ఖాతంలో సముద్ర మట్టానికి సగటున 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని ఎండీ ప్రఖర్‌జైన్ వెల్లడించారు ఆవర్తనం ప్రభావంతో బుధవారం కోనసీమ, కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, కడప, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వివరించారు. అలాగే మిగతా జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు.నెల్లూరు, రాయలసీమ జిల్లాల్లో ఎల్లుండఅక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.

## పర్యాటక పటంలోకి ఎపి

>> ఎపి సంస్కృతి ప్రతిబింబించేలా కూచిపూడి నృత్యంతో స్వాగతం పలికి, అరకు కాఫీని అందజేశారు. ఆంధ్రా ఫేమస్ పూతరేకులు రుచి చూపించారు. జీఐ ట్యాగ్ పొందిన ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలను ప్రదర్శించి వాటి ప్రత్యేకతలను, తయారీ విధానాన్ని వివరించారు.పలువురికి వాటిని బహుమతులుగా అందించారు. అనంతరం అంతర్జాతీయ మీడియా ప్రతినిధులతో మాట్లాడి రాష్ట్ర పర్యాటక రంగంలో తీసుకువచ్చిన నూతన పర్యాటక పాలసీ 2024-29, పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పన తదితర వివరాలను వెల్లడించి ఎపిలో పర్యాటక పెట్టుబడులను ఆహ్వానించారు. రాష్ట్ర పర్యాటక రంగంలో పెట్టుబడులు పెడితే భరోసా కల్పించే బాధ్యత మాది తెలిపారు. మంత్రి దుర్గేష్ భేటీ అయిన వారిలో పికాక్ టూర్ కంపెనీ సిఇఒ కన్నన్ శివనాథన్, రష్యాతో పాటు వివిధ దేశాలకు చెందిన అంతర్జాతీయ ట్రావెల్ ఎగ్జిబిటర్లు, మైనా ట్రావెల్ ఎండీ, మైస్ ఇన్వెస్టర్లు, 500 హోటల్స్ చైన్ యాజమాన్యం, సిగ్నేచర్ హాస్పిటాలిటీ గ్రూప్ సీఈవో రమేశ్ అరోరా, రాజస్థాన్ ఉప ముఖ్యమంత్రి తదితరులు ఉన్నారు. హై కమిషనర్ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేసిన డిన్నర్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ పర్యాటకాన్ని విశ్వవ్యాప్తం చేయడమే తమ లక్ష్యమని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.

## దొనకొండలో ప్రపంచస్థాయి కేన్సర్ సెంటర్

### దక్షిణ కొరియాకు చెందిన వరల్డ్ స్మార్ట్ సిటీస్ ఫోరం చైర్మన్ వెల్లడి

**విజయవాడ, నవంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రకాశం జిల్లా దొనకొండలో 25 ఎకరాల విస్తీర్ణంతో సుమారు రూ.4,260 కోట్ల (480 మిలియన్ డాలర్ల) వ్యయంతో 'చున్ జియాంగ్ ఉన్ చల్లా క్యాన్సర్ సెంటర్'ను నిర్మించనున్నట్లు దక్షిణ కొరియాకు చెందిన వరల్డ్ స్మార్ట్ సిటీస్ ఫోరం చైర్మన్ పీటర్ చున్ వెల్లడించారు. వరల్డ్ స్మార్ట్ సిటీస్ ఫోరం, చల్లా గ్రూప్, ఒమెక్సా బయాలజీస్,మేస్, ఐ హోల్డింగ్ సంస్థల భాగస్వామ్యంతో ఈ సెంటర్‌ను నిర్మించనున్నట్లు ఆయన ప్రకటించారు. విజయవాడలోని ఓ హోటల్‌లో సమావేశమైన ఆయా సంస్థల ప్రతినిధులు ప్రపంచస్థాయి క్యాన్సర్ సెంటర్ నిర్మాణానికి అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. అనంతరం విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పీటర్ చున్ మాట్లాడుతూ చున్ జియోంగ్ ఉన్ క్యాన్సర్ సెంటర్‌ను చెన్నైలో ప్రారంభించామన్నారు. స్మార్ట్ మెడికల్ సిటీ ప్రాజెక్టులో భాగంగా క్యాన్సర్ డయాగ్నసిస్, అంకాలజీ, క్యాన్సర్ చికిత్స, శస్త్రచికిత్సలు, 1500 పడకలతో ఇన్ పేషెంట్ వార్డు,నర్సింగ్ హాస్పటల్, మెడికల్ స్కూలు, హెలిపోర్ట్, హోటల్, నివాస సముదాయం, రెస్టారెంట్లు, బొటానికల్ గార్డెన్, పార్కు, క్యాన్సర్ మ్యూజియం, ఆరోగ్య సాంకేతిక కేంద్రం తదితరాలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈ ప్రాజెక్టుతో 4 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు.

'నేను ప్రకాశం జిల్లా వాసిని...నాకు జన్మ నిచ్చిన ప్రాంతంలో క్యాన్సర్ సెంటర్‌ను ఏర్పాటుచేయడం ఆనందంగా ఉంది. రాష్ట్ర అభివృద్ధికి పాటుపడాలన్న సిఎం చంద్రబాబు పిలుపుతో మరికొన్ని ప్రాజెక్టుల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నాం' అని చల్లా గ్రూప్ చైర్మన్ చల్లా ప్రసాద్ చెప్పారు. ఒమెక్సా కో ఫౌండర్ డాక్టర్ రాజన్ గార్గ్ మాట్లాడుతూ పేదలకు మేలు చేసేలా అత్యాధునిక వైద్య సదుపాయాలతో క్యాన్సర్ సెంటర్‌ను నిర్మిస్తామని తెలిపారు. తాము సేవలను విస్తరించాలనే ఆలోచనలో ఉన్నప్పుడు చల్లా గ్రూప్ అధినేత చల్లా ప్రసాద్ సూచన మేరకు ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకున్నట్లు తెలిపారు. అనుమతులు రాగానే నిర్మాణాన్ని ప్రారంభిస్తామన్నారు.

## వారం - వర్జ్యం

05-11-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
కార్తీకమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
○ పౌర్ణమి సా.6.48
అశ్విని ఉ.9.39, స్వాతి కార్తె
వర్జ్యం : సా.6.01-7.25
దు.ఉ.11.29-12.15
శుభసమయం:.6.15-6.50, సా.4.30-5.30
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** గృహ నిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. నూతన ప్రయత్నాలు లాభిస్తాయి. సంఘంలో ప్రత్యేక గౌరవం లభిస్తుంది.

**వృషభం:** దూర ప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. నూతన వ్యాపారాలు పురోభివృద్ధి ఉంటాయి.

**మిథునం:** ఉద్యోగాలలో మంచి మార్పులు ఉంటాయి. ఆర్థిక పరిస్థితి అనుకూలం. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం.

**కర్కాటకం :** మీ మాట తీరు కొంత కటువుగా, ఎదుటి వారిని నొప్పించే విధంగా ఉంటుంది. జాగ్రత్త అవసరం.

**సింహం:** కుటుంబ సమస్యలు కొంత వరకు తీరుతాయి. వాహన యోగం. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**కన్య :** ఓర్పు, నేర్పుతో ముందుకు సాగుతారు. వృత్తి వ్యాపారాలలో లాభాలు పొందుతారు. నూతన కాంట్రాక్టులు లభిస్తాయి.

**తుల :** నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. వస్త్రాల కొనుగోలు. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా వుంటుంది.

**వృశ్చికం:** చిన్ననాటి మిత్రు సహాయ సహకారాలతో నూతన కార్యక్రమానికి శ్రీకారం చుడతారు.ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం.

**ధనుస్సు:** మాట మీద నిలకడ లేని మనుషుల వల్ల కొన్ని ఇబ్బందులు ఎదురవుతాయి. జాగ్రత్తలు అవసరం.ఉద్యోగులకు బదిలీల సూచన.

**మకరం:** వ్యవహారాలలో తొందరపాటు వద్దు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్త అవసరం. నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు.

**కుంభం:** మీ ఆలోచనా విధానం మంచి మార్పు వస్తుంది. స్వల్ప ధనలాభం. సాంకేతిక విద్యావకాశాలు లభిస్తాయి.

**మీనం :** దూరపు బంధువుల నుండి వచ్చిన వార్త ఆనందం కలుగుతుంది. భూ వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకోవాలి

>> వైయస్ జగన్ ప్రకటించారు. మొంథా తుపాన్ వల్ల నష్టపోయిన పంటలు పరిశీలించడంతో పాటు, రైతులను పరామర్శించేందుకు వైయస్ జగన్ కృష్ణా జిల్లా పెనమలూరు, పెడన, పామర్రు, మచిలీపట్నం నియోజకవర్గాలలో పర్యటించారు. తాడేపల్లి నుంచి బయలుదేరిన ఆయనకు అడుగడుగునా జనం నీరాజనం పలికారు. మరోవైపు ప్రతిచోటా పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినా రోప్‌పార్టీలు, బారికేడ్లు ఛేదించుకుని జనం, అభిమానులు తరలిరాగా, రైతులు తమ గోడు చెప్పుకున్నారు. మొంథా తుఫాన్ ఎపిలో విధ్వంసమే సృష్టించింది. మంగళవారం కృష్ణా జిల్లాలో వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ తుఫాన్ బాధిత రైతులను కలిశారు. పంట నష్టంపై ఆరా తీశారు. ప్రభుత్వం నుంచి ఏ మేరకు సాయం అందిందని ఆయన అడిగి తెలుసుకున్నారు. రైతుల్ని ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైతు పరిస్థితి తెలుసుకోవాలంటే గ్రౌండ్ లోకి తిరిగి చూస్తే అర్థం అవుతుంది. ఈ ప్రభుత్వం నిర్లక్ష్యంగా, నిర్దయగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. గోదావరి జిల్లాల నుంచి కర్నూల్ వరకు తుఫాను ఎఫెక్ట్ ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. గతంలో ఎప్పుడూ ఊహించని విధంగా పంట పొలాలు మొత్తం నీట మునిగాయి. తీవ్ర గాలులకు పంటలు దెబ్బతిన్నాయి. రైతుల ఆరుగాలంకష్టం కోల్పోయారు. పత్తి, మొక్క జొన్న, బత్తాయి పంటలు నాలుగు లక్షల ఎకరాల్లో మునిగాయి. 18 నెలల చంద్రబాబు ప్రభుత్వంలో 16 సార్లు ప్రకృతి విపత్తులు సంభవించాయి. 18 నెలలుగా ఒక్క రైతుకైనా ఇన్‌ఫుట్ సబ్సిడీ ఇచ్చారా..? ఇన్సూరెన్స్ డబ్బులు, పెట్టుబడి సాయం అందిందా..? అనినిలదీశారు ప్రభుత్వాన్ని నిలదీశారు. పూర్తిగా ఈ ప్రభుత్వం రైతుల వెన్ను విరిచిందని ఆయన విమర్శించారు. చివరికి రైతులకు ఉచిత పంటల బీమా కూడా లేకుండా పోయింది. ఒక్కొక్క రైతు వేల రూపాయల నుంచి లక్షల్లో నష్టపోయారు. ఎరువులు కూడా బ్లాకులో కొనుక్కోవాల్సి వచ్చింది. ఇంత దారుణ పరిస్థితులు గతంలో ఎప్పుడూ లేవు. ఇన్ని కష్టాలతో పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవు. ప్రతీ అడుగులో కూడా రైతు నష్టపోతున్నారనన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు అండగా నిలబడ్డాం. ఒక్క రైతు కూడా భయపడలేదు.. మా ప్రభుత్వం అందరికీ భరోసా ఉంది. అన్న ఉన్నాడన్న ధైర్యంతో ఉండేవారు. డబ్బులు వస్తే తర్వాత సీజన్ పెట్టుబడి పెట్టడానికి డబ్బులు అందేవి.. ఏ రైతు కూడా ఈ ప్రభుత్వంలో సంతోషంగా లేరు. ఆర్బీకేల పరిధిలో సచివాలయంతో అనుసంధానమై ఈ క్రాప్ బుకింగ్ నమోదయ్యేది. రైతుకు ఎప్పుడు ఏ పంటకు ఇబ్బంది జరిగినా నష్టపరిహారం అందేది.. ప్రభుత్వం రైతులకోసం ఉంటుంది అనే భరోసా లభించేది. ఎక్కడ పంట రేట్లు తగ్గినా ప్రభుత్వం స్పందించేది.. మార్క్ ఫెడ్ ద్వారా మార్కెట్ లో కాంపిటీషన్ క్రియేట్ చేసి పంటలకు గిట్టుబాటు ధరలు ఇచ్చే వాళ్లం. సీఎం యాప్ సాయంతో గతంలో అన్నీ అందుబాటులో ఉండేవి.. 3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేశామని జగన్ గుర్తు చేశారు. ఈరోజు ఈ రైతు ఒకే విషయం చెప్పాడు. ఎక్కడా, ఏ రైతు వద్దకు, ఏ పొలం వద్దకు ఎవరూ

## అపూర్వ ఆదరణ

>> అతిథి అధ్యాపకుడిగా పనిచేస్తున్న తనను వైఎస్సార్సీ హయాంలో విధుల నుంచి తొలగించారని, తిరిగి తనకు ఉద్యోగ అవకాశం కల్పించాలని కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన ఉలిద్ర రవి మంత్రి నారా లోకేష్‌ను కలిసి విన్నవించారు. పరిశీలించి తగిన న్యాయం చేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖలోని పారామెడికల్ విభాగంలో ఖాళీగా ఉన్న హెల్త్ అసిస్టెంట్ మేల్ పోస్టుల భర్తీకి తగిన చర్యలు తీసుకోవాలని అన్ ఎంప్లాయిస్ పారా మెడికల్ హెల్త్ అసిస్టెంట్(మేల్) అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తిచేశారు. టీడీపీ పాలనలో ఎంపీహెచ్ ఏ మేల్ పోస్టులను భర్తీ చేశారు. గత కొన్నేళ్లుగా హెల్త్ అసిస్టెంట్ మేల్ పోస్టులకు సంబంధించి ఎలాంటి నోటిఫికేషన్లు ఇవ్వడం లేదని మంత్రిదృష్టికి తీసుకువచ్చారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు. ప్రకాశం జిల్లా అటవీ ప్రాంతంలోని గిరిజన చెంచు, ఆదివాసి గూడెంల్లో గిరిజన సంక్షేమ శాఖ ద్వారా నూతన పాఠశాలల మంజూరుకు తగిన చర్యలు తీసుకోవాలని నల్లమల గిరిజన చెంచు సంక్షేమ సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

# తిరుపతి జిల్లాకు కుంకీ ఏనుగులు అవసరం లేదు

### - డిఎఫ్ఓ సాయిబాబా

**తిరుపతి,నవంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి జిల్లాలో అటవీప్రాంతంలో ఉన్న పరిస్థితుల్లో కుంకీ ఏనుగులు అవసరం లేదని తిరుపతి డిఎఫ్ఓ సాయిబాబా తెలిపారు. చిత్తూరు జిల్లాకే ఎక్కువ అవసరం ఉంటుందన్నారు. అలిపిరి నడకమార్గంలో చిరుతపులుల సంచారంతో భక్తులకు ఇబ్బందులు లేకుండా లైటింగ్‌ను పెంచుతున్నట్లుచెప్పారు. మంగళవారం ఆయన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అలిపిరిలో 10, యూనివర్సిటీలో ఐదుమంది సిబ్బందిని నియమించి చిరుతల కదలికలను ట్రేస్ చేస్తున్నామన్నారు. వ్యర్థాలదగ్గర కుక్కలు, ఎలుకలు తిరుగుతున్నాయని, వాటిని తినడానికి చిరుతలు వస్తున్నాయని తెలిపారు. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే చిరుతల సంచారం ఉండదని డిఎఫ్ఓ కీలక వ్యాఖ్యలు చేశారు.



# శ్రీవారి ఆశీస్సులతో సకలం సుభిక్షం

### - మాజీ ఎస్ఇసి రమేశ్‌కుమార్

**తిరుమల,నవంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనంతో, స్వామివారి ఆశీస్సులందుకోవడం ఆనందంగా ఉందని మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ తెలిపారు. కార్తీక మాసంలో మంగళవారం ఉదయం కుటుంబసభ్యులతో కలసి ఆయన ఆలయం వద్దకు విచ్చేశారు. ఆలయ అధికారులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఆలయంలోపలకు చేరుకుని తొలుత ధ్వజ స్తంభానికి నమస్కరించారు. ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# కెసిఆర్ సిఎం కావాలని కోరుకున్నా

### - బిఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

**తిరుమల,నవంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** తెలంగాణరాష్ట్రంలో ఉన్న పరిస్థితుల్లో మళ్ళీ కెసిఆర్ ముఖ్యమంత్రి కావాలని కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవారిని వేడుకున్నానని బిఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. శ్రీవారి ఆశీస్సులతో అన్ని కార్యాలు సజావుగా జరుగుతున్నాయని, తెలంగాణ రాష్ట్రంలో మళ్ళీ కెసిఆర్ సిఎం కావాలని ఆయన ఆకాంక్షించారు. మంగళవారం ఉదయం తిరుమలకు వచ్చిన ఆయన ఉదయం విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

# వైఎస్సార్సీ అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్ పర్యటనలో అపశ్రుతి

**విజయవాడ,నవంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీఅధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కృష్ణా జిల్లాలో పర్యటిస్తున్నారు. పెనమలూరు నియోజకవర్గంలోని మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాలలో జగన్ పర్యటన చేపట్టారు. ఈ పర్యటనలో అపశ్రుతి చోటుచేసుకుంది. వైఎస్ జగన్ కాన్వాయిలో ప్రమాదం జరిగింది. ఉయ్యూరు మండలం గండిగుంట వద్ద జగన్ కాన్వాయ్ వాహనాలు ఒక దానికొకటి పరస్పరం ఢీకొన్నాయి. ఈ ఘటనలో పలువురికి గాయాలు అయ్యాయి. ఈ ప్రమాదం కారణంగా రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనాల రాకపోకలు నిలిచిపోవటంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

# కొల్లేరు సరస్సు అభివృద్ధి కోసం అథారిటీ ఏర్పాటు

**విజయవాడ ,నవంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** కొల్లేరు వన్యప్రాణి సంరక్షణా ప్రాంతం, రామ్సార్ స్థలంగా గుర్తింపు పొందిన సరస్సును సుస్థిరంగా అభివృద్ధి చేయడం, జీవ వైవిధ్యాన్ని కాపాడడం కోసం అథారిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కొల్లేరు సరస్సు పరిరక్షణ, అభివృద్ధి కోసం సమగ్ర ప్రణాళిక రూపొందించడం అథారిటీ కీలక లక్ష్యంగా ఉంది.పర్యావరణ కాలుష్యం నియంత్రణ, నీటి నాణ్యత మెరుగుదల. చేపల వైవిధ్యం రక్షణ, సుస్థిర మత్స్యాభివృద్ధి. పర్యాటక అభివృద్ధి ద్వారా స్థానిక ప్రజలకు ఆదాయ అవకాశాలు. జీవ వైవిధ్యం సంరక్షణ, ఆక్రమించే జాతుల నియంత్రణ. సిల్టేషన్ నియంత్రణ, నీటి ప్రవాహ వ్యవస్థ పునరుద్ధరణ. ప్రతి మూడు నెలలకోసారి సమావేశం జరిపి పురోగతి సమీక్ష చేస్తారు...అథారిటీకి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షుడుగా ఉంటారు. ఉపాధ్యక్షులుగా పర్యావరణ, అరణ్య, విజ్ఞాన సాంకేతిక శాఖ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ, ఫిషరీస్, వ్యవసాయం, పంచాయతీ రాజ్, వాటర్ రిసోర్సెస్, టూరిజం, పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి, జిల్లా కలెక్టర్లు (ఏలూరు, భీమవరం, మచిలీపట్నం), బయోడైవర్సిటీ బోర్డు, విల్ డెహ్రా సభ్యులుగా ఉంటారు.



సచివాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి

# రూ.113కోట్లతో గిరిజన వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కల్పన

### మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

**సచివాలయం,నవంబర్ 4,ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 9ఐటిడిఏ లోనున్న 757గిరిజన పాఠశాలల్లో మౌలికవసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం రూ.113 కోట్లను మంజూరు చేసినట్లు రాష్ట్రమహిళా అభివృద్ధి,శిశు సంక్షేమం,గిరిజన సంక్షేమ శాఖమంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు.ఇందులో రూ.83కోట్లను గిరిజన ఆశ్రమ పాఠశాలకు మరియు రూ.30కోట్లు గురుకుల పాఠశాలలకు ఇవ్వడం జరిగిందన్నారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన వేంటనే గిరిజన పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకై గత ఏడాది రూ.155కోట్లను వెచ్చించడం జరిగిందన్నారు.ఈ ఏడాది కూడా మరిన్ని మౌలిక వసతులను కల్పించాలనే లక్ష్యంతో రూ.113కోట్లను మంజూరు చేయడం జరిగిందన్నారు.రాష్ట్రంలో 757గిరిజన పాఠశాలలు ఉన్నాయని,వీటిలో 199గురుకులాలు, 558ఆశ్రమ పాఠశాలలు ఉన్నట్లు ఆమె తెలిపారు.వీటన్నింటిలో ఆర్ఓ ప్లాంట్లు,వాష్ రూమ్‌లు,ఇతర సదుపాయాలను కల్పించ నున్నట్లు మంత్రి తెలిపారు. వీటన్నింటినీ టాయిలెట్ల నిర్మాణానికి ఇప్పటికే 2,012టాయిలెట్లను స్వచ్ఛాంధ్రా కార్పొరేషన్ ద్వారా మంజూరు చేయడం జరిగిందని,వీటి నిర్మాణ పనులు ప్రగతిలో ఉన్నట్లు తెలిపారు.అదేవిధంగా ముఖ్యమంత్రి ఆదేశించినట్లుగా విద్యార్థులు వారి తల్లిదండ్రులతో మాట్లాడుకునే వీలుగా అన్ని వసతి గృహాల్లో ప్రీపెయిడ్ ఫోన్లు,కాయిన్ ఫోన్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. డిఎస్సీ ద్వారా 16వేల పోస్టులకు పైబడి ప్రభుత్వం భర్తీ చేయడం వల్ల అన్ని గిరిజన పాఠశాలల్లో ఉపాధ్యాయులు నిండుగా ఉన్నారని,ఇప్పటికే ఉన్న 1100మంది కాంట్రాక్టు ఉపాధ్యాయులు ఎవరి న్ని తొలగించకుండా వారి సేవలను కూడా వినియోగించుకోవడం జరుగుతుందని తెలిపారు.150మంది మెరిటోరియస్ విద్యార్థులను గుర్తించి వారికి ఐఐటి,ఎన్ఐటి,నీట్ పోటీ పరీక్షల కోచింగ్‌ను పార్వతీపురం, సీతంపేటలలో అందజేయడం జరుగుతుందని, మరో కేంద్రాన్ని త్వరలోనే విశాఖపట్నంలో ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 5వేల మిని అంగన్ వాడీలను మెయిన్ అంగన్ వాడీలుగా మార్చి ప్రతి కేంద్రానికి ఒక టీచర్‌ను,ఆయాను నియమించడం జరిగిందన్నారు. సాక్షం అంగన్ వాడీల్లో దృశ్యశ్రవణ విధానం ద్వారా విద్యాబోధన చేసేందుకు అవసరమైన టివి,ఫర్నిచర్‌ను కొనుగోలు చేసే నిమిత్తం ఒక్కొక్క సాక్షం అంగన్‌వాడీకి రూ.1.లక్ష చొప్పున మంజూరు చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ హాయాంలో ఎటువంటి ట్రైకార్ రుణాలను మంజూరు చేయడం జరగలేదని, అయితే గిరిజనుల జీవనోపాధిని మెరుగు పర్చేందుకు తమ ప్రభుత్వం రూ.24కోట్లతో గోకులాలను మంజూరు చేయడం జరిగిందన్నారు.అదేవిధంగా ట్రైకార్ రుణాలను కూడా అందజేయాలనే లక్ష్యంతో రూ.20కోట్లను కేటాయించడం జరిగిందని ఆమె తెలిపారు.ఉపాధి హామీ పథకం కింద 150రోజులపాటు పనిదినాలను గిరిజనులకు కల్పించడం జరుగుతుందన్నారు.శ్రీశైలం అటవీ ప్రాంతంలో 42గ్రామాలకు తాగునీటి సౌకర్యాన్ని కల్పించే ప్రాజెక్టును చేపట్టడం జరిగిందన్నారు.ఆయా ప్రాంతాల్లో ఉన్న చెంచులు,యానాదులకు ఆధార్‌కార్డులు,రేషన్ కార్డులను ఇవ్వడం జరుగుతుందని,తద్వారా వారికి గృహాలు,తాగునీటి సౌకర్యాలు, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు చేసే చర్యలను చేపట్టడం జరిగిందన్నారు.పోడు వ్యవసాయం చేసుకునే గిరిజనులకు ఆర్ఓఎఫ్ఆర్ క్రింద భూపట్టాలను త్వరలో అందజేసే చర్యలను చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. సికిల్సెల్ ఏనిమియాతో బాధపడే గిరిజన మహిళలకు ఐరన్,క్యాల్షియమ్ ఔషధాలను అందజేయడం జరుగుతుందని,వీరికి ప్రత్యేక చికిత్స అందజేసేందుకు విశాఖపట్నం కెజిహెచ్‌లో ఒక ప్రత్యేక కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు.

# 5 వేల హెక్టార్లలో బీచ్‌శాండ్ లీజులకు ప్రయత్నాలు!

### - కేంద్ర గనుల శాఖకు ఎపిఎండిసి లేఖ

### - బాక్సైట్ సేకరించిన భూములు బీచ్‌లాండ్‌కు వినియోగం

**విజయవాడ, నవంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** అణుధార్మికతతో కూడిన అరుదైన ఖనిజాలు ఉండే బీచ్‌శాండ్ తవ్వకాల కోసం మరో 5 వేల హెక్టార్లలో లీజులు పొందేందుకు ఏపి ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) ప్రయత్నాలు చేస్తోంది. శ్రీకాకుళం జిల్లా పరిధిలో మూడు లీజుల కింద 5వేల హెక్టార్లు కేటాయించారంటూ కేంద్ర గనుల శాఖ తాజాగా లేఖ రాసింది. గతంలో శ్రీకాకుళం జిల్లా గార మండలంలోని రెండు లీజులు, విశాఖపట్నం జిల్లా భీమిలి పరిధిలోని ఒక లీజు కలిపి మొత్తం మూడు లీజుల్లో వెయ్యి హెక్టార్ల బీచ్‌శాండ్ నిల్వలను ఎపిఎండిసికి కేంద్రం రిజర్వ్ చేసింది. అయితే రాష్ట్రమంతా కలిపి 16,604 హెక్టార్లలో బీచ్‌శాండ్ డిపాజిట్లు ఉన్నాయి. వీటిని 16 లీజులుగా దశల వారీగా ఇస్తామని గతంలో కేంద్రం తెలిపింది. తొలుత తీసుకున్న లీజుల్లో కార్యకలాపాలు ఆరంభిస్తే, మిగిలినవి కేటాయిస్తామని పేర్కొంది. దీంతో ఇప్పటికే తీసుకున్న వెయ్యి హెక్టార్ల మేర మూడు లీజుల్లో ప్రాజెక్ట్ చేపట్టే ప్రక్రియ మొదలైంది. దీంతో మరో 5 వేల హెక్టార్లు కేటాయించాలని కేంద్రాన్ని ఎపిఎండిసి కోరింది. బీచ్‌శాండ్ లీజుల్లో కొన్నిచోట్ల అటవీ ప్రాంతం ఉంది. ఆ భూములు సేకరించాలంటే ప్రత్యామ్నాయంగా అటవీ శాఖకు భూములు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే గతంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా లోని ఏజెన్సీ ప్రాంతంలో బాక్సైట్ తవ్వకాల కోసం ఆ లీజులను ఎపిఎండిసికి కేటాయించారు. ఆ సమయంలో అక్కడి అటవీ భూములను ప్రత్యామ్నాయ భూములు ఇచ్చేందుకు... ఉమ్మడి కడప జిల్లాలోని జమ్మలమడుగు, మైదుకూరు ప్రాంతాల్లోని 1212 హెక్టార్లు ఎపిఎండిసి సేకరించింది. బాక్సైట్ ప్రాజెక్ట్ లేనందున వాటి కోసం సేకరించిన 1212 హెక్టార్ల భూములను బీచ్‌శాండ్ లీజుల్లోని అటవీ భూములకు ప్రత్యామ్నాయంగా ఇవ్వాలని భావిస్తున్నారు. ఇందుకు అనుమతివ్వాలంటూ కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రిత్వ శాఖకు ఎపిఎండిసి లేఖ రాసింది. ఏపిలోని బీచ్‌శాండ్‌లో ఇల్మెనైట్ నిల్వలున్నాయి. వీటితో పాటు రూటైల్, గార్నెట్, సిల్లిమినైట్, జిర్కాన్, మోనజైట్ ఖనిజాలున్నాయి. ఈ లీజుల్లో తవ్వే ఖనిజాలను సెరేషన్ ప్లాంట్ ద్వారా వేరుచేస్తారు. తర్వాత వాల్యూ ఎడిషన్ ప్లాంట్ ద్వారా వాటిని మరింత విలువైన ఖనిజాలుగా మారుస్తారు. ఇప్పటికే వెయ్యి హెక్టార్లలో బీచ్‌శాండ్ లీజుల్లో ప్రాజెక్ట్ అభివృద్ధి, నిర్వహణ కాంట్రాక్టును అదానీకి చెందిన అల్లూవియల్ హెవీ మినరల్స్ దక్కించుకుంది. 2029–30 నాటికి ఈ ప్రాజెక్ట్ అందుబాటులోకి వస్తుందని అంచనా వేస్తున్నారు. అప్పటి నుంచి ఎపిఎండిసికి ఏటా రూ.120 కోట్ల రాబడి రానుందని భావిస్తున్నారు.

# సీతమ్స్ కళాశాలలో మరో విద్యార్థి ఆత్మహత్య

### - ప్రేమ అంగీకరించలేదని కాలేజీ పై నుండి దూకి మృతి

**చిత్తూరు, నవంబర్ 4 ప్రభాతవార్త:** చిత్తూరు మురకంబట్టు సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మరో విద్యార్థి మంగళవారం కళాశాలపై నుండి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. వారం రోజుల్లో చిత్తూరు సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇది రెండవ సంఘటన. మూడు రోజుల క్రితం బిటెక్ 3వ సంవత్సరం విద్యార్థిని నందిని కళాశాల 3వ అంతస్తు నుండి కిందికి దూకి ఆత్మహత్యాయత్నంకు పాల్పడింది. ఈమె ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఈ ఘటన మరువకముందే సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో రుద్రమూర్తి(17) ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం విద్యనభ్యసిస్తున్నాడు. ఈ క్రమంలో కళాశాలలో తమ క్లాసు అమ్మాయిని రుద్రమూర్తి గాఢంగా ప్రేమించినట్లు తెలిసింది. అయితే ఆ అమ్మాయి రుద్రమూర్తి ప్రేమను అంగీకరించకుండా తాము స్నేహంగా వుందామని, ప్రేమ, పెళ్లి వద్దని పలుమార్లు చెప్పింది. అయినప్పటికీ రుద్రమూర్తి పట్టువదలని విక్రమార్కుడిలా ఆమెను ప్రేమలో దింపడానికి ప్రయత్నాలు చేస్తునే వున్నాడు. ఈ క్రమంలో సోమవారం సైతం రుద్రమూర్తి తమను ప్రేమించాలని ఆమెను కళాశాలలో కోరినట్లు తెలిసింది. ఆమె యధావిధిగా స్నేహంగా వుందాం! ప్రేమ, పెళ్లి వద్దని హితబోధ చేసింది. ఈ క్రమంలో మంగళవారం ఇద్దరు పరీక్షకు హాజరయ్యారు. అమ్మాయి పరీక్ష రాసి వెళ్ళిపోగా, రుద్రమూర్తి మాత్రం పరీక్ష రాసిన అనంతరం తమ ప్రేమను తన ప్రేయసి నిరాకరించిందని భావించి కళాశాల 2వ అంతస్తుపై నుండి కిందికి దూకాడు. కళాశాల పై నుండి కిందికి దూకడంతో రుద్రమూర్తికి తీవ్రంగా గాయాలు అయ్యాయి. తీవ్రంగా గాయపడిన రుద్రమూర్తిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రుద్రమూర్తి మృతి చెందాడు. రుద్రమూర్తి చిత్తూరు మురుగానిపల్లికి చెందిన వాడు. ఈ మేరకు చిత్తూరు తాలుకా సర్కిల్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రభుత్వాస్పత్రిలో దౌర్జన్యంపై కేసు నమోదు

### - ఎ1గా జోగి రమేష్ భార్య శకుంతల, ఎ2, ఎ3గా కుమారులు

**విజయవాడ, నవంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** పోలీసులను దౌర్జన్యంగా తోసేసి విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో అద్దాలు పగులగొట్టిన ఘటనపై వైకాపా నేత జోగి రమేష్ భార్య, ఇద్దరు కుమారులు, మరికొందరిపై మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు. నకిలీ మద్యం కేసులో అరెస్టయిన జోగి రమేష్, రాములను న్యాయస్థానంలో హాజరుపరిచే ముందు పోలీసులు ఆదివారం రాత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా వైకాపా శ్రేణులు వీరంగం సృష్టించాయి. లోపలకు చొచ్చుకురాకుండా నిలువరిస్తున్నా ఆగకుండా ఆ పార్టీ అనుచరులు పోలీసులపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ వార్డు ప్రవేశ ద్వారం అద్దాలు పగులగొట్టారు. అక్కడే విధుల్లో ఉన్న మాచవరం ఎస్ఐ శంకరరావు వారిని అడ్డుకునే ప్రయత్నం చేయగా అతనిపై దౌర్జన్యం చేశారు. వీరిలో జోగి రమేష్ భార్య శకుంతల, కుమారులు రాజీవ్, రోహిత్ కూడా ఉన్నారు. ఈ ఘటనకు సంబంధించి బీఎన్ఎస్‌లోని 189(2), 324(3), రెడ్‌విత్ 190,3 పీడీపీపీఏలోని సెక్షన్ల క్రింద కేసు నమోదు చేశారు. ఎ1గా జోగి రమేష్ భార్య శకుంతల, ఏ2గా పెద్ద కుమారుడు రాజీవ్, ఏ3గా చిన్న కుమారుడు రోహిత్‌లతో పాటు మరికొందరిని నిందితులుగా చేర్చారు.

ఘటన జరిగిన సమయంలో తీసిన వీడియోలను పోలీసులు పరిశీలిస్తున్నారు. మరో 10 నుంచి 15 మందిని నిందితులుగా చేర్చే అవకాశం ఉంది.

# రూ.50 కోట్లు దాటిన బ్రాహ్మణ కో-ఆపరేటివ్ సొసైటీ డిపాజిట్లు

**విజయవాడ, నవంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపి బ్రాహ్మణ సంక్షేమ సంస్థకు అనుబంధంగా ఉన్న బ్రాహ్మణ కో-ఆపరేటివ్ సొసైటీ తొలిసారిగా డిపాజిట్ల సేకరణలో రూ.50 కోట్ల మైలురాయిని దాటింది. గత నెలాఖరుతో సొసైటీ డిపాజిట్లు రూ.50.99 కోట్లకు చేరాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నుంచి ఇప్పటి వరకు బ్రాహ్మణులకు వివిధ అవసరాల కోసం రూ.81.95 కోట్లను రుణాలుగా మంజూరు చేసింది. 2016లో సిఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభమైన ఈ సొసైటీలో ప్రస్తుతం 79,625 సభ్యులు ఉండగా, 17 శాఖలతో నడుస్తోంది. ప్రాథమిక సహకార సంఘాల్లో అత్యధిక సభ్యత్వం గల సంఘంగా గుర్తింపు తెచ్చుకుంది.

వచ్చే ఏడాది మార్చి నెలాఖరు నాటికి లక్ష మందికి సభ్యత్వం, రూ.100 కోట్ల రుణాల పంపిణీని లక్ష్యంగా పెట్టుకున్నట్లు బ్రాహ్మణ సంక్షేమ సంస్థ చైర్మన్ కె.బుచ్చిరాంప్రసాద్ తెలిపారు. రాష్ట్రంలోని బ్రాహ్మణులంతా ఈ సొసైటీలో సభ్యత్వం తీసుకోవాలని వారి ఆర్థిక అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు.

# రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు వర్షాలు

**విజయవాడ,నవంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:**రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రెండు రోజుల పాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ఈ మేరకు మంగళవారం ఆ సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది. అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, అనంతపురం, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే సమయాల్లో చెట్ల కింద నిలబడరాదని ఆ సంస్థ సూచించింది.

# అమరావతిలో రూ.150 కోట్లతో సెంట్రల్ లైబ్రరీ

# 10మున్సిపాలిటీల్లో రూ.1004 కోట్లతో నీటిసరఫరా ప్రాజెక్టులు

**రాజంపేట, నవంబరు 4 ప్రభాతవార్త:** రాష్ట్ర రాజధాని అమరావతిలో ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.150 కోట్లతో పెద్ద ఎత్తున సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటుకు నిర్ణయించింది. ఈ పనులు చేపట్టేందుకు దేశంలోనే ప్రఖ్యాతిగాంచిన ఆర్కిటెక్చర్ కన్సల్టెన్సీ ఏజెంట్లను టెండర్ల ద్వారా ఆహ్వానించింది. రెండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో సెంట్రల్ లైబ్రరీని నిర్మించాలని టెండర్లలో పేర్కొంది. ఈ మేరకు ఆర్ఎఫ్‌పిని రాష్ట్ర విద్యా సంక్షేమ మౌలిక సదుపాయాల సంస్థ టెండర్లను పిలిచింది. అలాగే పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి (యుఐడిఎఫ్) కింద రాష్ట్రంలో పది మున్సిపాలిటీల్లో నీటి సరఫరా పథకాలు, రెండు మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు రూ.1004.87 కోట్ల అంచనాతో రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం టెండర్లను పిలిచింది. రాష్ట్రంలోని జగ్గయ్యపేట, గుంటూరు, మాచర్ల పిడుగురాళ్లలో రూ.401.70 కోట్ల వ్యయంతో నీటి సరఫరా చేసేందుకు స్థానిక నీటి వల్ల ద్వారా ప్రాజెక్టులను చేపట్టనున్నారు. అలాగే నెల్లూరు, సూళ్లూరుపేటలో పారిశుద్ధ్యం ప్రాజెక్టులు చేపట్టనున్నారు. అదేవిధంగా పుత్తూరు,

గూడూరు, కావలి, కందుకూరు మున్సిపాలిటీలో నీటి సరఫరాకు రూ.603.17 కోట్ల వ్యయంతో చేపట్టనున్నారు. దీనికి సంబంధించి పబ్లిక్ హెల్త్ అధికారులు టెండర్లు ఆహ్వానించారు.

# తిరుమల సమాచారం

## గోవుల సంరక్షణ పై మరింత బాధ్యత

### - టిటిడి ఇఒ సింఘాల్ పరిశీలన



**తిరుమల,నవంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ టిటిడిలో గోసంరక్షణకు ప్రత్యేక స్థానం కల్పిస్తున్నారు. టిటిడి ఆధ్వర్యంలో తిరుపతిలోని ఎస్వీ గోసంరక్షశాల, తిరుమలలో గోశాల నిర్వహిస్తున్నారు. ఇక్కడ స్వదేశీ గోజాతులకు చెందిన ఆవులు ఉన్నాయి. వీటి ఆరోగ్యం, సంరక్షణపై గతంలో వెల్లువెత్తిన ఆరోపణలతో టిటిడి పాలనపై అనుభవం, అధికారులతో సమన్వయం చేసుకునే తత్త్వం కలిగిన ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ మంగళవారం ఉదయం ఉన్నఫళంగా తిరుపతిలోని ఎస్వీ గోశాలను పరిశీలించారు. గోశాలకు ఇన్‌ఛార్జిగా డిఎఫ్ఒ ఫణికుమార్‌నాయుడు వ్యవహరిస్తున్నారు. ఆయనకు రైతాంగం, గోమాతల సంరక్షణపై అవగాహన ఉంది. ఈ నేపథ్యంలో గోవుల ఆరోగ్యసంరక్షణ, నాణ్యమైన దాణా, ఏ సమయంలో ఎలాంటి ఆహారం అందించాలనే అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. గోశాలలో సిబ్బందితో మమేకమై వారితో కలసి ఫణికుమార్‌నాయుడు గోమాతలకు సేవలందిస్తున్నారు. మంగళవారం ఇఒ సింఘాల్ పరిశీలనలో గోవుల నిర్వహణ, గోవులకు అందుతున్న దాణా, వసతి, వైద్యం, తాగునీరు, పరిశుభ్రత అంశాలపై తనిఖీ చేశారు. దాదాపు 500 గోవులకు ఆధునిక వసతులతో నిర్మిస్తున్న సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్ భవనాన్ని, గోవులు, పేయదూడలు ఉంటున్న షెడ్డును ఇన్‌ఛార్జి ఫణికుమార్‌నాయుడుతో కలసి ఇఒ పరిశీలించారు. గోశాలలో పశువులు, దాణా మిక్సింగ్‌ప్లాంట్, అగరబత్తీల యూనిట్ కార్యకలాపాలను ఆయన పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వారినుండి ఉత్పత్తులు, వారి సమస్యలు తెలుసుకున్నారు.

## సంప్రదాయ ఆహారం అందించాలి

### - ఔషధవనం ఏర్పాటుపై అదనపు ఇఒ చౌదరి సూచనలు

**తిరుమల,నవంబర్ 4ప్రభాతవార్త ప్రతినిధి:** భక్తులకు నాణ్యమైన రుచికరమైన సాంప్రదాయ ఆహారాన్ని అందించాల్సిన బాధ్యత హోటళ్ళు, దుకాణాదారులపై ఉందిన టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి ఉద్ఘాటించారు. త్వరలో భక్తులకు సేవలందించనున్న కొత్త హోటళ్ళు, జనతాక్యాంటీన్ల యాజమాన్యం భక్తులకు సాంప్రదాయ ఆహారాన్ని అందించాలన్నారు. పటిష్టమైన ప్రణాళికలు రూపొందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. మంగళవారం తిరుమల పద్మావతి అతిధిభవనంలోని సమావేశమందిరంలో అన్ని విభాగాల అధికారులతో సమన్వయసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన దుకాణాదారులకు భక్తులకు అందించాల్సిన నాణ్యమైనసాంప్రదాయ ఆహారంపై సూచనలు చేశారు. తిరుమలలో పచ్చదనం పెంపుపై, భక్తులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు ఉద్యానవనాలు సుందరీకరణపై సూచనలు చేశారు. ఔషధవనాన్ని ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన ఎల్ఇడి బోర్డులు, శ్రీవారిసేవ, వైద్య,ఐటి.కల్యాణకట్ట విభాగాల పనితీరును సమీక్షించారు. ఈ సమావేశంలో రవాణ జిఎం శేషారెడ్డి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, డిప్యూటీ ఇఒ వెంకటయ్య, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, ఇఇ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



## అందరికీ శుభాలు కలగాలి: ప్రముఖులు

**తిరుమల,నవంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలశ్రీ వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలకు శుభాలు కలగాలని దేవుని ప్రార్థించినట్లు హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య తెలిపారు. మంగళవారం ఉదయంనైవేద్యాల విరామ సమయంలో ఆయన కుటుంబంతో కలసి ఆలయంలోనికి చేరుకుని వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## రూ.30లక్షలు విలువైన వెండి గంగాళం విరాళం

**తిరుమల,నవంబర్ 4ప్రభాత వార్తప్రతి నిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి హైదరాబాద్‌కు చెందిన జక్కారెడ్డి శ్రీనివాసులురెడ్డి 30లక్షలు రూపాయలు విలువైన వెండి గంగాళాన్ని విరాళంగా అందించారు. మంగళవారం ఉదయం శ్రీవారి ఆలయం ముందు ఆలయ అధికారులకు 22కిలోల వెండి గంగాళాన్ని అందజేశారు.

## 7న తిరుపతి పర్యటనకు డిసిఎం పవన్‌కల్యాణ్

**తిరుపతి,నవంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రెండురోజుల తిరుపతి జిల్లా పర్యటనకు ఈనెల 7వతేదీ శుక్రవారం వస్తున్నారు. అటవీశాఖమంత్రి కూడా అయిన ఆయన 7,8తేదీల్లో రెండురోజులు మామండూరు అటవీప్రాంతాన్ని, పలమనేరులో పర్యటించనున్నట్లు జనసేనపార్టీ వర్గాలు తెలిపాయి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పంచాయతీరాజ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
నెం.05/2025-26 తేది: 31.10.2025
కార్యపాలక ఇంజనీరు, పి.ఆర్.ఐ. డివిజన్, కందుకూరు పరిధిలో 2 పనులకు అంచనా మొత్తం రూ.25.00 లక్షలకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండర్లు తేది: 10.11.2025 సా.5.00గం.ల నుండి లభ్యమగును. పూర్తి వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ http://www.eprocurement.gov.in లో చూడగలరు.
సం/-. కార్యపాలక ఇంజనీరు, పి.ఆర్.ఐ. డివిజన్, కందుకూరు.
DIPR.NO. 17942/CL/ADVT/1/1/2022-23 తేది: 04.11.2025

ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ
రాయపూడి, అమరావతి-522237. (ఏ.పి.)
నోటీసు
ఫైల్ నెంబర్: MAU61-LND00TH/175/2025-LND:
ఏపీ సిఆర్‌డిఏ చట్టం, 2014 సెక్షన్ 39(1) మరియు 41(3) కలిగిన అధికారాలను వినియోగిస్తూ, ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(APCRDA), అమరావతి, ఈ ప్రకటన ద్వారా E-13 రహదారి పునఃరవ్యవస్థీకరణను ప్రతిపాదిస్తోంది. ఈ రహదారి 50 మీటర్ల వెడల్పుతో పాత జాతీయ రహదారి నుంచి NH-16 వరకు ప్రతిపాదించబడింది. ఈ విస్తరణ నవులూరు గ్రామంలోని సర్వే నెం. 201, 200, 810, 224, 808, 799, 800, 802, 801, 803, 793, 792, 791 మంగళగిరి గ్రామంలోని సర్వే నెం.: 232 మరియు తాడేపల్లి గ్రామంలోని సర్వే నెం.: 372 మరియు గ్రామంలోని సర్వే నెం.: 6, 7, 8 & 10 మంగళగిరి-తాడేపల్లి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రతిపాదించబడింది.
ప్రతిపాదిత ఈ-13 రోడ్ విస్తరణ ముసాయిదా ప్రణాళిక మరియు సంబంధిత వివరాలను APCRDA వెబ్‌సైట్ http://crda.ap.gov.in లో, అలాగే అమరావతిలోని APCRDA కార్యాలయం, గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం, మంగళగిరి మండల తహసీల్దార్ (MRO) మరియు MPDO కార్యాలయాలలో, మంగళగిరి-తాడేపల్లి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో చూడవచ్చు.
ఫైల్ నెంబర్: MAU61-LND00TH/175/2025-LND:
ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ చట్టం 2014 నందు సెక్షన్ 39(1) మరియు 41(3) అధికారముల ప్రకారం, అమరావతిలోని APCRDA కార్యాలయం ప్రస్తుతం ఈ క్రింది వివరాల ప్రకారం E-15 రోడ్డును విస్తరించే ప్రతిపాదనను ప్రకటిస్తోంది. ఈ రోడ్ విస్తరణ ప్రతిపాదన ప్రకారం 30 నుండి 45 మీటర్ల మధ్య వ్యత్యాసంగా ఉన్న వెడల్పుతో ప్రధాన జిల్లా రహదారి MDR-104, 138 పై విస్తరించబడనుంది. ఇది నవులూరు గ్రామంలోని సర్వే నెం.357, 358, 351, 360, 359, 372, 356 & 113, 114, 112 లో మరియు మంగళగిరి గ్రామంలోని సర్వే నెం.8,10, 271/A, 297, 273, 271/B, 288, 293, 296, 295, 292, 271/C, 298, 303, 304, 276, 274/C, 274/డి, 302, 299, 274/A, 305, 309, 287, 258, 272, 260 & 254, 255, 256, 257, 111, 251, 250, 112, 41, 39, 40, 253, 279, 280, 234, 235, 236, 252, 249, 113లో విస్తరించనుంది. ఈ రోడ్ విస్తరణ ద్వారా అమరావతి రాజధాని నగరం గుంటూరు- మంగళగిరి రహదారికి అనుసంధానం కానుంది.
ప్రతిపాదిత ఈ-15 రోడ్ విస్తరణ ముసాయిదా ప్రణాళిక మరియు సంబంధిత వివరాలను APCRDA వెబ్‌సైట్ http://crda.ap.gov.in లో, అలాగే అమరావతిలోని APCRDA కార్యాలయం, గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం, మంగళగిరి మండల తహసీల్దార్ (MRO) మరియు MPDO కార్యాలయాలలో, మంగళగిరి తాడేపల్లి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో చూడవచ్చు.
ఈ ప్రకటన పబ్లిష్ అయిన తేదీ నుండి 30 రోజుల వ్యవధిలోగా ఏవైనా అభ్యంతరాలు/సూచనలు ఉన్న వ్యక్తులు లేదా సంస్థలు వాటిని రాతపూర్వకంగా క్రింది చిరునామాకు పంపవచ్చు:కమిషనర్, APCRDA, లెనిన్ సెంటర్, గవర్నర్ పేట్, విజయవాడ - 520002. అభ్యంతరాలు లేదా సూచనలు పంపే వారు వారి పేరు, చిరునామా, టెలిఫోన్/ఫ్యాక్స్ నంబరు మరియు ఈమెయిల్ చిరునామా తప్పనిసరిగా ఇవ్వాలి. సంప్రదించడానికి అవసరమైన వివరాలు లేకపోతే, అభ్యంతరాలు లేదా సూచనలు పరిగణనలోకి తీసుకోబడవు.
కమిషనర్, ఏ.పి.సి.ఆర్.డి.ఏ., విజయవాడ

వార్త

మన సమస్యలకు పరిష్కారాలు మన దగ్గరే ఉంటాయి. కాని మనం ఎవరో పరిష్కరించుకోవాలని అనుకుంటుంటామంతే.

-షేక్స్పియర్

# 'డిజిటల్' వంచనకు కళ్లెం ఎప్పుడు?

ఆర్థిక నేరాల జాబితాలో కొత్తగా చేరిన డిజిటల్ అరెస్టులు, కోట్లు కొల్లగొట్టడాలు వంటి మోసపూరిత వ్యవహారాలు విరివిగా జరగడంతో ఈ దేశానికి పెద్ద చిక్కొచ్చిపడింది. దేశం మొత్తం మీద రోజుకొక్కటైనా బయటపడుతోంది. ఈ ఏడాది సమాజానికి అతి పెద్ద సవాలు ఏదైనా ఉందంటే అది డిజిటల్ అరెస్టులే. జరిగిన సంఘటనలను విశ్లేషించుకుంటే బాధితులు ఎక్కువ మంది వృద్ధులే. దేశంలోనే ఇంతవరకు రూ.3 వేల కోట్లు మోసగాళ్ల ఖాతాల్లోకి చేరిపోయింది. వయోవృద్ధుల కష్టార్జితాన్ని, సంపదను, మోసగాళ్లు తేలికగా కొల్లగొట్టగలిగారంటే, దానికి పెట్టుబడి కేవలం జనంలో ఉండే భయమే. అరెస్ట్ అనే పదం వింటేనే భయపడతాం. ఇదెక్కడి గొడవరా బాబూ! అని నిట్టూర్పు విడుస్తాం. అలాంటిది కనీసం పోలీసుస్టేషన్‌కి వెళ్లకుండానే ఫోన్లోనే డిజిటల్ అరెస్ట్ అయ్యారు. అంటే ఇంక పైప్రాణాలు పైకే. ఈ బలహీనతను ఆసరాగా తీసుకుని డిజిటల్ అరెస్టులను కొత్త పదం సృష్టించారు. ఇది ఏ సాంకేతిక పద కోశంలోనూ కనపడని మాట. కనీసం పోలీసులకు పరిచయం లేని మాట. కానీ ఈ పదాన్ని సృష్టించి విశ్వామిత్రుడిని తలదన్నేలా విశ్వవ్యాప్తి చేయగలగటం విస్మయపరిచే విషయం. ఇది విస్తృత పరిధి గల అంశంగా సుప్రీంకోర్టు భావిస్తోంది. జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం కేంద్ర ప్రభుత్వం సమర్పించిన రహస్య నివేదికను పరిశీలిస్తోంది. ధర్మాసనం ముందుకు డిజిటల్ అరెస్టుల సమస్య ప్రస్తావనలోకి రావడంతో రానున్న రోజుల్లో ఈ అంశంపై గట్టి పరిష్కారం లభించే అవకాశం ఉంది. దీనిని అతి పెద్ద సవాలుగా స్వీకరిస్తోంది. న్యాయవ్యవస్థ కఠినమైన ఆదేశాలను జారీ చేసే విషయమై ఆలోచిస్తోంది. నేరగాళ్లను గుర్తించడంలో ఎలాంటి ఆటంకాలున్నా, చట్ట పరిధిలో నుంచి మినహాయింపు నిచ్చే విధంగా నిర్ణయిస్తుందని ఎదురు చూస్తున్నారు. డిజిటల్ అరెస్ట్ స్కామ్ మొదట్లో తాము ఊహించిన దానికంటే ఎక్కువగా ఉందని న్యాయవ్యవస్థ పరిధిలోనే పరిష్కారాలు, మార్గదర్శకాలు లభిస్తాయని పోలీసు వ్యవస్థ నమ్ముతోంది. మునుపటి విచారణలో, సుప్రీంకోర్టు మౌఖికంగా సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ దర్యాప్తు బాధ్యతను చేపట్టాలని ప్రతిపాదించింది. నకిలీ పత్రాలను ఉపయోగిస్తూ న్యాయమూర్తులు, పోలీసు అధికారులుగా నటిస్తూ మోసగాళ్ల మోసానికి డిజిటల్ పరికరాలే పరోక్షంగా సహకరిస్తున్నాయి. సైబర్ నేరాలు సరిహద్దుల అవతల నుండి ఉద్భవించాయని, "మనీ లాండరింగ్ ముఠాల" ద్వారా రూపొందించబడ్డాయని అటార్నీ జనరల్ వెంకటరమణి తన అభిప్రాయాన్ని కోర్టుకు నివేదించారు. డిజిటల్ అరెస్టుల వెనుక ఉన్న ఆర్గనైజేషన్ సైబర్ నేరాలు 'స్కామ్ కాంపౌండ్స్' నుండి ఉత్పన్నమవుతున్నాయి అనే అభిప్రాయపడ్డారు. హర్యానాలోని అంబాలాలో సీనియర్ సిటిజన్ జంట నుంచి రూ.1.05 కోట్లు వసూలు చేయడానికి మోసగాళ్ళు డిజిటల్ అరెస్టు పేరిట దోచుకున్న కేసును సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించింది. అయితే, దేశవ్యాప్తంగా అనేక నమోదవుతున్నాయని, అమాయక ప్రజలను, ముఖ్యంగా సీనియర్ సిటిజన్లను, నేరస్థులు ఆర్టిఫిషియల్ ఇంటెల్‌లిజెన్స్ ఇతర అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారన్న విషయం న్యాయస్థానం ముందుకు వచ్చింది. 'ఆర్థిక కోణం మాత్రమే కాకుండా మానవీయ కోణం కూడా ప్రభావం చూపుతుంది. మోసపూరిత వ్యక్తులకు విదేశాలలో ఉపాధి హామీగా ఈ దగా ఉపయోగపడుతుంది. నేరస్థులున్యాయమూర్తుల ముఖాలను మార్ఫింగ్ చేస్తారు. కోర్టు గదులను నేపథ్యంగా చూపించి బాధితులకు కాల్‌చేస్తారు. డిజిటల్ ఆరెస్టుకేసుల్లో కఠిన శిక్షలు విధించాల్సిన అవసరం ఉందని సాక్షాత్తూ సుప్రీంకోర్టు త్రిసభ్యధర్మాసనం అభిప్రాయపడింది. విస్తృత స్థాయిలో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల అత్యున్నత న్యాయస్థానం దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. తమకు ఒక పరిశీలనా నివేదికనిచ్చి సూచనలు చేసేందుకు అమికస్ క్యూరీని ఏర్పాటు చేసింది. సైబర్ నేరాలలోనే ఇది అతి కిరాతకమైన నేరం. ఈ రకం నేరం చేసే మోసగాళ్లు బెదరింపులకు పాల్పడుతూ, ఆడియో, విడియో కాల్స్‌తో ప్రధానంగా వృద్ధులను లక్ష్యంగాచేసుకుని పీడిస్తున్నారు. బాధితులను కాల్స్‌లోనే బందీలుగా చేసి, డబ్బులు చెల్లించేలా వత్తిడి తెస్తున్నారు. వారి బలహీనతలను ఆసరాగా చేసుకుని ఒక విధంగా చెప్పాలంటే మెస్మరైజ్ చేస్తున్నారు. కేంద్ర హోంశాఖ సిబిఐ సమర్పించిన రెండు నివేదికలను కోర్టు పరిశీలించింది. ఒకవేళ ఇలాంటి కేసుల్లో కఠినమైన ఆదేశాలు ఇవ్వకుంటే, ఈ సమస్య మరింత జటిలంగా మారుతుందని ధర్మాసనం పేర్కొన్నది. సైబర్ నేరాల కారణంగా ఎంతో మంది ఆర్థిక దోపిడీకి గురవుతున్నారు. ఈ కేసుల తీవ్రతను అర్థం చేసుకోకపోతే ఇకపై మరింత మంది మోసగాళ్ల గాలంలో పడిపోతారు. థాయ్‌లాండ్, నైజీరియా వంటి దేశాల నుంచి ఇలాంటి నేరాలు తొంగి చూస్తున్నాయి. ఇదే విషయమై ఇంతకుముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రొబేషనరీ ఐపిఎస్‌లను ఉద్దేశించి ప్రసంగించినప్పుడు డిజిటల్ అరెస్టు ముప్పు నుంచి ప్రజలను కాపాడాలంటే వారిని చైతన్యవంతుల్ని చేయడం ఒక్కటే తక్షణ కర్తవ్యంగా భావించాలని కోరారు. సైబర్ నేరగాళ్లు వీడియోకాల్స్ చేసి తాము పోలీసులమని తాము చెప్పినట్లు చేయకుంటే డిజిటల్ అరెస్టు చేస్తామని భయపెడతారు. కాగా అలాంటి సందర్భంలో ధైర్యం వహించి చాకచక్యంగా వ్యవహరించినప్పుడే ఇలాంటి ముప్పు నుంచి బయటపడతాం.



నువ్వు భయపడితే అది భయపెట్టేవాని సమర్థత కాదు, భయపడే అసమర్థత నీది.

ఎల్లెన్ గ్లాస్గో



మనిషి అన్నవాడు ముందు ఆత్మాభిమానం కలిగి ఉండాలి. ఆత్మాభిమానం లేనివాడు అసలు మనిషిగా ఎదగలేడు.

పాస్కల్

# ప్రజావాక్కు



### భయం కల్గిస్తున్న బస్ ప్రమాదాలు

**తెలుగు** రాష్ట్రాలలో బస్‌ప్రమాదాలు ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వారంక్రితం కర్నూల్ సమీపంలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్ అగ్ని ప్రమాదానికి గురై 25 మంది మరణించి వారం గడవక ముందే రంగారెడ్డి జిల్లాచేవెళ్ల సమీపంలో జరిగిన ఆర్టీసీబస్సు ప్రమాదంలో 19మంది మరణించడం బాధాకరం. పోలీసులు ప్రాథమిక దర్యాప్తులోటిప్పర్‌లో అధికంగా కంకర (గ్రావెల్) లోడింగ్ కారణంగానే ప్రమాదం సంభవించినట్లుగుర్తించారు. టిప్పర్‌వాహనంలోనియమిత సామర్థ్యాన్నిమించి మట్టిగుండు, కంకర లాంటి బరువైన పదార్థాలు లోడ్ చేయడంతో వాహనం సంతులనం కోల్పోయిందని అధికారులు పేర్కొన్నారు. వాహనం అధిక వేగంతో మలుపు తిరిగే సమయంలో బరువు అసమానంగా పడి నియంత్రణ తప్పి ఆర్టీసీ బస్సును ఢీకొట్టినట్లు స్పష్టమవుతోంది.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### కలికాలం

**అధికార** పదవుల కోసం పాకులాడ్డం మోసం చేసి ఎన్నికల్లో గెలవటం అనేది ఇప్పుడు చాలా సునాయాసంగా జరిగే పని. పురాణ, ఇతిహాసాల కాలంలోనూ ఇలానే మోసంచేసిరాజ్యాలను తమస్వాధీనంచేసుకునేవారు. అయితే ఆ కాలంలో రాజ్యాలను పోగొట్టుకుని అష్టకష్టాలు పడినా చివరికి వారికి న్యాయం జరిగేది. వారి రాజ్యం వారికి దక్కేది. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. సిబిఐ, ఇడి, ఎసిబి వంటి దర్యాప్తు సంస్థలతోపాటు ఈ మధ్య ఎన్నికల సంఘం కూడా అధికార పక్షానికి కొమ్ముకాస్తు వారికి అనుకూలంగా పనిచేస్తోంది. వారిని గెలిపించటం కోసం ఓట్లను తారుమారు చేస్తోంది.

- ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

### నాణ్యమైన విద్య అందించాలి

**రాష్ట్ర** ప్రభుత్వం సకాలంలో ఫీజు రియంబర్స్‌మెంట్, ఉపకార వేతన నిధులను విడుదల చేయకపోవడం వల్ల ప్రైవేట్‌కళాశాలల యాజమాన్యం ఆర్థికఇబ్బందులతో కళాశాలలను సక్రమంగా నిర్వహించకపోవడం వల్ల విద్యార్థులకునాణ్యతతో కూడిన విద్యఅందడం లేదు. విద్యార్థులు తమభవిష్యత్తుగురించి ఆందోళనచెందుతున్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడ కుండా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బకాయి నిధులను విడుదల చేయాలి.

- బూర్గుపల్లి కృష్ణ యాదవ్, హైదరాబాద్

### పెరుగుతున్న అంతర్జాల నేరాలు

**సాంకేతిక** విప్లవం వేగంగా విస్తరిస్తోన్నంతలో, అంతర్జాల నేరాల కేసులు కూడా రోజురోజుకు పెరుగుతున్నాయి. స్నేహాలు, పరిచయాల కోసం రూపొందిన డేటింగ్ యాప్‌లు ఇప్పుడు నేరగాళ్లకు సులభమైన వేట వేదికలుగా మారాయి. యువత, ఒంటరి వ్యక్తులు స్నేహం కోసం అడుగుతారు. నేరగాళ్ల ఆ భావోద్వేగ అడుగునే దోపిడీగా మలుస్తున్నారు. హైదరాబాద్‌లో మలక్‌పేట యువకుడిపై ఈ మోసం గమనార్హం. టన్యా శర్మ" అనే పేరుతోపరిచయమైన మహిళ రూ. 1,950తో ప్రారంభించి, మొత్తం దాదాపు రూ. 6,49,840 వసూలు చేసింది. ఇదే ధోరణి దేశవ్యాప్తంగా వందలకేసుల రూపంలో ఉంది. మోసాల మూలం మానసిక బలహీనత, నేరగాళ్ల ఒంటరితనం, భావోద్వేగ ఆధారపడుదల, శారీరక ఆకర్షణలను గుర్తించి, నమ్మకాన్ని సంపాదించి, ఆర్థికంగాదోచుతారు. కొందరు దృశ్య సంభాషణలను రికార్డు చేసి భయపెట్టడం ద్వారా డబ్బు వసూలు చేస్తారు. బాధితులు భయంతో మౌనం పాటిస్తారు. ఫిర్యాదు చేయలేరు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### యువతకు ప్రేరణ

**మహిళల** క్రికెట్ ప్రపంచకప్ విజయం భారతీయ క్రీడా చరిత్రలో గర్వించదగిన ఘట్టంగా నిలిచింది. ఎన్నో సంవత్సరాల కష్టసాధన, పట్టుదల, క్రమశిక్షణ ఫలితంగా భారత మహిళా జట్టు ఈ ఘన విజయాన్ని సాధించింది. గతంలో పురుషుల జట్టుమాత్రమే ప్రపంచకప్ గెలిచి గర్వించగా, ఇప్పుడు మహిళా జట్టు కూడా ఆగౌరవాన్ని తెచ్చి భారత జెండాను అంతర్జాతీయ స్థాయిలో ఎగరవేసింది. ఈ విజయంలో ముఖ్యపాత్ర వహించిన కెప్టెన్ సాహసస్ఫూర్తి, ఆటగాళ్ల మధ్య ఐక్యత, సమయోచిత నిర్ణయాలు అన్నీ కలసి భారత జట్టును విజయం వైపు నడిపించాయి. ప్రతిఆటగాళ్ల ప్రదర్శన భారత మహిళా క్రీడాకారిణుల ప్రతిభను ప్రపంచానికి చాటింది.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### రైతు సమస్యలను పట్టించుకోండి

**వ్యవసాయ**రంగం భారత ఆర్థికవ్యవస్థకు ఆధారస్తంభంగా నిలుస్తోంది. ప్రధానంగా, 2013 భూసేకరణ చట్టంప్రకారం, భూమిని కోల్పోయిన రైతులకు న్యాయమైన పరిహారం ఇప్పటికీ పూర్తిస్థాయిలోఅందడం లేదు. అలాగే, నూతన జాతీయ మార్కెటింగ్ విధానాన్ని పునఃసమీక్షించి, రైతుఉత్పత్తులకు అనుకూలమైనవిధంగామార్చాలి. రైతుకువాస్తవలాభంచేకూరేలా చేయాలి.

- కె.రామారావు, నల్గొండ జిల్లా

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# సునామీపై అవగాహన అవసరం

**సునామీ ప్రమాదం గురించి, అత్యవసర పరిస్థితుల్లో ఏమి చేయాలో ప్రజలకు తెలిసినప్పుడే ముందస్తు హెచ్చరిక వ్యవస్థ ప్రభావ వంతంగా ఉంటుందనే సూత్రంపై ఇది ఆధారపడి ఉంది. సునామీ సంసిద్ధత ప్రామాణిక స్థాయిని చేరుకోవడానికి సహకార ప్రయత్నం ద్వారా ఇది సాధించబడుతుంది. ఈ కార్యక్రమం స్వచ్ఛందంగా ఆధారిత కమ్యూనిటీ పని తీరు గుర్తింపు కార్యక్రమంగా అమలు చేయబడుతుంది. ఇది జాతీయ, స్థానిక హెచ్చరిక, అత్యవసర నిర్వహణ సంస్థలు, ప్రభుత్వ అధికారులు, శాస్త్రవేత్తలు, కమ్యూనిటీ నాయకులు, ప్రజల మధ్య క్రియాశీల సహకారంగా సంసిద్ధత భావనను అర్థంచేసుకోవడాన్ని ప్రోత్సహిస్తుంది. జాతీయస్థాయిలో ఈ కార్యక్రమానికి జాతీయ విధానం, యంత్రాంగం మద్దతు ఇవ్వాలి. ఇక మన దేశంలో చూస్తే ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖ నేషనల్ సునామీ రెడీబోర్డును ఏర్పాటు చేసింది. ఒడిషా రాష్ట్రంలోని వెంకట్రాయిపూర్, నోలియాసాహి గ్రామాలు మన దేశంలో మొట్టమొదటి హిందూ మహాసముద్ర సునామీ రెడీ కమ్యూనిటీలుగా ఉన్నాయి. హిందూ మహాసముద్ర ప్రాంతానికి ఉన్న మూడు సునామీ సర్వీస్ ప్రొవైడర్లలో భారతదేశం ఒకటిగా పనిచేస్తుంది.**

డి. జయరాం

సునామీలను నివారించడం సాధ్యం కానప్పటికీ, అత్యవసర సంసిద్ధత, సమయానుకూల హెచ్చరికలు, సమర్థవంతమైన ప్రతిస్పందన, ప్రభుత్వ సహాయం ద్వారావాటి ప్రభావాన్ని మనం తగ్గించవచ్చు. 2004 డిసెంబర్ 26న హిందూ మహాసముద్రంలో, ఇండోనేషియాలోని ఉత్తర సుమత్రా పశ్చిమ తీరంలో గల సిమెలుయే ద్వీపానికి ఉత్తరాన 6.8 నుంచి 9.1 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఈ భూకంపం సృష్టించిన సునామీ 18మీటర్ల (55.8 అడుగులు)ఎత్తు అలలతో ఇండోనేషియా, శ్రీలంక, థాయ్‌లాండ్, దక్షిణ భారతదేశం, టాంజానియా వరకు విధ్వంసం సృష్టించింది. 1964లో అలాస్కాలో 9.2 తీవ్రతతో సంభవించిన గుడ్ ఫ్రైడే భూకంపం తర్వాత ఇదే అతిపెద్ద భూకంపం. ఈ సంఘటన 21వ శతాబ్దంలో సంభవించిన మొదటి పెద్ద ప్రపంచ విపత్తుగా చరిత్రలో అత్యంత ఘోరమైన విపత్తులలో ఒకటిగా నిలిచిపోయింది. ఈ విపత్తులో అధికారిక లెక్కల ప్రకారం మన దేశంలో 10,136మంది మరణించారు. వీరిలో అత్యధిక మరణాలు తమిళనాడులో నమోదయ్యాయి. ఈ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని, సునామీల పట్ల అవగాహన, సంసిద్ధత, ముందస్తు హెచ్చరిక, ప్రమాదకర ప్రభావాల ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచే లక్ష్యంతో 2015 డిసెంబరులో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ నవంబర్ 5ను ప్రపంచ సునామీ అవగాహన దినంగా గుర్తించింది. సునామీలపై ప్రజలందరికీ అవగాహన ఉండాలి. ఎందుకంటే 1998 నుండి 2018 మధ్య సునామీల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఇరవై వేల కోట్ల డాలర్ల నష్టం వాటిల్లింది. తీరప్రాంతాల్లో జనాభా అధికమవడం, సముద్ర మట్టం పెరుగుదల వంటి ఉమ్మడి ప్రభావాల కారణంగా భవిష్యత్తులో సునామీ మరణాల సంఖ్య ఇంకాపెరిగే అవకాశం ఉంది. ప్రపంచ సునామీ అవగాహన దినం అనేది జపాన్ మేధోమథనం నుంచి పుట్టింది. సునామీల ముప్పు ఉన్న దేశాలు వారివారి దేశాల ప్రజల తరలింపు మార్గాలను, కొత్త హెచ్చరిక వ్యవస్థలను ఏర్పాటు చేయాలని, పిల్లలు యువతలో అవగాహన పెంచాలని వైపరీత్యాల ప్రమాదాలను తగ్గించే ఐక్యరాజ్యసమితి కార్యాలయం (యుఎన్డిడిఆర్ యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఫర్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్) కోరుతోంది. 'సునామీ' అనే పదం జపనీస్ భాష నుండి ఉద్భవించింది. ఇందులో 'త్సు'అంటే నౌకాశ్రయం, 'నామి' అంటే తరంగం అని అర్థం. సునామీ అనేది సాధారణంగా సముద్రం క్రింద లేదా సమీపంలోసంభవించే భూకంపాలతో సంబంధం ఉండి నీటి అడుగున అంతరాయం సృష్టించే భారీ తరంగాల శ్రేణిని సూచిస్తుంది. మహాసముద్రాలలో నీటి స్థానభ్రంశం ద్వారా సునామీలు ఉత్పన్నమవుతాయి. భూకంపం సమయంలో సముద్రపు అడుగుభాగంలో ఉన్న టెక్టోనిక్ ప్లేట్ల కదలిక ద్వారా ఇవి సాధారణంగా సృష్టించబడతాయి. అయినప్పటికీ, అగ్నిపర్వత విస్ఫోటనాలు, హిమనదీయ శిల్పాలపతనం, ఉల్క ప్రభావాలు లేదా కొండచరియలు విరిగిపడటం వల్ల కూడా ఇవి సంభవించవచ్చు. అయితే అన్ని భూకంపాలు సునామీలకు కారణంకావు. భూకంపం సునామీని సృష్టించడానికి నాలుగు ముఖ్యమైన షరతులు అవసరమని నిపుణులు చెబుతున్నారు.



ఇందులో మొదటది, భూకంపం సముద్రం అడుగున సంభవించాలి. రెండు, రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత కనీసం 6.5గా నమోదవ్వాలి. మూడు, భూకంపంతో భూమి ఉపరితలం చీలిపోవాలి. నాలుగు, భూకంప కేంద్రం భూమి ఉపరితలం నుంచి 70 కిలోమీటర్ల కంటే తక్కువ లోతులో ఉండాలి. 1883 ఆగస్టు 26న ఇండోనేషియాలోని క్రాకటౌ అగ్నిపర్వత విస్ఫోటనం అత్యంత విధ్వంసకర సునామీని సృష్టించింది. ఈ పేలుడు కారణంగా 135 అడుగుల ఎత్తుకు అలలు ఎగిసిపడగా, జావా, సుమత్రా దీవుల్లోని సుందా జలసంధి వెంబడి తీరప్రాంత పట్టణాలు, గ్రామాలు ధ్వంసమయ్యాయి. సుమారు 36,417 మంది మరణించారు. ఇటీవలి చరిత్రలో ఉల్కలు లేదా గ్రహశకల ప్రేరిత సునామీలు నమోదు కానప్పటికీ ఈఖగోళ వస్తువులు సముద్రాన్ని తాకితే నిస్సందేహంగా పెద్ద మొత్తంలో నీరు స్థానభ్రంశం చెంది సునామీని సృష్టిస్తుందని శాస్త్రవేత్తలు నొక్కి చెబుతున్నారు. తీరప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలలో అధిక జనాభా కేంద్రీకృతమై ఉండటం వలన, వీరు సునామీల ప్రమాదాలకు ఎక్కువగా గురవుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా లోతట్టు తీరప్రాంతాలు, చిన్న ద్వీపాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలలో 70 కోట్లకు పైగా ప్రజలు సునామీలతో సహా తీవ్రమైన సముద్రమట్ట సంఘటనలకు గురవుతున్నారని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ 2019 తెలిపింది. సునామీ ప్రమాదం గురించి, అత్యవసర పరిస్థితుల్లో ఏమి చేయాలో ప్రజలకు తెలిసినప్పుడు మాత్రమే ముందస్తు హెచ్చరిక వ్యవస్థ ప్రభావవంతంగా పనిచేస్తుందని యునెస్కో 2022 నివేదిక నివేదించింది. 2004 హిందూ మహాసముద్రసునామీ దుర్ఘటన ఫలితంగాహిందూ మహాసముద్ర పరీవాహక ప్రాంతంలోని 27దేశాలకు ప్రయోజనం చేకూర్చే సునామీ ముందస్తు హెచ్చరిక వ్యవస్థ సృష్టికి దారితీసింది. ఇంటర్ గవర్నమెంటల్ ఓషనోగ్రాఫిక్ కమిషన్ (ఐఓసీ) యునెస్కో సమన్వయంతో రూపొందించిన గ్లోబల్ సునామీ వార్నింగ్ సిస్టం ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఐఓసి యునెస్కో సునామీ కార్యక్రమం, సునామీ సర్వీస్‌ప్రొవైడర్లు, సమాచార కేంద్రాల మద్దతుతో, సునామీ ప్రమాదాన్ని అంచనా వేయడంలో, సునామీ ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను (ఇడబ్ల్యుఎస్) అమలు చేయడంలో ప్రమాదంలో ఉన్న కమ్యూనిటీలకు సంసిద్ధత చర్యల గురించి అవగాహన కల్పించడంలో సభ్యదేశాలకు మద్దతుఇస్తుంది. భారత ప్రభుత్వం భారత సునామీ ముందస్తు హెచ్చరిక కేంద్రాన్ని హైదరాబాద్‌లో అక్టోబర్ 2007 నుండి నిజ సమయ భూకంప పర్యవేక్షణ, సముద్రమట్ట టైడ్ గేజ్‌ల నెట్‌వర్క్‌తో 24 గంటలూ పనిచేసే విధంగా నెలకొల్పబడింది. సునామీసంసిద్ధతా కార్యక్రమం అనేది ఒక బహుళ స్థాయి కార్యక్రమం. సునామీ ప్రమాదం గురించి, అత్యవసర పరిస్థితుల్లో ఏమి చేయాలో ప్రజలకు తెలిసినప్పుడే ముందస్తు హెచ్చరిక వ్యవస్థ ప్రభావ వంతంగా ఉంటుందనే సూత్రంపై ఇది ఆధారపడి ఉంది. సునామీ సంసిద్ధత ప్రామాణిక స్థాయిని చేరుకోవడానికి సహకార ప్రయత్నం ద్వారా ఇది సాధించబడుతుంది. ఈ కార్యక్రమం స్వచ్ఛందంగా ఆధారిత కమ్యూనిటీ పని తీరుగుర్తింపు కార్యక్రమంగా అమలు చేయబడుతుంది. ఇది జాతీయ, స్థానిక హెచ్చరిక, అత్యవసర నిర్వహణ సంస్థలు, ప్రభుత్వ అధికారులు, శాస్త్రవేత్తలు, కమ్యూనిటీ నాయకులు, ప్రజల మధ్య క్రియాశీల సహకారంగా సంసిద్ధత భావనను అర్థంచేసుకోవడాన్ని ప్రోత్సహిస్తుంది. జాతీయస్థాయిలో ఈ కార్యక్రమానికి జాతీయ విధానం, యంత్రాంగం మద్దతు ఇవ్వాలి. ఇక మనదేశంలో చూస్తే ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖ నేషనల్ సునామీ రెడీబోర్డును ఏర్పాటు చేసింది. ఒడిషా రాష్ట్రంలోని వెంకట్రాయిపూర్, నోలియాసాహి గ్రామాలు మన దేశంలో మొట్టమొదటి హిందూ మహాసముద్ర సునామీ రెడీ కమ్యూనిటీలుగా ఉన్నాయి. హిందూ మహాసముద్ర ప్రాంతానికి ఉన్న మూడు సునామీ సర్వీస్ ప్రొవైడర్లలో భారతదేశం ఒకటిగా పనిచేస్తుంది. •

# అమానవీయతతో మనుగడ సాధ్యమా!


జోస్యుల వేణుగోపాల్

అక్కడ, ఇక్కడ అని లేకుండా ఎక్కువగా ప్రభుత్వ రంగంలో ఈనిర్లక్ష్యమనేది ప్రజలకు నరకంగా మారుతోంది. ఏ వ్యక్తికైనా, ఏ ప్రభుత్వ రంగానికైనా సొంత ఎజెండా తప్ప ప్రజా సంక్షేమం పట్టదు. అనేక పుణక్షేత్రాల్లో దర్శనాలకు, స్నానాలకు, వెళ్ళిన వాళ్ళు, అనేక పార్టీ మీటింగుల్లో అభిమానంతో నాయకుడి జెండా మోయడానికి వెళ్ళినవాళ్లు మృత్యువాత పడడం చూస్తున్నాం. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజల్ని గాలికొదిలేసిన ప్రభుత్వాలను చూస్తున్నాం. పరిశ్రమల్లోను, రోడ్డు ప్రమాదాలు, విమాన ప్రమాదాలకు ఎక్కువభాగం కారణం నిర్లక్ష్యమే. కరోనా సమయంలో ప్రపంచవ్యాప్తంగా అధికార యంత్రాంగాల నిర్లక్ష్య ధోరణే కోట్ల మంది ప్రాణాలు హరించింది. ప్రభుత్వ రికార్డులైన ఆధార్ కార్డ్ లాంటి వాటిల్లో అడ్రసు నమోదు చేసే సమయంలో ఇష్టా రీతిన తప్పులు రాసి దాన్ని సరిదిద్దడానికి మరలా వారి చుట్టే తిరగాల్సి రావడం ప్రజల దౌర్భాగ్యం. అనేక ప్రభుత్వాసుపత్రుల్లోను, బ్యాంకుల్లోను వచ్చే జనం కోసం ఎక్కువ కౌంటర్లు ఏర్పాటు చేయకుండా చిన్నస్థాయి ఉద్యోగి నుండి అధికార్ల దాకా అందరూ ప్రజల్ని విసుక్కుంటూ మహిళలు, పిల్లలు, పెద్దవాళ్లు అనేది లేకుండా, ప్రతిపనికి గంటల తరబడి క్యూలో నిలబెడుతూ వారి సహనానికి పరీక్ష పెడతారు. ఏ వ్యవస్థ అయినా అది ప్రజలవల్లే నడుస్తుందనేది గుర్తించరు. చెమటోడ్చి రూపాయి రూపాయి కూడగట్టిన సొమ్ము అనారోగ్య సమయంలోకొన్ని హాస్పిటల్స్‌లో నిర్లక్ష్యం వల్ల డబ్బు, ప్రాణాలు రెండూ పోతున్నాయి. ఇటీవల అంతులేని ఆశ్చర్యపోయే నిర్లక్ష్యం ఓ వ్యక్తి ప్రాణాల మీదకు తెచ్చిన సంఘటన తెలంగాణాలో చూశాం. హైదరాబాద్ ఏరియా హాస్పిటల్‌లో ఓ.పి. చీటి రాయడానికి ఒక వ్యక్తిని రూల్స్ కారణంగా నిరాకరించి నిర్లక్ష్యం చేయడమేకాక అదే వ్యక్తి స్పృహకోల్పోయిన సందర్భంలో సిబ్బంది చనిపోయినట్లుగా నిర్ధారించి మార్చురీకి పంపడం వారం తర్వాత అదృష్టం కొద్ది అతను బయట పడడం జరిగితే ఆ విలువైన ప్రాణం ఖరీదు చిన్న పొరపాటుగా చెప్తున్నారు. మన రాష్ట్రంలో ఒక కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో సకాలంలో ట్రీట్‌మెంట్ జరగక ఒక గర్భవతి ప్రాణాలు కోల్పోయింది. ఒరిస్సాలోని ఒక మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో తప్పుగా ఇంజక్షన్ ఇచ్చినా కారణంగా ఏడు మంది మృతిచెందారు. మధ్యప్రదేశ్‌లో కరెంటు స్థంభాన్ని ముట్టు కున్న చిన్నారి కరెంట్ షాకుకు గురై మృతిచెందింది. ఈ ప్రమాదాలన్నీ బయటపడ్డవి. దేశవ్యాప్తంగా ఇంకా బయటికి రాని ఇలాంటివి లక్షలు, కోట్లు. ఒక నిర్లక్ష్యం ఎందరి ప్రాణాలు తీసుకున్నా తామరాకు మీద నీటిబొట్టులా తమకు అంటకుండా చూసుకుంటారు అందుకు బాధ్యులు. దీనికిప్రైవేటు, ప్రభుత్వ, ఏ రంగము మినహాయింపు కాదు. ఇక రోడ్డు ప్రయాణాల్లో అన్ని రకాల వాహన చోదకుల నిర్లక్ష్యం వారి ప్రాణాలతో పాటు మరెందరినో బలితీసుకుంటోంది. ప్రభుత్వాల విధి విధానాలను అమలుపరిచే విద్యుత్తు, నీరు, విద్య, వైద్య రంగాల్లో నిర్లక్ష్యం నిండు ప్రాణాలను బలితీసుకుంటోంది. ఇక న్యాయ వ్యవస్థల్లో నిర్లిప్తతతో ఎంతోమంది నిందలు మోస్తూ తీర్పులకోసం దీర్ఘ కాలంగా ఎదురు చూస్తున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత వెంటనే జరిమానాలు, ప్రాణాలు నేలకొరిగిన తర్వాత పారితోషికాలు. లక్షలాది కుటుంబాల ఆరోగ్యాన్ని హరిస్తున్న మద్యపానాన్ని ప్రోత్సహిస్తాం, దాంతో సంభవించే మరణాలన్నిటికీ కాంపెన్సేషన్స్ ఇస్తాం అని అంటారు. ప్రజలు ఎంత అప్రమత్తంగా ఉన్నా మన ప్రాణాలకు గ్యారెంటీ లేదు. వేల కోట్ల అప్పు లతో ఇస్తున్న ఉచిత పథకాల్లో నిర్వహణాలోపంపై నిర్లక్ష్యపు నీడ ప్రజలకు పీడగామారింది. పార్టీలు, ప్రతిపక్షాలు, ప్రభుత్వాలు ఒకరి నిర్లక్ష్యాన్ని మరొకరు ఎండగడుతూ నిం దిస్తూనే ఉన్నారు. ప్రతి పనిలో నిర్లక్ష్యం మనిషిని మానవ త్వం లేని శిలగా మారిస్తే, ఇది మానవ జాతి మనుగడకు, దేశాభివృద్ధికి ఆటంకం కలిగిస్తాయి. •

# బిసి, ఎంబిసిలకు ఏదీ సమన్యాయం?

మన్నారం నాగరాజు

భారతదేశంలో చిన్న రాష్ట్రాల కోసం జరిగిన పోరాటాలు ఎప్పటికప్పుడు ఒక ప్రధాన రాజ కీయ అందెలాగా నిలిచాయి. భౌగో ళిక విస్తీర్ణం తగ్గి పరిపాలన సులభ తరం అవుతుందని, ప్రాంతీయ సమ స్యలు త్వరగా పరిష్కారం అవుతా యని, ప్రజలకు సమాన న్యాయం లభిస్తుందని ఆశతో ప్రజలు చిన్న రాష్ట్రాల కోసం కష్టపడ్డారు. తెలంగాణ, జార్ఖండ్, చత్తీస్‌గఢ్, ఉత్తరా ఖండ్ వంటి రాష్ట్రాల ఆవిర్భావం ఈ స్వప్నాన్ని నిజం చేసింది. అయితే ప్రశ్న ఏమిటంటే ఈ చిన్న రాష్ట్రాల్లో నిజంగా అన్ని వర్గాలకూ, ముఖ్యంగా బీసీలకు, రాజకీయ సమన్యాయం కలుగుతోందా? చిన్నరాష్ట్రాల కోసం పోరాటంలో ప్రధానంగా 'సమాన వనరుల పంపిణీ, సమాన రాజకీయ అవకాశాలు' అని తెలంగాణ ఉద్యమంలో కూడా బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ముఖ్య భూమిక పోషించారు. పల్లె స్థాయి నుండి నగర స్థాయి వరకు వేలాది బీసీ నాయకులు, కార్య కర్తలు ఉద్యమంలో తలమునకలయ్యారు. ఆత్మగౌరవం స్థానిక పాలన, సొంత వనరులపై హక్కులనే నినాదాలు బీసీ సమాజంలో విశేష స్పందన కలిగించాయి. ముఖ్యమంత్రి మంత్రివర్గం, ముఖ్యమైన అధికార పదవుల్లో బిసిల శాతం అతి తక్కువగా ఉండటం గమనార్హం. చిన్నరాష్ట్రం ఏర్పడితే అధికారం సులభంగా అందుతుందని భావించిన బీసీల ఆశలు, వాస్తవ రాజకీయ కుతంత్రాల కిందనలిగిపోయాయి. రాజకీయ సమన్యాయం అనేది కేవలం పదవులు పంచుకోవడమే నిర్ణయాధికారం, విధానాల రూపకల్పనలో సమానపాత్ర కలిగి ఉండటమే. బీసీలు జనాభాలో 50శాతం పైగా ఉన్నా అసెంబ్లీ సీట్లలో, మంత్రివర్గంలో, లోక్‌సభ స్థానాల్లో వారి ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉండటం అసమానతను చూపిస్తుంది. ఒక చిన్నరాష్ట్రంలో భౌగోళిక సౌలభ్యం ఉన్నా, రాజకీయ నిర్ణయాలు సాంప్రదాయిక కులాధారిత శక్తుల చేతుల్లోనే ఉండటం, సమన్యాయం కేవలం నినాదంగా మిగిలిపోవడానికి కారణమవుతోంది. తెలంగాణ ఏర్పాటుకు ముందు బీసీ వర్గాలు ఉద్యమానికి వెన్నెముకలా నిలిచాయి. కానీ అవిర్భావం తరువాత మంత్రివర్గంలో, ముఖ్యపదవుల్లో వారికున్న ప్రాధాన్యం చాలా తక్కువ. ముఖ్య మంత్రిత్వ శాఖలు (హోంశాఖ, ఆర్థిక శాఖ, మున్సిపల్, రెవెన్యూ) బీసీలకు దూరంగానే ఉన్నాయి. గ్రామ, మండల స్థాయిలలో కొంతమేర బీసీ నాయకులున్నా విధాన రూపకల్పనలో ప్రభావం చూపే స్థాయిలో అవకాశం తక్కువ. ఇక డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిన్న రాష్ట్రాల ఏర్పాటు వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యాన్ని, చాలా స్పష్టంగా చెప్పారు "అధికార వికేంద్రీకరణ ద్వారా బహుజనులకు, ముఖ్యంగా సామాజికంగా వెనుకబడిన వర్గాలకు, నిజమైన రాజ్యాధికారం తేవాలి అని. ఈ ఆలోచన ప్రకారం, చిన్నరాష్ట్రాల ద్వారా అధికారం కొద్దిమంది చేతుల్లో కాకుండా, గ్రామాల నుంచి పట్టణాల వరకు సమానంగా పంచబడాలి. తెలంగాణరాష్ట్రం ఏర్పాటుకు జరిగిన ఉద్యమంలో ఈ భావజాలంకొంతవరకు ప్రతిఫలించింది. ఎందుకంటే, ఆ ఉద్యమంలో బడుగు బలహీన వర్గాలే కాకుండా, బీసీలు, ఎంబీసీలు, నిమ్నకులాలు




పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వీని రక్తం, చెమట, త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం సాకారమైంది. కానీ రాష్ట్రంఏర్పడి 11సంవత్సరాలు గడిచినా, అంబేద్కర్ కలలలోని 'నిజమైన ప్రజాధికారం' ఈ వర్గాలకు ఎంతవరకు చేరిందో ఆలోచిస్తే నిరాశ కలుగుతుంది. స్థానికసంస్థల నుంచే ప్రజాస్వామ్యానికి ప్రవేశం. నిమ్న కులాలకు చెందిన వ్యక్తులు రాజకీయ ప్రస్థానంలో ముందుకు రావాలంటే మొదటగా స్థానిక సంస్థలలో సర్పంచ్, కార్పొరేటర్, వార్డు కౌన్సిలర్ వంటి పదవులలో అవకాశాలు రావాలి. ఎందుకంటే, ఇవే రాష్ట్రఅసెంబ్లీలు, పార్లమెంటులకు పునాది రాళ్లు. కానీ వాస్తవం ఏమిటంటే, రాష్ట్రంలోని కొన్నిగ్రామాల్లో ఇప్పటికీ కొంత మంది కులాలవారికి ఒక్కసారి కూడా సర్పంచ్ పదవి దక్క లేదు ఒక కులానికి గ్రామంలో ఓటు శాతం ఉన్నా, ఆ స్థానాన్ని ఎప్పటికీ ఇతర శక్తివంతమైన కులాలే ఆక్రమిస్తారు. కారణం రిజర్వేషన్ విధానంలో వర్గీకరణ లేకపోవడం. 2014లో తెలంగాణలో జరిగిన సర్పంచ్‌ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించబడింది. ఇది కాగితం మీద మంచి శాతం అనిపిం చినా, వర్గీకరణ లేకపోవడం వల్ల రిజర్వేషన్ ఎక్కువగా ప్రభావవంతమైన బీసీ కులాలకే దక్కింది. మిగిలిన నిమ్న, బలహీన బీసీ కులాలకు మాత్రం ప్రాతినిధ్యం దొరకలేదు. ఇక 2019లో రాష్ట్రంలో మొత్తంగా 12,751 గ్రామ పంచా యతీలున్నాయి. పంచాయతీల్లో 50 శాతానికి లోబడే రిజ ర్వేషన్లు ఉండాలన్న సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో బీసీ లకు 22,8శాతం, వారిలో 3146ఎస్టీలు, 2113 ఎస్సీలు, 3346లు, ఓపెన్ క్యాటగిరీలో 1417మందిసర్పంచ్‌లు బాధ్యతల్లోకి వచ్చినట్టు పంచాయతీరాజ్ గతంలో ఉన్నతాధికారులు వెల్లడించారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు పాలించిన పంచాయతీరాజ్ సంస్థలో బీసీ రిజర్వేషన్లు 34శాతం నుంచి 21శాతం తగ్గించి బీసీల నాయకత్వాన్ని ఎదగకుండా దెబ్బతీశారు. సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపి బిసి రిజర్వేషన్లను 34 శాతం నుంచి 21 శాతానికి తగ్గించింది. అదీగాక ఇంకేవేవో తప్పుడు లెక్కలు చూపి కేవలం 18శాతం రిజర్వేషన్లు అమలుచేశారు. మొత్తం గ్రామ పంచాయతీలు సుమారు 12,751 కాగా 56శాతం జనాభా ఉన్న బీసీలకు 8822గ్రామ పంచాయతీలు దక్కాలి. గతంలో 34 శాతం రిజర్వేషన్లు ఇస్తే 4300 పంచాయతీలో బీసీలకు దక్కాలి. కానీ 2332 మాత్రమే కేటాయించారు. అంటే సుమారు22శాతం మాత్రమే దక్కాయి. దీంతో రెండు వేల గ్రామ సర్పంచులు 3వేల వార్డు మెంబర్లు బీసీలకు దక్కాల్సినవి దక్కకుండా పోయాయి. అట్లనే జెడ్పీటీసీ, ఎంపీటీసీ, జిల్లా పరిషత్ ఛైర్మన్, మండల్ పరిషత్ ఛైర్మన్ పదవుల్లో కూడా బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 22 శాతానికి తగ్గించి బీసీల నాయకత్వాన్ని ఉద్దేశపూర్వకంగా అణచివేశారు. ప్రభుత్వం కూడా "వర్గీకరణ లేని రిజర్వేషన్" విధానం మార్పు చేసి, ప్రతి బీసీ ఉపవర్గానికి తగిన ప్రాతినిధ్యం, స్థానిక సంస్థల నుంచే అవకాశాలు రాజకీయశిక్షణ, ఆర్థిక సహాయం ఇవన్నీ కలిపి ఒక సమగ్రప్రణాళిక రూపొందించాలి. చిన్న రాష్ట్రాలు ఏర్పడితే బహుజనులకుఅధికారం వస్తుందని అంబేద్కర్ చెప్పినది సత్యమే. కానీ అధికారం సత్యంగా జనుల వద్దకు రావాలంటే, బహుజనులలోని అత్యంత వెనుకబడిన వర్గాలకు ముందుగా హక్కులు, అవకాశాలు ఇవ్వాలి. లేకపోతే, రాష్ట్రం చిన్నదైనా, అధికారం మాత్రం కొద్దిమందికే పరిమితం అవుతుంది. తెలంగాణ సాధనలో కష్టపడిన బీసీ, ఎంబీసీ, నిమ్న కులాలు నిజమైన రాజకీయ ప్రాతినిధ్యం పొందే రోజురాకపోతే, మనం అంబేద్కర్ కలలోని సమానత్వ రాజ్యానికి చాలా దూరంలోనే ఉన్నట్టే. మంత్రివర్గంలో ముఖ్య పదవుల్లో బీసీలకు నిర్దిష్ట శాతం రెజర్వేషన్ కల్పించాలి. బీసీవర్గాల నుండియువనాయకులకు శిక్షణ ఇచ్చి, రాజకీయాల్లో ప్రోత్సహించాలి. •

Main tab page 111_Main tab page 111.qxd 11/4/2025 11:27 PM Page 1



## పారిశుద్ధ్య పనులను పరిశీలించిన డిపిఓ

**కొత్తపట్నం నవంబర్ 4 ప్రభాతవార్త**



కొత్తపట్నం మండలం గమండ్లపాలెం గ్రామంలో డిపిఓ వెంకటేశ్వరరావు పారిశుద్ధ్య పనులను మంగళవారం పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా అధికారులకు పరిసరాలు పరిశుభ్రతగా ఉంచుకోవాలని తడి చెత్త పొడి చెత్త ను సేకరిం చాలని పరిశుభ్రమైన రాగు నీరు ప్రతి ఇంటికి ఇవ్వాలని నీటి ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాలని తెలియజేశారు. కలవలోని చెత్త పేరుకుపోకుండా తరచూ శుభ్రపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తడి చెత్త నుండి ఉరిమి కంపోస్టుగా తయారుచేసిన వాటిని అమ్మి డబ్బులు గ్రామపంచాయతీకి జమ చేయాలని తెలియజేశారు. క్యూఆర్ కోడ్ ద్వారా ఇంటి పన్ను వసూలు చేసే విధానాన్ని పరిశీలించడం జరిగింది. ప్రతి గ్రామాన్ని టార్గెట్గా పెట్టుకొని టీములు ద్వారా ఇంటి పన్ను వసూలను వేగవంతం చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించడం జరిగింది పంచాయితీ ఆదాయం లో పలోపేతం కావడానికి ప్రజల సహకారం ఎంతో అవసరమని ఆయన తెలియజేశారు ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి శ్రీకృష్ణ డిప్యూటీ ఎంపీడీవోమూర్తి పంచాయతీ కార్యదర్శులు ప్రజాప్రతినిధులు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## మండల స్థాయి చెకుముకి సైన్స్ పోటీలు

**కొత్తపట్నం నవంబర్ 4 ప్రభాతవార్త**



కొత్తపట్నం మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్ నందు మండల స్థాయి చెకుముకి సైన్స్ పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం పరిశీలనా దృష్టితోను, ప్రశ్నించే తత్వంతోను అధ్యయనం చేయాలని అన్నారు. మంగళవారం కొత్తపట్నం జడ్పీహెచ్ఎస్ లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించబడ్డాయి. మండలంలోని 6 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థి బృందాలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక స్పృహ, ప్రశ్నించే తత్వం, పరిశోధన పట్లసైన్స్ పట్ల ఆసక్తి కలిగి ఉండాలని ఈ చెకుముకి సైన్స్ సంబరాలు అందుకు ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె హరిబాబు,జి ఉమామహేశ్వరి, యు శ్రీనివాసన్, కే లక్ష్మీనారాయణ, బి నిర్మలాదేవి, పి నిర్మల, ఆర్ ఉమామహేశ్వరి, దేవకృప, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు. ఈ మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల సందర్భంగా నిర్వహించిన సైన్స్ పరీక్షలో జడ్పీహెచ్ఎస్ ఈతముక్కల విద్యార్థులు ప్రథమ స్థానం పొందారు.

## చేసిన తప్పులకు శిక్ష అనుభవించాల్సిందే

**- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్**

**ఒంగోలు, ప్రభాతవార్త**




తెలిసి చేసినా.. తెలియక చేసిన తప్పులకు శిక్ష అనుభవించాల్సిందేనని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు. మంగళవారం జిల్లా జైలులో ఖైదీలతో నిర్వహించిన కార్యక్రమంలో న్యాయమూర్తి న్యాయవాదిని నియమించుకోలేని ఖైదీలకు ఉచితంగా న్యాయవాదులను లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అనే పద్ధతిలో న్యాయవాదిని నియమించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని అవసరమున్న ప్రతి ఒక్క ఖైదీ వినియోగించుకోవాలని తద్వారగా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చున్నారు. అదే విధంగా విచారణలో ఉన్న ఖైదీలు కేవలం నేరం ఆరోపించబడిన వారేనని న్యాయస్థానాలలో శిక్షలు ఖరారు అయ్యేవరకు వారు నేరస్తులు కారని అన్నారు. జిల్లా జైల్లోని స్టోర్ రూమును, వంటశాలను న్యాయమూర్తి పరిశీలించారు. జైలు శాఖ వారు ఖైదీలకు అందించే పదార్థాలలో నాణ్యత పాటించాలని మరియు ప్రభుత్వం నిర్దేశించిన మెనూనే పూర్తిగా అనుసరించాలని అన్నారు, కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పి వీరరాఘవులు, జైలర్ మజ్జి అప్పలనాయుడు, డిప్యూటీ జైలర్ ఎలమందారావు జైలు శాఖ సిబ్బంది పాల్గొన్నారు

## తుఫాను బాధితులకు ఆర్థిక సహాయం, సరుకులు పంపిణీ

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన ఆదేశాలతో మంగళవారం 18వ డివిజన్లోని గుర్రం జాషువా కాలనీలో తుఫాను బాధితులకు ఆర్థిక సహాయం, సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పెండ్యాల రోశయ్య, క్లస్టర్ ఇంచార్జి పల్లపోతు వెంకటేశ్వర్లు, టౌన్ తెలుగు యువత నాయకులు భీమవరపు దయానందం, బూత్ ఇన్చార్జులు జడ భాష, పెండ్యాల వెంకటేశ్వర్లు, జడ సుధాకర్, విఆర్ఓ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మూఢనమ్మకాలు, అందవిశ్వాసాలకు వ్యతిరేకంగా పోరాడాలి

**చీమకుర్తి, అక్టోబర్ 4, ప్రభాతవార్త**



జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చీమకుర్తిలోని బాలికల గురుకుల పాఠశాల నందు జరిగిన మంగళవారం మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రం ను జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ జవహర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మూఢనమ్మకాలు, అంధ విశ్వాసాలకు వ్యతిరేకంగా పోరాడాలని, అలాగే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకొని ప్రజలను చైతన్యవంతం చేయాలని అన్నారు. జనవిజ్ఞాన వేదిక గత 30 సంవత్సరాల పైగా తెలుగు రాష్ట్రాల్లో ప్రజ లను చైతన్యవంతం చేస్తూ మూఢనమ్మకాలపై ఉద్యమిస్తుందని అన్నారు. జెవివి చీమకుర్తి మండల శాఖ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు కార్యదర్శి చలువాది రమేష్ ట్రెజరర్ బి ఆంజనేయులు ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరిగింది. మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు హై స్కూల్ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ప్రభుత్వ విభాగంలో దేవరపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలవగా, ప్రైవేటు విభాగంలో సి పి ఎస్ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. ప్రభుత్వ విభాగంలో చీమకుర్తి గవర్నమెంట్ హై స్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించగా, తృతీయ స్థానాన్ని బండ్లమూడి జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు కైవసం చేసుకున్నారు. ప్రైవేట్ విభాగంలో లిటిల్ స్టార్ హై స్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించగా తృతీయ స్థానాన్ని అపెక్స్ హై స్కూల్ విద్యార్థులు కైవసం చేసుకున్నారు. ఎంఇఓ డివిఎల్ నరసింహారావు విద్యార్థులకు సైన్స్ దృక్పథం పట్ల సందేశాన్ని ఇచ్చారు. ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు డాక్టర్ జవహార్ నగదు బహుమతులు అందజేశారు. వీటితో పాటు ప్రథమ స్థానంలో నిలిచిన టీములకు ప్రముఖ పారిశ్రామికవేత్త చలువాది బద్రీనాథ్ గోడ గడియారాలు సమకూర్చగా, ద్వితీయ స్థానంలో నిలచిన వారికి గెలాక్సీ క్లబ్ అధ్యక్షులు కొండవీటి ఏడుకొండలు చేతి గడియారాలు, తృతీయ స్థానంలో నిలిచిన టీములకు పల్లపోతు శంకర్ లంచ్ బాక్సులు బహుమతులుగా అందజేశారు. అనంతరం పాల్గొన్న విద్యార్థులందరికీ లయన్స్ క్లబ్ పూర్వ అధ్యక్షులు నూనె హేమ సుందరం జ్యూట్ బ్యాగులు,నూనె వంశీ కృష్ణ జామెంట్రీ బాక్సులు, ఆలపాటి నరసింహారావు రైటింగ్ ప్యాడ్స్ పెన్నులు, తాళ్లూరి చలపతి లాంగ్ నోట్ బుక్స్, నేరెళ్ల సుబ్రహ్మణ్యం సైన్స్ పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు చలువాది పార్థసారథి, జేవివీ పూర్వ అధ్యక్షులు అంబటి వీరారెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ ఫ్లారెన్స్, సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

## ఇంటి పన్నులకు డిజిటల్ చెల్లింపు సదుపాయాలు

**ఒంగోలు, ప్రభాతవార్త**



గ్రామాలలో ఇంటి పన్నులను డిజిటల్ లావాదేవీల రూపంలో చెల్లించే సదుపాయాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్ పోస్టరును మంగళవారం ప్రకాశం భవనంలోని తన చాంబర్లో ఆయన ఆవిష్కరించారు. ఇంటి పన్ను చెల్లింపు విధానంలో పారదర్శకత, వేగం, కచ్చితత్వాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చింది అన్నారు. స్థానిక సంస్థల్లో పారదర్శకతను పెంచేందుకు అమలు చేస్తున్న ఈ విధానాన్ని అందరూ ఉపయోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నిధులు జేబుల్లో.. దోమలు ఇళ్లల్లో..!

**- ఫాగింగ్ యంత్రాల డీజిల్ పక్కదారి**

**- కార్పొరేషన్‌లో యధేచ్ఛగా స్వాహా పర్వం**

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఒంగోలు నగర పరిధిలో దోమల సంహారం పేరుతో స్వాహా పర్వానికి తెర లేపారు. మెకానికల్ విభాగంలో కొందరు సిబ్బంది క్షేత్ర స్థాయిలో పలు వార్డు స్థాయి నేతలు జతకలిసి మాయ చేస్తున్నారు. కాకి లెక్కలతో జేబులు నింపేసు కుంటున్నారు. వర్షాలతో దోమల బెడద పెరిగి నగర వాసులు ఇబ్బందులు పడుతుంటే ఫాగింగ్ ప్రక్రియ నామమాత్రంగా జరుగుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఫాగింగ్ యంత్రాలు, వాహనాలకు, ట్రాక్టర్లకు పెట్రోల్ బంకుల్లో డీజిల్ కార్డులతో ఆయిల్ కొట్టించే బాధ్యతను మెకానికల్ విభాగం చూస్తోంది. అందుకు సంబంధించిన పారిశుధ్యానికి చూసే మేస్త్రీలు, ఇన్‌స్పెక్టర్లు వారికి కూడా అందులో వాటా ఉన్నట్లు సమాచారం. ఇంత వరకు భాగానే ఉన్నా కొన్ని పెట్రోల్ బంకుల యజమానులతో కొందరు అధికారులు కొందరు సిబ్బంది కుమ్మక్కై డీజిల్‌ను పక్కదారి పట్టిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గతంలో కూడా మున్సిపల్ కార్పొరేషన్ ట్రాక్టర్లకు పెట్రోల్ బంకుల్లో కొట్టించిన డీజిల్‌ను ప్రైవేటుగా ఏర్పాటు చేసిన పారిశుధ్య ట్రాక్టర్లకు ప్రభుత్వ వాహనా ల్లోని డీజిల్‌ను ప్రైవేటు ట్రాక్టర్లకు అమ్ముకునే వారని తెలిసింది. ప్రభుత్వ డ్రైవర్లు, పారిశుధ్య మేస్త్రీలు, పలువురు సిబ్బంది కుమ్మక్కై డీజిల్‌ను ప్రైవేటు వాహనాలకు అమ్ముతున్నట్లు విమర్శలు అప్పట్లో గప్పుమన్నాయి. వాహనాలకు రోజుకు వంద మీటర్లు డీజిల్ కొట్టిస్తున్నట్లు లెక్కల్లో చూపిస్తుండగా వారానికి ఒక్క సారి కూడా వార్డుల్లో ఫాగింగ్ వాహనాలు తిరిగిన జాడా కనిపించడం లేదు. ప్రతి నెల ఈ వాహనాల ద్వారానే లక్షల రూపాయలు మేర నిధులు స్వాహా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వార్డుల్లో ఫాగింగ్ మిషన్లతో ప్రతి రోజు ఫాగింగ్ చేయాలి. ఫాగింగ్ చేసినట్లు కార్పొరేటర్ సంతకం పెడితేనే బిల్లులు మంజూరు చేస్తారు. ఇక్కడే అసలు కథ మొదలవుతుంది. కొందరు చోటా నాయకులు, పారిశుధ్య సిబ్బంది వార్డుల్లో ఫాగింగ్ పక్కన పెట్టి ఆ డీజిల్‌ను సొంతానికి ఉపయోగించుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ రోజు నా వార్డులో ఫాగింగ్ అవసరం లేదు, కారుకు కొట్టండి అంటూ కొందరు నేతలు డీజిల్‌ను వాడేస్తున్నా ఘటనలు ఉన్నాయన్న ఆరోపణలు వినిపిస్తు న్నాయి. అధికారుల సమర్పించిన లెక్కలపై గతంలో ఫిర్యాదులు అందాయి. అయినా వారి మీద ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఫాగింగ్ వాహనాల్లో కొన్ని మరమ్మత్తులు గురై కార్పొరేషన్ కార్యాలయంలో ఉన్న లెక్కల్లో మాత్రం ఆ వాహనాలు తిరుగుతూ ఫాగింగ్ చేస్తున్నట్లు చూపిస్తు న్నారు. దోమల నివారణకు సీజనల్ వర్కర్స్ పేరుతో పదుల సంఖ్యలో సిబ్బందిని కార్పొరేషన్ నియమించింది. ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున వేతనం ఇస్తున్నారు. అధిక శాతం ముఖ ఆధారిత హాజరు కాగానే క్షేత్ర స్థాయి లో స్పందించడం లేదనే ఆరోపణలు ఉన్నారు. కొందరు కార్పొరేటర్లు తమ అనుచర గణానికే పోస్టింగ్‌లు ఇప్పించడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

## పలు అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్ష

**ఒంగోలు, ప్రభాతవార్త**



ప్రతి రోజు కార్యాలయానికి రాగానే మీ కోసం అర్జీల స్టేటస్ పరిశీలించటమే ప్రధమపనిగా పెట్టుకోవాలని పలువురు జిల్లా స్థాయి అధికారులకు కలెక్టర్ పి.రాజాబాబు స్పష్టం చేశారు. మీ కోసం అర్జీలు పరిష్కారం అవుతున్న తీరుపై సంబంధిత విభాగ అధికారులతో మంగళవారం ప్రకాశం భవనంలోని తన ఛాంబర్‌లో ఆయన సమీక్షించారు. అర్జీల ఆడిట్, సకాలంలో పరిష్కారం, రీఓపెన్ కాకుండా చూడడం, అర్జీదారులతో అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ఆయన ఆరా తీశారు. సమస్యలను సకాలంలో సహేతుకంగా పరిష్కరించడంతో పాటు అర్జీదారులతో మాట్లాడే తీరు కూడా గౌరవప్రదంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మీ కోసం కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కోణంలో అర్జీదారులకు ఫోన్ చేసి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ప్రధానంగా రెవెన్యూ, పంచాయతీ, విద్య, రోడ్లు భవనాల శాఖలకు సంబంధించి అర్జీలు పెండింగ్లో ఉంటు న్నట్లు మీ కోసం విభాగ జిల్లా నోడల్ ఆఫీసర్ మాధురి ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. సకాలంలో అర్జీలను పరిష్కరించడంలో జాప్యం చేస్తున్న విభాగాలను, అధికారుల వివరాలను ప్రతి రోజు తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ ఆమెను ఆదేశించారు. అర్జీలను పరిష్కరించడంలో జాప్యం చేస్తున్న హనుమంతునిపాడు, పుల్లలచెరువు తహసీల్దార్లతో కలెక్టర్ అప్పటికప్పుడే ఫోన్లో మాట్లాడారు. డీపీవో వెంకటేశ్వరరావు, డీఈఓ కిరణ్ కుమార్, రోడ్లు భవనాల శాఖ ఎస్ఈ రవి నాయక్‌లను కూడా తన ఛాంబర్‌కు పిలిపించి అర్జీల పరిష్కారంలో జాప్యం ఎంత మాత్రం సరికాదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మీ కోసం అసిస్టెంట్ నోడల్ ఆఫీసర్ కృష్ణమోహన్, సూపరింటెండెంట్ నాగజ్యోతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## డీఆర్ఆర్ఎం హైస్కూల్‌లో టీచ్‌టూల్ రిఫ్రెషర్ ట్రైనింగ్‌లు ప్రారంభం

**ఒంగోలు, ప్రభాతవార్త**

డీఆర్ఆర్ఎం హైస్కూల్ ఒంగోలు నందు టీచ్‌టూల్ రిఫ్రెషర్ ట్రైనింగ్‌లు ప్రారంభించారు. నవంబర్ 4,5వ తేదీలు రెండు రోజుల పాటు ఈ ట్రైనింగ్ నిర్వహించబడును. ప్రతి మండలం నుండి ఇద్దరు చొప్పున మొత్తం 76 మంది మాస్టర్ ట్రైనర్స్ హాజరయ్యారు. మరలా మండల స్థాయిలో జరగబోవు ట్రైనింగ్‌కు ఈ 76 మంది మండల అబ్జర్వర్లకు శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. ఈ ప్రారంభ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖాధికారి ఏ.కిరణ్ కుమార్ ముఖ్య అతిధిగా విచ్చేయడం జరిగింది. అందరూ ఈ రెండు రోజుల పాటు శిక్షణ పొంది, మండల స్థాయి శిక్షణా కార్యక్రమాలను చక్కగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు. ఒంగోలు మండల విద్యాశాఖాధికారి టి.కిషోర్‌బాబు కోర్సు డైరక్టర్‌గా వ్యవహరిస్తారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు డి.నాగరాజు(ఏఎంఓ), ఎం.జాలరత్నం(ఎంఐఎస్ ప్లానింగ్ కోఆర్డినేటర్), పి.నాగేంద్ర నాయక్ హాజరయ్యారు. టీచ్‌టూల్ జిల్లా కోఆర్డినేటర్ చైతన్య ఈ శిక్షణకు రిసోర్సు పర్సన్‌గా వ్యవహరించడం జరిగింది.



## పేరుకే మోడల్ స్కూల్.. సౌకర్యాలు అన్నీ కరువే





**- రెండు ఆర్వో ప్లాంట్లు ఉన్న పని చేయవు**

**- బోరు నీరే శరణ్యము**

**- బాలికల హాస్టల్‌లో అన్నం వండటం లేదు.. వండినా మెనూ పాటించరు**

**- బాలికలు రాత్రులు నిద్రించాలంటే రక్షణ ఉండదు**

**- యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఆకస్మిక తనిఖీలో వెల్లబోసుకున్న విద్యార్థుల గోడు**

**- ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తానని విద్యార్థులకు హామీ ఇచ్చిన గూడూరి ఎరిక్షన్‌బాబు**

**పెద్దదోర్నాల, నవంబర్ 4, ప్రభాతవార్త**

మండలంలోని వై.చెర్లోపల్లి(మోట్ల మల్లిఖార్జునపురం) ఏపీ మోడల్ స్కూల్‌ను యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. బాలికల హాస్టల్‌లో ఒక ఆర్వో ప్లాంట్, మోడల్ స్కూల్లో ఒక ఆర్వో ప్లాంట్ ఏడాదిగా మరమ్మత్తులకు నోచుకోని అలంకార ప్రాయంగా ఉంది. దీంతో విద్యార్థులు బోరునీటికే పరిమితమయ్యారు. దీంతో ఆరోగ్య సమస్యలు కూడా విద్యార్థులకు ఉన్నాయి. హాస్టల్లో వంట సక్రమంగా వండరు. వండినా మోనూ అసలు పాటించరు. కూరగాయలు ప్రిన్సిపాలే తెస్తారు. ద్వారా కూరగాయల సప్లై లేదు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఉపాధ్యాయులు పగలు పాఠశాలకు వచ్చి పోతుంటారు. ఉపాధ్యాయులు ఇళ్లకు రాత్రి వేళలో బాలికలు నిద్రించాలంటే రక్షణకు వాచ్‌మెన్ సైతం లేక భయం గుప్పెట్లో గడపవలసి వస్తుందని విద్యార్థినీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నల్లమల అడవిలో ఉన్న ఈ పాఠశాలల వైపు తరచుగా వన్యప్రాణాలు సంచరిస్తుంటాయని రాత్రి వేళలో భయం గుప్పెట్లో గడుపుతున్నామని విద్యార్థులు తమ గోడును వెల్లబోసుకున్నారు. ఇదిలా ఉంటే మోడల్ స్కూల్లో విద్యార్థినీ, విద్యార్థులు ఎదుర్కొంటున్న అసౌకర్యాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు వెళ్ళడంతో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు స్వయంగా పాఠశాలను సందర్శించారు. తనిఖీ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థుల తాగునీటి కొరత, మరుగుదొడ్ల సదుపాయాల లేమి గుర్తించారు. అలాగే హాస్టల్లో పెడుతున్న భోజనాన్ని బాగుందా..? భాగాలేదా..? అని రుచి తెలుసుకునేందుకు స్వయంగా భోంచేసి తెలుసుకున్నారు. అక్కడ నుండి హాస్టల్, మోడల్ స్కూల్‌ను పరిశీలించి ఆర్వో ప్లాంట్లు పని చేయకపోవడం గుర్తించారు. విద్యార్థులతో గూడూరి ఎరిక్షన్‌బాబు ముఖాముఖిగా మాట్లాడారు. విద్యార్థినీలు లేచి మెనూ పాటించడం లేదు. మినరల్ వాటర్ ప్లాంట్ ఉన్నప్పటికి తాగునీటి సౌకర్యం లేదు. బోరింగ్ నీళ్లతో అల్లాడు తున్నా మని ఎరిక్షన్‌బాబు దృష్టికి తెచ్చారు. ప్రిన్సిపాల్ ఆంజనేయులు ఎదురుగా సమస్యలు చెప్పలేక భయపడుతున్న విద్యార్థినీలను చూసి సమస్యలు నిర్భయంగా చెప్పండి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ధైర్యం చెప్పడంతో విద్యార్థినీలు అంతా కలిసి ఏపీ మోడల్ స్కూల్‌లో ఉన్న సమస్యలన్నింటిని గూడూరి ఎరిక్షన్‌బాబుకు వివరించారు. ఒక సమాజం ప్రగతి పథం పయనించాలంటే విద్యాభివృద్ధి ఎంతో కీలకమని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, అధికారులతో విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని గూడూరి ఎరిక్షన్‌బాబు భరోసా ఇచ్చారు. గూడూరి ఎరిక్షన్‌బాబుతో పాటు మండల విద్యాశాఖాధికారి బి.మస్తాన్ నాయక్, పెద్ద దోర్నాల మండల టీడీపీ కన్వీనర్ షేక్ మాబు, మాజీ టీడీపీ మండల కన్వీనర్ ఏరువా మల్లిఖార్జునరెడ్డి, టీఎన్‌టీయుసీ రాష్ట్ర కార్యదర్శి బట్టు సుధాకర్‌రెడ్డి, టీడీపీ లీడల్ సెల్ న్యాయవాది వల్లభనేని కాశయ్య, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యాక్షుడు జడి లక్ష్మయ్య, గుండారెడ్డి వెంగళరెడ్డి, గుంటక సుబ్బరాయుడు, షేక్ మౌలాలి, చెంచయ్య, జనసేన మండల కన్వీనర్ కేతి వెంకట మోహన్ మురళి, కూటమి నాయకులు పాల్గొన్నారు.


## పళ్ళు రాలగొట్టా.. ఐతే ఏంటీ..?

**- టీడీపీ కంచుకోటలో విచక్షణారహితంగా హల్‌చల్**

**- పోలీసుల తీరుపై పలు ఆరోపణలు**

**- భయబ్రాంతులకు గురైన గ్రామస్తులు**

**ఒంగోలు, నవంబర్ 4, ప్రభాతవార్త**




అదోతెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్ర బాబునాయుడు నడయాడిన నేల. పర్చూరు నియోజకవర్గంలో టీడీపీ కంచు కోట అని నమ్మి, ఎంచుకొని మరి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నడయాడిన నేల. పర్చూరు శాసనసభ్యులు ఈ ఊరు నా ఊరు అని గర్వంగా చెప్పుకునే ఏలూరి అడ్డా. తులసివనంలో గంజాయి మొక్క వలె ఒకే ఒక్క ప్రతిపక్ష పార్టీ కరుడుగట్టిన కుటుంబం. ఆ కుటుంబంలోనే ములసం పుట్టింది. తండ్రి తప్పటడుగులు వేస్తున్నాడు అంటూ తల్లి చేసిన ఆరోపణలు జీర్ణించుకొని, వంట పట్టించుకుని క్రూరం మృగంలా చెలరేగాడు కొడుకు. మతిభ్రమిం చిన తన తండ్రితో సంబంధం ఉందని ఊహించుకొని ఓ అభాగ్యురాలి ఇంటిపై దాడి చేశాడు. మారనాయు ధాలతో విచక్షణరహితంగా మూతిపళ్ళు రాలగొట్టాడు. బాధితురాలు తప్పించుకునే క్రమంలో అడ్డుపెట్టిన చేతి ఎముకలను ముక్కలు ముక్కలు అయ్యే వరకు దాడి చేసి కాలర్ ఎగరేసుకుంటూ ఇంటికి వెళ్ళిపో యాడు. బాధితురాలను చూసి అయ్యో అనుకున్న ఇరుగుపొరుగు ఇళ్లతో, బంధువులు అతి కష్టం మీద మొంథా తుఫాన్‌లోనే చీరాల ఏరియా వైద్యశాలకు వైద్యం కోసం తీసుకెళ్లారు. ఏరియా వైద్యశాలలో పోలీసులకు సవివరంగా జరిగిన ఉదంతాన్ని కంప్లైంట్ రూపంలో తెలియపరిచారు. దాడి చేసిన క్రూరమృగం సగర్భంగా ఊళ్లో అచ్చోసిన ఆంబోతువలె తిరుగుతూ ఉంటే ముక్కన వేలు వేసుకోవడం గ్రామస్తులు వంతు అయింది. ఈ ప్రభుత్వం నా వెంట్రుక పీ.. తుందా అంటూ క్రూర మృగం గ్రామంలో తిరుగుతోంది. ఈ క్రూర మృగానికి దగ్గర బంధువైన సబ్ ఇన్‌స్పెక్టర్ సహాయంతో కేసు తీవ్రత తగ్గించేలా సెఒన్లు పెట్టి కేసు నమోదు చేశారు చిన్నగంజాం పోలీసులు. భారీ గా నగదు బహుమతులు ముట్టినట్లు బోగట్ట. మరో పక్క రంగంలోకి దిగిన ప్రతిపక్ష పార్టీ మండల కన్వీనర్ తనదైన శైలిలో లాభయింగ్ మొదలు పెట్టాడు. ఓ పక్క సానుభూతి మరో పక్క నగదు ఆశపెట్టి బాధిత కుటుంబాన్ని భ్రమలోంచి గ్రామ పెద్దలు సైతం పరిష్కరించడానికి ఇష్టపడని కేసును తన ఇంటి దగ్గరకు పిలిపించాడు. సామదానదండో పాయాలను అమలు చేసి సుమారు వారం రోజులు తర్వాత రాజీకుదుర్చారు. సిఎంచంద్రబాబు ప్రతిష్ఠాత్మ కంగా పీ 4 పథకాన్ని ప్రారంభించిన గ్రామంలో ఒక్క వాలంటర్ కుటుంబం చేసిన వీరంగాన్ని అడ్డుకునేం దుకు సాక్షాత్తు ఎమ్మెల్యే కార్యాలయం ముందుకు వచ్చినా పోలీసుల ముందు పప్పులు ఉడకలేదు. ఎమ్మెల్యే కార్యాలయం సూచనలు సైతం పెడచెవిన పెట్టి ప్రతిపక్షానికి కొమ్మగాశారు. చిన్నగంజాం పోలీ సులు,చివరిగా చంద్రబాబు నడయాడిన గ్రామంలో ప్రతిపక్ష వైకాపా కార్యకర్త ఎదుటివారి రక్తాన్ని కళ్ళల జోసి డబ్బులతో తన కాళ్ల వద్దకు తీసుకున్న ఘటన చిన్న మండలం పెద్దగంజాం పంచాయతీ ఆవులదొడ్డి కొత్త గొల్లపాలెంలో చోటు చేసుకుంటే నాయకులు కల్లప్పగించి చూడడంపట్ల గ్రామస్తులు విస్తుపోయారు. ప్రస్తుతం పళ్ళురాలాయి. ప్రాణం పోయినా ఇంతేగా.. అంటూ గ్రామస్తులు పెదవి విరుస్తున్నారు.

**- నాన్‌బెయిలబుల్ కేసు పెట్టాం: చిన్నగంజాం ఎస్సై బి.రమేష్**

నాన్ బెయిలబుల్ కేసు పెట్టాము. ముద్దాయి ప్రస్తుతం స్టేషన్‌లోనే ఉన్నాడు. బహుశా రేపు కోర్టులో హాజరు పరుస్తాం.

## పత్తేపురం విశ్రాంత చౌకధరల దుకాణ డీలర్ రామేశ్వరరావు కన్నుమూత

### - రామేశ్వరరావు కుటుంబానికి సంతాపం తెలిపిన రేషన్ డీలర్ల సంఘం



**సంతమాగులూరు,నవంబరు 4, ప్రభాతవార్త**

సంతమాగులూరు మండలం పత్తేపురం విశ్రాంత చౌకధరల దుకాణ డీలర్ జమ్ముల రామేశ్వరరావు(71)కన్ను మూశారు. సంతమాగులూరుమండలంలోనే అత్యంత రాజకీయ చైతన్యం కలిగిన పత్తేపురం గ్రామంలో 40 సంవత్సరాలకు పైగా ఏకైక రేషన్ డీలఆర్‌గా జమ్ముల రామేశ్వరరావు వివాద రహితుడిగా కొనసాగారు. రాష్ట్రంలో అధికారం మారినప్పుడుడల్లా గుంపు గుత్తగా రేషన్ డీలర్లను, ఉపాధిహామీ క్షేత్ర సహాయకులను చిటికెలో మార్చి అధికారపార్టీ వారు హస్తగతం చేసుకుంటున్న పరిస్థితులలో కూడా జమ్ముల రామేశ్వరరావు వివాదాలకు దూరంగా గ్రామంలో అందరివాడుగా సుదీర్ఘకాలం రేషన్ షాపు కొన సాగించారు. ఇటీవల రామేశ్వరరావు అరోగ్యం సహకరించక పోవడంతో రేషన్ షాపు గ్రామంలోని మరొకరు నిర్వహిస్తున్నారు. కాగా రామేశ్వరరావుకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉండగా బిడ్డలు ఇద్దరికి వివాహాలు పూర్తయి ఉద్యోగాలలో స్థిరపడ్డారు. భార్య గోవిందమ్మ ఏడాది క్రితం కన్ను మూసింది. ఈనేపద్యంలో రెండురోజుల క్రితం ఆరోగ్యం మందగించడంతో తన కోడలు పుట్టిల్లు మండలంలోని మామిళ్లపల్లి వెళ్లి అక్కడ వైద్యసహాయం పొందుతూ కన్నుమూశారు. రామేశ్వరరావు అంతిమ సంస్కారం బుధవారం పత్తేపురంలో జరుప నున్నట్లు కుటుంభ సభ్యులు తెలిపారు.

**రామేశ్వరరావు కుటుంబానికి సంతాపం తెలిపిన రేషన్ డీలర్ల సంఘం**

సంతమాగులూరు మండలంలో సుదీర్ఘ కాలం చౌకధరల దుకాణ నిర్వాహకుడుగా రేషన్ డీలర్లకు ఆది గురువుగా కొనసాగి కన్నుమూసిన జమ్ముల రామేశ్వరరావు కుటుంబానికి తాహసీల్దార్ రవిబాబు, మండల రేషన్ డీలర్ల సంఘం తమ ప్రగాడ సంతాపం తెలిపింది. సంతాపం తెలిపిన వారిలో మండల రేషన్ డీలర్ల సంఘ అధ్యక్షులు జూటూరి ఆదినారాయణ, ఉపాధ్యక్షులు అనంతవరపు శ్యాంబాబు, కార్యదర్శి చింతా గోవిందు మండలంలోని అందరు రేషన్ డీలర్లు తమ సంతాపం తెలిపారు.

## నేటి నుండి పొలం పిలుస్తోంది



**బల్లికురవ, నవంబర్ 4, ప్రభాతవార్త**

మండలంలో నేటి నుండి తిరిగి పొలం పిలుస్తోంది కార్యక్రమం ప్రారంభమైనట్లు వ్యవసాయాధికారి శ్రీనివాసరావు తెలియజేశారు. మంగళవారం మండలంలోని వేలమావారిపాలెం, కొత్తూరు గ్రామాలలో కార్యక్రమం సాగింది. వరి పంటను పరిశీలించి వరిలో ఆకు చుట్టు పురుగు గుర్తించడం జరిగిందని ఆయన వివరించారు. ఆకుచుట్టు పురుగు నివారణకు క్లోరాంట్రానిలిప్రోల్ 18.5శాతం ఎస్సీ(7మి.లీ) లేదా ఫ్లూబెండమైడ్ 20శాతండబ్ల్యూజీ(7గ్రాములు), 15 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. లేదా మోనోక్రోటోఫాస్(1.6 మి.లీ లేదా 2 మి.లీ) లేదా ప్రొపెనోఫాస్(2మి.లీ) లీటరు నీటికి కలిపి పిచికారి చేసి నివారించవచ్చు అని, ఆయా గ్రామాల రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మౌలాలి, వీఏఏ వెంకయ్య, రెండు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## బల్లికురవలో చెకుముకి సైన్సు సంబరాలు



**బల్లికురవ, నవంబర్ 4, ప్రభాతవార్త**

చెకుముకి సైన్సు సంబరాలలో భాగంగా మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలలో మండల స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 8 ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి స్థానాన్ని కొప్పెరపాడు మాతో పాఠశాల కైవసం చేసుకుంది. సంబంధిత విద్యార్థులను జిల్లా చెకుముకి కన్వీనర్ పి.రామాంజనేయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి దేవిద్పాల్, అంబడిపూడి ప్రధానోపాధ్యాయులు జి.శివలింగారావు, ఆయా పాఠశాలల సైన్సు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మహిళా రైతులకు అండగా అడ్వాంటా సీడ్స్



**మార్టూరు, నవంబర్ 4, ప్రభాతవార్త**

మార్టూరు మండలంలో అడ్వాంటా సీడ్స్ వారు మహిళా రైతుల సాధికారిత కోసం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్)లో భాగంగా మార్టూరు మండలంలోని మహిళా రైతులను ఎన్నుకొని వారికి ఉచితంగా మాన్యువల్ సీడ్ సోయింగ్ మెషిన్‌లను (మొక్కజొన్న విత్తనాలు నాటే యంత్రాలు) పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మార్టూరు వ్యవసాయాధికారి లావణ్య మాట్లాడుతూ ఈ యంత్రాల ద్వారా రైతులు విత్తనాన్ని సమయానికి వేయడంలో సులభతరం అవుతుందని, శ్రమ వ్యయాన్ని తగ్గించడంతో పాటు దిగుబడి పెరుగుతుందని, వ్యవసాయ రంగంలో ఉన్న కార్పొరేట్ కంపెనీలు అడ్వాంటా సీడ్ కంపెనీ వారిలా ముందుకు వచ్చి అన్నదాతలకు నూతన యంత్రాలను అందించి అన్నదాతలకు అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. అడ్వాంటా సీడ్స్ జోనల్ మేనేజర్ శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రైతు జీవనోపాధి మెరుగుపరిచేందుకు కొత్త ఆవిష్కరణలు శిక్షణలు, సాంకేతిక పరికరాలను అందించడం ద్వారా రైతు అభివృద్ధి జరుగుతుందని, ఇలాంటి వాటికి మా కంపెనీ అన్ని వేళలా ముందంజలో ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా సేల్స్ మేనేజర్ రోహిత్ కుమార్, టెరిటరీ మేనేజర్ సుమంత్, కంపెనీ అభివృద్ధి డీలర్లు, మార్టూరు మండలంలోని రైతులు పాల్గొన్నారు.

## చెకుముకిలో శ్రీనివాస హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

**మార్టూరు, నవంబర్ 4, ప్రభాతవార్త**

మండలంలోని బొబ్బేపల్లిలో మంగళవారం చెకుముకి సైన్స్ సంబరాలలో భాగంగా జనవిజ్ఞాన వేదిక వారు మార్టూరు మండల స్థాయిలో నిర్వహించిన పోటీ పరీక్షలో మార్టూరు మండలంలో మొదటి స్థానం, రెండవ స్థానాలు శ్రీనివాస హైస్కూల్ విద్యార్థులు గెలుపొందారు. వీరు జిల్లా స్థాయిలో నవంబర్ 23న జరిగే పోటీ పరీక్షలకు అర్హత సాధించారు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## బిర్సాముండా జయంతి వేడుకల నిర్వహణ



**మార్టూరు, నవంబర్ 4, ప్రభాతవార్త**

స్వతంత్ర సమరయోధుడు మన్యశ్రీ బిర్సా ముండా 151వ జయంతి సందర్భంగా మంగళవారం మార్టూరు మండలంలోని పాఠశాలలో చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా స్థానిక మార్టూరు గ్రామంలోని ఎస్టీ కాలనీ నందు ఉన్న ప్రాథమిక పాఠశాలలు జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ కోఆర్డినేటర్ వి.సత్య సాగర్ సందర్భంలో బిర్సా ముండా గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం నిర్వహించిన చిత్రలేఖనం, వక్తృత్వ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.జయకుమారి, సీఆర్పీ రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కంది, మినుము పంటలలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

### - ఏవో ప్రకాష్‌రావు



**కొనకనమిట్ల, నవంబర్ 4, ప్రభాతవార్త**

తుఫాన్ ప్రభావం వల్ల కందిలో వేరుకుళ్ళు, తెగులు వచ్చే అవకాశం ఉందని నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కే.ప్రకాష్‌రావు అన్నారు. మంగళవారం రేగుమానుపల్లెలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కంది వేసిన రైతులు బైటాక్స్ అనే మందును 3 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకుంటే వేరుకుళ్ళు నుంచి నివారించవచ్చన్నారు. అదే విధంగా మినుము, అలసంద పంటలలో 13:0:45 కేజీ చొప్పున బీలామిన్ ఐరన్ 100 గ్రాములు చొప్పున కలిపి ఎకరానికి పిచికారి చేసుకోవాలి, అదే విధంగా తెల్లదోమ నివారణకు డయాఫెంతురాన్ 250 గ్రాములు తామర పురుగు నివారణకు డయాఫెంతురాన్ 250 గ్రాములు తామర పురుగు నివారణకు ఫ్లోనికామిడ్ 80 గ్రాములు, ఆకుముడత తెగులుకు హెక్సాకొనాజోల్ 400 గ్రాములు పిచికారి చేస్తే ఈ పంటలను బీడీపేడ నుంచి కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. వ్యవసాయశాఖ సిబ్బంది ప్రతి ఒక్క రైతు సేవ కేంద్రానికి మంత్ర డివైస్ సర్వరా చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన గిద్దలూరు నియోజకవర్గ విద్యార్థులు



**గిద్దలూరు, నవంబరు 4 ,ప్రభాతవార్త**

రాజ్యాంగ దినోత్సవ వేడుకల సందర్భంగా గిద్దలూరు నియోజకవర్గంలోని వివిధ మండలాలలో టాపర్స్‌గా ఎంపికైన విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ మరియు క్విజ్ పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమానికి గిద్దలూరు మండల విద్యాశాఖాధికారులు అశ్విని కుమార్, పోలా నాగభూషణ రెడ్డిలు పాల్గొని ముందుగా ప్రసంగించారు. నియోజకవర్గ స్థాయిలో జరిగిన ఈ పోటీలలో గిద్దలూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన షేక్ నూరాని మొదటి స్థానం, రెండవ స్థానంలో ఎస్.రమ్యశ్రీ, తురిమెళ్ళ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన టిజె దినేష్ నాయుడు రెండవ స్థానంలో నిలిచారు.

## చేనేత కార్మికులకు నిత్యవసరాల పంపిణీ



**బల్లికురవ, నవంబర్ 4, ప్రభాతవార్త**

మొంథా తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు చేనేత కార్మికుల మగ్గాల గుంతలలోకి నీరు చేరడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో కార్మికులు రోజువారి ఆదాయాన్ని కోల్పోయారు. ఇప్పటికి మగ్గాల గుంతలు ఆరకపోవడంతో పనులు ప్రారంభించలేదు. చేనేత కార్మిక సంఘాల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ప్రతి చేనేత కార్మిక కుటుంబానికి నిత్యవసరాల సరుకులు పంపిణీ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా మంగళవారం సాయంత్రం తహసీల్దార్ రవి నాయక్ నక్క బొక్కలపాడులోని చేనేత కార్మికులకు నిత్యవసరాలు పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి 50 కిలోల బియ్యంతో పాటు, నిత్యవసర సరుకులను అందజేశారు. రెక్కాడితే డొక్కాడని కార్మికులకు అండదండలు అందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు పోతుందని తహసీల్దార్ రవి నాయక్ అన్నారు. తుఫాన్ వల్ల నష్టపోయిన ప్రతి కుటుంబానికి న్యాయం చేసేందుకు మహాకూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. ఇదే విధంగా పంట నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం నష్టపరిహారాలను అందజేసేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు దర్శి రామ స్వామి, వీఆర్వో అశోక్, గ్రామ సర్పంచ్ దూళిపాళ్ల బుల్లి రామయ్య, డీలర్ ముత్తినేని సుబ్బారావు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## మండల స్థాయి చెకుముకి ప్రతిభా పరీక్షకు 180 మంది విద్యార్థులు హాజరు



**కొనకనమిట్ల, నవంబర్ 4, ప్రభాతవార్త**

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పొదిలిలోని బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన చెకుముకి ప్రతిభా పరీక్షలకు ఆరు మండలాల నుంచి 60 టీములు, ఒక్కొక్క టీముకు ముగ్గురు చొప్పున మొత్తం 180మంది విద్యార్థులు హాజరయ్యారని జేవీవీ జిల్లా ఉపాధ్యక్షులు దాసరి గురుస్వామి, కార్యదర్శి బి.దేవప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల 8,9,10 తరగతి విద్యార్థులు ఈ పరీక్షలు రాశారు. మండల స్థాయిలో ప్రతిభ కనపరిచి జిల్లా స్థాయి చెకుముకి ప్రతిభ పరీక్షకు అర్హత సాధించారన్నారు. పొదిలి మండల ఉప్పలపాడు జడ్పీహెచ్ఎస్, మాంటిసోరి స్కూల్ విద్యార్థులు, కొనకనమిట్ల జడ్పీహెచ్ఎస్, దొనకొండ మండలం ఆరవల్లిపాడు జడ్పీహెచ్ఎస్, వివేకానంద పాఠశాల, మర్రిపూడి మండలం కాకర్ల జడ్పీహెచ్ఎస్, గీతాంజలి పాఠశాల, కురిచేడు మండలం కల్లూరు జడ్పీహెచ్ఎస్, దర్శి మండలం పోతవరం జడ్పీహెచ్ఎస్, దర్శి కిజిజి పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి చెకుముకి పరీక్ష రాసేందుకు అర్హత సాధించారు. తొలుత చెకుముకి ప్రతిభ పరీక్ష ప్రశ్న పత్రాలను జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు దాసరి గురుస్వామి, కార్యదర్శి బి.దేవప్రసాద్, లాలూ ఫౌండేషన్ చైర్మన్ కరిముల్లా బేగ్, గాండ్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చిట్టెంశెట్టి వెంకట కృష్ణారావు, జేవీవీ గౌరవ సలహాదారులు యలమందారెడ్డి, దర్శి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, విజయభాస్కర్, పొదిలి మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్, మర్రిపూడి, కొనకనమిట్ల మండలాల అధ్యక్షులు ఆంజనేయ చౌదరి, పీవీ కొండయ్యలు, గొట్లగట్టు ఉన్నత పాఠశాల హెచ్ఎం ఆదినారాయణ, కోలాటం మాస్టర్ కటకం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**దాతలు చిట్టెంశెట్టి, కరిముల్లా బేగ్‌లకు సన్మానం :**

చెకుముకి పరీక్షలకు హాజరైన విద్యార్థులకు, ఉపాధాయయులకు విందు భోజనాలు ఏర్పాటు చేసి గాండ్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చిట్టెంశెట్టి వెంకట కృష్ణారావు, గోల్డ్ మెడల్ ను అందించిన అబీబుల్లా ఫౌండేషన్ చైర్మన్ కరిముల్లా బేగ్‌లను విద్యార్థులు, ఉపాధ్యాయులు, జేవీవీ ప్రతినిధులు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. వారి సేవలను అభినందించారు.

## ప్రతి ఇంట స్వదేశీ నినాదంతో బీజేపీ ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ



**కొనకనమిట్ల, నవంబర్ 4, ప్రభాతవార్త**

ఆత్మనిర్భర్ భారత్ సంకల్ప అభియాన్ మండల ప్రవాస యోజనలో భాగంగా ప్రతి ఇంట స్వదేశీ ఇంటింట స్వదేశీ నినాదంతో కరపత్రాలు పంపిణీ, స్టిక్కర్లను బీజేపీ నాయకులు ఆధ్వర్యంలో మంగళవారం అతికించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా బీజేపీ జిల్లా నాయకురాలు శాసనాల సరోజిని పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ధార్మిక సెల్ కన్వీనర్ ఎస్.హిమాం కాశీం, జిల్లా నాయకులు కల్లం సుబ్బారెడ్డి, కిలారి శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు మన్నం సురేష్, ఉపాధ్యక్షులు కేవీఆర్ ప్రధాన కార్యదర్శి కే.వెంకటేశ్వర్లు, నాయకులు ఎద్దుల నాయుడు, రాజ పురోహిత్, అశోక్, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వృత్తి విద్యా శిక్షణలో జిల్లాస్థాయిలో ఎంపికైన బాలికలు



**యర్రగొండపాలెం, నవంబరు 4, ప్రభాతవార్త**

యర్రగొండపాలెం పట్టణంలోని కస్తూర్బ గాంధీ బాలికల విద్యాలయంలో వృత్తి నైపుణ్యం కోర్సులలో మండలస్థాయి కస్తుర్బ గాంధీ విధ్యాలయం పరిధిలో శిక్షణ జరిగిందని కస్తుర్బా గాంధీ బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్స్ పాల్ యస్ తిరుమల దేవి తెలిపారు. యర్రగొండపాలెం పట్టణంలోని కస్తుర్బ గాందీ విధ్యాలయంలో ఐటి/ఐటిఈఎస్ కోర్సులలో 9 ,10,11,12 తరగతులకు సంబందించిన విధ్యార్దులకు శిక్షణ ఇవ్వడం జరిగిందని, శిక్షణలో కాలేజీపరిధిలో నైపుణ్యత చూపించిన విధ్యార్ధినులను జిల్లాస్దాయిలో జరిగే పలుశిక్షణల కోర్సుల కోసం ఎంపిక చెయడం జరిగిందని ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్దాయిలో జరిగిన శిక్షణలో ప్రతిభ కనపరిచిన బాలికలు యస శైలజ ఇంటర్ మొదటి వసంవత్సరం, సిహెచ్ అనురాధ ఇంటర్ రెండవ సంవత్సరం, వి దేవీ ఇంటర్ రెండవ సంవత్సరం, యస్ కాంతామణిలు ఎంపికయ్యారని తెలిపారు. వృతి విధ్యాశిక్షణ కార్యాక్రమంలో కార్యానిర్వకులుగా జె పావనిబాయ్ , సిహెచ్ గురువమ్మ, వి సునందా మేరి, సుజాత, షేక్ మస్తాన్ బిలతో పాటు విధ్యార్దులు పాల్గొన్నారు.

## గిద్దలూరు జాతి రహదారిపై ముమ్మరంగా వాపనాల తనిఖీలు



**గిద్దలూరు రూరల్, నవంబరు 4, ప్రభాతవార్త**

గిద్దలూరు పట్టణంలోని అమరావతి - అనంతపురం జాతీయ రహదారి మరియు కడప - గిద్దలూరు రాష్ట్రీయ రహదారిపై విడతలవారీగా గిద్దలూరు అర్బన్ సీఐ సురేష్, రూరల్ సీఐ రామకోటయ్య వాహనాల తనిఖీలు చేపట్టారు. ఇటీవల వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు సిఐలు వాహన తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. వాహన సంబంధిత ధ్రువపత్రాలు, వాహనం నడుపుతున్న డ్రైవర్ లైసెన్స్ సంబంధిత సేఫ్టీ పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని పరిమిత వేగంతో వాహనాలు నడిపి సురక్షి తంగా గమ్య స్థానాలకు చేరాలని సూచించారు.

## కంభంలో చెకుముకి మండల స్థాయి సంబరాలు



**కంభం, నవంబరు 4, ప్రభాతవార్త**

జన విజ్ఞాన వేదిక కంభం మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక బోర్డు స్కూల్ నందు జన విజ్ఞాన వేదిక మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను మంగళవారంఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈఓ అబ్దుల్ సత్తార్ చెకుముకి ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు. మండల స్థాయిలో జరిగిన ఈ పోటీ పరీక్షలో అన్ని పాఠశాలల నుండి 90 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలో ప్రభుత్వ పాఠశాలల విభాగం నుండి కంభం బాలికల పాఠశాల నుండి ముగ్గురు విద్యార్థినిలు, ప్రైవేటు పాఠశాల విభాగం నుంచి వాసవి విద్యానికేతన్ నుంచి ముగ్గురు విద్యార్థులు ప్రథమ ద్వితీయ స్థానాలు సాధించగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలశాఖ గౌరవాధ్యక్షులు డాక్టర్ సద్దాం హుస్సేన్, అధ్యక్షులు వరికుంట వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి ,చెకుముకి కన్వీనర్ నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

## హుస్సేనాపురం, కొటాలపల్లిలో పొలం పిలుస్తోంది



**వెలిగండ్ల, నవంబర్ 4, ప్రభాతవార్త**

వెలిగండ్ల మండలంలోని హుస్సేనాపురం, కొటాలపల్లి గ్రామాలలో వ్యవసాయశాఖ వారి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాదికారి శనగ విత్తనాలను 25 శాతం రాయితీపై పంపిణీ చేశారు. ప్రతి రైతు శనగ విత్తనాలను విత్తే ముందు కిలో విత్తనానికి 10 గ్రాములు ట్రైకోడెర్మా విరిడి లేదా 1.5 గ్రాముల విటావాక్స్ ఫౌడర్‌తో విత్తనానికి పట్టించి విత్తాలని సూచించారు. పై విధంగా చేయడం వలన ఎండు తెగులు నివారించవచ్చు. అదే విధంగా మొంథా తుఫాన్ వలన సజ్జ పంట నష్టపరిహార రైతుల జాబితా ను సామాజిక ప్రదర్శన నిమిత్తం రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరి, బొబ్బర, కంది పంటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, పశుసంవర్ధకశాఖ సిబ్బంది పాల్గొన్నారు. రెండు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు

## నిర్వహించిన టీడీపీ నాయకులు కృష్ణ కిషోర్

### - ఇటీవల ఆలయంలో జరిగిన చోరీపై ఆరా...



**గిద్దలూరు, నవంబరు 4, ప్రభాతవార్త**

గిద్దలూరు పట్టణం, రాచర్ల రోడ్డులోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో గిద్దలూరు నియోజకవర్గ టీడీపీ నాయకులు ముత్తుముల కృష్ణ కిషోర్‌రెడ్డి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల ఆలయంలో జరిగిన చోరీపై ఆరా తీసి జరిగిన సంఘటనను గురించి అడిగితెలుసుకున్నారు. దొంగలించినస్వామివారి వెండినగలను త్వరితగతిన రికవరీ చేయాలన్నారు. వారితో పాటుపట్టణ తెలుగుదేశం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సంగమేశ్వరం వద్ద పటిష్ట బందోబస్తు



**పొన్నలూరు,నవంబరు 4, ప్రభాతవార్త**

మండలంలోని ప్రసిద్ధ సంగమేశ్వర స్వామి దేవాలయం వద్ద కార్తీక పౌర్ణమి సందర్భంగా దేవాలయం వద్దకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా స్థానిక పోలీసులు పటిష్ట చర్యలు తీసుకున్నట్లు ఎస్ఐ అనుక్ తెలిపారు. దేవాలయ సమీపంలోని పాలేరులో నీరులోతు ఎక్కువగా ఉండి ప్రమాదకరంగా ఉందని, భక్తులు జాగ్రత్త వహించాలని కోరారు. ప్రమాదకర ప్రదేశంలోకి భక్తులు వెళ్లకుండా బారికేడ్లు నిర్మించి పోలీస్, రెవెన్యూ సిబ్బందితో దేవాలయ ప్రాంగణం చుట్టూ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. పోలీసులు నిర్ణయించిన సురక్షిత ప్రదేశాల వద్ద మాత్రమే మహిళా భక్తులు స్నానాలు ఆచరించాలని అక్కడ మహిళా సిబ్బందిని నియమించామన్నారు. ట్రాఫిక్ కు ఎలాంటి అంతరాయం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నామని, పోలీసు అవుట్ పోస్టు, మెడికల్ కాంపును కూడా ఏర్పాటు చేశామన్నారు. కావునా భక్తులు పోలీసు వారికి సహకరించాలని కోరారు.

## తల్లిపాలు, కుష్టు వ్యాధిపై అవగాహన



**సింగరాయకొండ,నవంబర్ 4, ప్రభాతవార్త**

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్యాధికారులు డాక్టర్ ఆయేషా, డాక్టర్ దీరేందర్ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టిన శిశువుల ఆరోగ్యకరమైన పెరుగుదల కోసం ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఆ తర్వాత రెండు సంవత్సరాల వరకు తల్లిపాలతో పాటు అదనపు ఆహారం అందించాలన్నారు. జిల్లా ఆరోగ్య విస్తరణ మరియు మీడియా అధికారి బెల్లం నరసింహారావు మాట్లాడుతూ సాంక్రమిక వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ నెల 17వ తేదీ నుంచి జరగనున్న జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే సర్వేనిర్వహించనున్నట్లు తెలిపారు. ఆశా కార్యకర్తలు ప్రతి ఇంటిని సందర్శించి సర్వే చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవి, పిఎమ్ఓ సూరిబాబు, దామా వెంకటేశ్వర్లు, మీడియా అధికారి బెల్లం నారాయణ రావు, పీరయ్య, కళ్యాణి, సయ్యద్ మసీద్ అలీ, విజయమ్మతో పాటు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## మూఢనమ్మకాల నిర్మూలనకు జనవిజ్ఞాన వేదిక కృషి




**వెలిగండ్ల, నవంబర్ 4, ప్రభాతవార్త**

జనవిజ్ఞాన వేదిక వెలిగండ్ల మండల స్థాయి ప్రశ్న పత్రాన్ని మంగళవారం స్థానిక హైస్కూల్ హెడ్‌మాస్టర్ గౌస్యవేగం, ఎంఈఓ దాసు ప్రసాద్, కేవీఎన్ అండ్ ఎల్ హైస్కూల్ కరస్పాండెంట్ ముత్తిరెడ్డి వెంకటరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గత 35 సంవత్సరాలుగా విద్యార్థుల్లో ఉన్నటువంటి శాస్త్రీయ దృక్పథాన్ని వెలికితీయడం కోసం సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించడం కోసం ప్రజల్లో విద్యార్థుల్లో ఉన్న మూఢనమ్మకాలను నిర్మూలించడం కోసం జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తుందని, ఇలాంటి టాలెంట్ టెస్టులు నిర్వహించడం శుభ పరిణామమని మండల స్థాయి విజేతలు రాష్ట్ర స్థాయిలో కూడా విజేతలు కావాలని ఆకాంక్షించారు. మండల స్థాయి విజేతలకు ప్రకాశం జిల్లా డీసీఎంఎస్ చైర్మన్, శ్యామల వెంకటరెడ్డి, ఫౌండేషన్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి బహుమతులు అందజేశారు. జనవిజ్ఞాన వేదిక తరుపున విద్యార్థులకు సర్టిఫికేట్లు, బుక్స్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెలిగండ్ల మండల జనవిజ్ఞాన వేదిక నాయకులు జెడ్ రమణయ్య, నాగరాజు, నరసింహారావు, వెలిగండ్ల హైస్కూల్ ఉపాధ్యాయ బృందం, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు దోర్నాల విద్యార్థి ఎంపిక



**పెద్దదోర్నాల, నవంబర్ 4, ప్రభాతవార్త**

పెద్దదోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న (అండర్-17లో) వి.నాగవంశీ మాధవ్(9వ తరగతి) ప్రకాశం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయిచదరంగం పోటీల్లో పాల్గొని అద్భుతమైన ప్రతిభ కనపరిచి ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి చదరంగం ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వారు పి.శ్యామ్ ప్రసన్నతాంజలి, పాఠశాల ఫిజికల్ డైరక్టర్స్ పి.రామానాయక్, హెచ్ రామా నాయక్ తెలిపారు. ఈ ఎంపిక కార్యక్రమం ఈనెల 3వ తేదీ యూటీఎఫ్ కార్యాలయం ఒంగోలు నందు డీఈఓ ఆధ్వర్యంలో ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ చెక్క వెంకటేశ్వర్లు, ఏ.శిరీష కుమారి పర్యవేక్షణలో చెస్ ఎంపిక కార్యక్రమం నిర్వహించి ప్రతిభను బట్టి ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయి వేదిక చదరంగం ఛాంపియన్ షిప్ పోటీలు నవంబర్ 7,8,9వ తేదీలలో పార్వతీపురం మన్యం జిల్లా, జోగంపేట ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్(బాయ్స్) నందు జరుగుతున్న రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు ఎంపికైన వంశీ మాధవ్ ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు వంశీ మాధవ్ ఎంపిక కావడం పట్ల పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దోర్నాల మండల విద్యాశాఖాధికారి బి.మస్తాన్ నాయక్, పాఠశాల హెచ్ఎం పి.శ్యామ్ ప్రసన్నతాంజలి, వ్యాయామ ఉపాధ్యాయులు పి.రామా నాయక్, హెచ్ రామానాయక్, జి.విజయ మాణిక్య, వి.నాగమూర్తి, ఎస్.అనసూయ దేవి, షేక్ రహమత్, టి.వెంకట శివ, షేక్ అబ్దుల్ సలాం, డి.పోలయ్య, కే.కిరణ్ కుమార్, కే.మీటే నాయక్, కే.శిరీష రాణి, షేక్ మహబూబ్ బీ, ఎంకే మహాదేవి, కే.ఆవులయ్య, సుబ్బారెడ్డి, శ్రీకాంత్, రమాదేవి, కే.ప్రసాద్, ఎం.అనిత, సయ్యద్ నాయబ్ రసూల్, టి.నరేష్, ఎం.కార్తీక్, ఉపాధ్యాయేతర సిబ్బంది బి.సీహెచ్ శ్రీరామ్, రామ సుబ్బారెడ్డి, డి.మధు, టి.సౌమ్య, జెడ్ సౌజన్య, ఎస్ఎంసీ చైర్మన్ షేక్ ఖాదర్ వలి తదితరులు పాల్గొని ప్రతిభ కనపరిచిన క్రీడాకారుడు వంశీ మాధవ్‌ను శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరక్టర్‌ను పి.రామానాయక్‌ను, హెచ్.రామానాయక్‌ను, షేక్ ఆయూబ్‌లకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## రెడ్డి మహిళా కళాశాలలో మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు

**మార్కాపురం, నవంబర్ 4, ప్రభాతవార్త**

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మార్కాపురం పట్టణంలోని రెడ్డి మహిళా కళాశాలలో మంగళవారం మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సైన్స్ ప్రతిభ పరీక్ష ప్రశ్నాపత్రాన్ని వేమన డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నారపరెడ్డి భారతమ్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భారతమ్మ మాట్లాడుతూ, సైన్స్ ప్రతిభ పరీక్షల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లోని సృజనాత్మకత వెలికి వస్తుంది. ఇది వారి మేధస్సుకు పదును పెడుతుందని అన్నారు. రెడ్డి మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రావి గాయత్రి మాట్లాడుతూ, విద్యార్థులు తమ పాఠ్యాంశాలలోని సందేహాలను ఉపాధ్యాయులను అడిగినివృత్తి చేసుకోవాలని, సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. జన విజ్ఞాన వేదిక పట్టణ కార్యదర్శి గుండాల ముక్తేశ్వరరావు మాట్లాడుతూ, విద్యార్థులు భవిష్యత్తులో శాస్త్రవేత్తల వలె కొత్త ఆవిష్కరణలకు దారితీయాలని" పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి ఏనుగుల రవికుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుకోవడం ద్వారా సమాజ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు ఎండి బాబు, ఏనుగుల శివ, మండ్ల రామాంజనేయులు, కే. మల్లికార్జున, టీ. నాగేశ్వరరావు, వై. చలమయ్య, యస్. సాయికృష్ణ, వై. కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



## రికవరీ ఏజెంట్లకు పోలీసుల హెచ్చరిక...

**- ఆర్‌బిఐ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు : డీఎస్పీ యూ నాగరాజు**





**మార్కాపురం, నవంబరు 4, (ప్రభాతవార్త)**
రుణ వసూళ్ల పేరుతో ఖాతాదారులను బెదిరించే రికవరీ ఏజెంట్లపై పోలీసులు కఠినంగా వ్యవహరించనున్నట్లు మార్కాపురం డీఎస్పీ యు నాగరాజు మీడియా సమావేశంలో స్పష్టం చేశారు. ఆర్‌బిఐ నిబంధనలను ఉల్లంఘించిన ఏజెంట్లు, బ్యాంకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ వి హర్షవర్ధనరాజు ఆదేశించినట్లు డీఎస్పీ నాగరాజు వెల్లడించారు. పోలీసులు విడుదల చేసిన ప్రకటనలో, రికవరీ ఏజెంట్లు రుణ వసూలు సమయంలో ఖాతాదారులను భౌతికంగా లేదా మౌఖికంగా వేధించడం, బెదిరించడం, వారి గోప్యతను ఉల్లంఘించడం వంటి చర్యలు పూర్తిగా నిషేధమని హెచ్చరించారు. ఈ రకమైన చర్యలు ఆర్ బి ఐ నియమావళి ఉల్లంఘన కింద పరిగణించబడతాయని తెలిపారు. ఆర్‌బిఐ నిబంధనల ప్రకారం రికవరీ ఏజెంట్లు ఉదయం 8 గంటల కంటే ముందు, సాయంత్రం 7 గంటల తరువాత రుణగ్రహీతలను సంప్రదించరాదని, రుణ వసూలు కార్యక్రమాలలో శిక్షణ పొందిన, మర్యాదగా ప్రవర్తించే ఏజెంట్లకే అనుమతి ఉంటుందని.బెదిరింపులు, అసభ్య ప్రవర్తన, మానసిక లేదా శారీరక వేధింపులు చేయడం ఆర్ బి ఐ నిబంధనలకు వ్యతిరేకం అని తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక పోలీసు అధికారులు రికవరీ ఏజెంట్లపై ప్రత్యేక దృష్టి సారించారు. రుణ వసూలు పేరుతో ఖాతాదారులను లైంగికంగా లేదా శారీరకంగా వేధించే ఏజెంట్లను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవడానికి ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించామని పోలీసులు తెలిపారు. పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ రుణ వసూళ్ల పేరుతో ఏజెంట్లు వేధింపులకు పాల్పడితే వెంటనే సమీప పోలీస్‌స్టేషన్ కి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ మీడియా సమావేశం లో సిఐ సుబ్బారావు, పట్టణ ఎస్ఐ ఎం సైదుబాబు, ఎస్ఐ అంకమరావు పాల్గొన్నారు.

## మార్కాపురం మండలంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం

**- తిప్పాయపాలెం, భూపతిపల్లి గ్రామాల్లో రైతులకు సూచనలు**



**మార్కాపురం, నవంబర్ 4, (ప్రభాతవార్త)**
మార్కాపురం మండలంలోని తిప్పాయపాలెం, భూపతిపల్లి గ్రామాల్లో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి కె బుజ్జి బాయి రైతులకు శనగ విత్తనాలను 25 శాతం రాయితీతో పంపిణీ చేశారు. రైతులు శనగ విత్తనాలను విత్తే ముందు కిలో విత్తనానికి 10 గ్రాముల ట్రైకోడర్మా విరిడి లేదా 1.5 గ్రాముల విటావాక్స్ పౌడర్‌తో విత్తనాన్ని పూతపూసి విత్తాలని సూచించారు. ఈ విధానం పాటించడం వలన ఎండు తెగుళ్లను సమర్థవంతంగా నివారించవచ్చని ఆమె తెలిపారు. అదే విధంగా, ఇటీవల వచ్చిన మొంథా తుఫాన్ కారణంగా ప్రత్తిపంటలకు జరిగిన నష్ట పరిహారానికి సంబంధించిన రైతుల జాబితాను సామాజిక ప్రదర్శన నిమిత్తం రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉంచినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమం సందర్భంగా మిరప, ప్రత్తి, కంది పంటలు పొలాలను సందర్శించి, రైతులకు తగిన సాంకేతిక సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు శ్వేత, రసూల్ పాల్గొన్నారు. రెండు గ్రామాల రైతులు ఉత్సాహంగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రతి విద్యార్థి ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి



**రాచర్ల, నవంబర్ 4, (ప్రభాతవార్త)**
ప్రతి విద్యార్థి ప్రశ్నించే తత్వాన్ని అలవరచుకోవాలని మండల విద్యాశాఖ అధికారులు షేక్ మొయినుద్దీన్, వి గిరిధర్ శర్మ అన్నారు. రాచర్ల జన్మభూమి భవనంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైన్స్ జ్ఞానాన్ని పెంపొందించుకున్నది దానిపై ఆసక్తి పెంచుకొని పరిశోధనల వైపు మనసు మార్చుకోవాలన్నారు. మూఢనమ్మకాలు పారద్రోలాలని, విద్యతోనే ఏదైనా సాధించగలమని, ఉన్నత శిఖరాలు చేరుకోగలం అనే దృఢమైన సంకల్పం కలిగి ఉండాలన్నారు. జనవిజ్ఞాన వేదిక ఈ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని వీటి ద్వారా విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీయవచ్చన్నారు. పోటీల్లో పాల్గొన్న మోడల్ స్కూల్ విద్యార్థులు మొదటి స్థానం, అనుములవీడు రాచర్ల విద్యార్థులు రెండో స్థానం, జేపీ చెరువు ఎడవల్లి విద్యార్థులు మూడో స్థానంలో నిలిచారని ఈనెల 23న జరిగే జిల్లా స్థాయి పోటీల్లో కూడా విజయం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపిక కావాలనికోరారు. ఈ కార్యక్రమంలో జెవివి సభ్యులు వి.శ్రీనివాసులు ఎ.సుధీర్‌కుమార్‌రెడ్డి ఉపాధ్యాయులు పి.రమణారెడ్డి హెచ్ఎం చంద్రశేఖర్ అన్ని పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సత్యవోలులో పొలం పిలుస్తోంది కార్యక్రమం



**రాచర్ల, నవంబర్ 4, (ప్రభాతవార్త)**
మండలంలోని సత్యవోలు, ఎడవల్లి గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం వ్యవసాయ శాఖ అధికారి షేక్ మహబూబ్ బాషా పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సాగుకు సంబంధించి రైతులు శనగ విత్తనాలు నాటేముందు విత్తన శుద్ధి చేసుకోవాలని అన్నారు. శనగ సాగు చేసే రైతులు కేజీ సెనగ విత్తనాల్లో 10 గ్రాముల ట్రైకో డెర్మ విరిడి మందు కలిపి విత్తన శుద్ధి చేసుకొని విత్తనం నాటాలని అన్నారు. అలా చేస్తే 30 రోజుల వరకు ఎండు తెగులు రాకుండా నివారించవచ్చన్నారు. అనంతరం వరి పంటలు పరిశీలించి రైతులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు నందిని, రామేశ్వర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలి



**రాచర్ల, నవంబర్ 4 ,(ప్రభాతవార్త)**
వాహనచోదకులు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ తమ వాహనాలను నడపాలని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. గిద్దలూరు - కంభం జాతీయ రహదారి పై రాచర్ల పోలీస్ స్టేషన్ వద్ద మంగళవారం ఆయన వాహనాల తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాల కు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనానికి సంబంధించిన పత్రాలు అన్నీ వాహనాల్లో ఉండాలని, లైసెన్సు లు లేకుండా డ్రైవర్లు వాహనాలు నడపవద్దని సూచించారు. హెల్మెట్ లేకపోయినా, మైనర్లు వాహనాలు నడిపిన కేసులు నమోదు చేస్తామని, ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించవద్దని ఆయన హెచ్చరించారు. తనిఖీల్లో స్థానిక పోలీసులు, హోంగార్డులు తదితరులు పాల్గొన్నారు.

## కొమరోలు మండలంలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**కొమరోలు, నవంబరు 4, (ప్రభాతవార్త)**
కొమరోలు మండలంలో ఆర్‌డీఎస్ఎస్ పనులు చేస్తున్న నేపథ్యంలో పలు గ్రామాలలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లుగా విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మల్లారెడ్డి పల్లె, ఎర్రపల్లె, బ్రాహ్మణ పల్లె గ్రామాలలో బుధవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని ఆయన తెలిపారు.

## వరిలో ఉల్లికోడు నివారణ చర్యలు తీసుకోవాలి



**అద్దంకి, నవంబరు 4, (ప్రభాతవార్త)**
వరిలో ఉల్లికోడు నివారణ చర్యలు తీసుకోవాలని అద్దంకి సహాయ వ్యవసాయ సంచాలకులు బి ఎఫ్రాయిము తెలిపారు. ధర్మవరం, శంఖవరప్పాడు గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగం గా వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ వరి పంట ను పరిశీలించారు. ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ వరి లో ఉల్లికోడు నివారణ కొరకు ఫిప్రోనిల్ 50%ఇసి, ఎకరాకు 400 ఎం. ఎల్. పిచికారి చేసుకోవాలని సూచించారు. తుఫాన్ తరువాత ఉల్లికోడు ప్రభావం ఎక్కువ గా కనిపిస్తుందని నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. తుఫాను కారణంగా నష్టపోయిన రైతులు జాబితా అన్ని రైతు సేవా కేంద్రాలలో సామాజిక తనిఖీ కొరకు ప్రదర్శించాలని రైతులు తమ పేర్లు సరి చూసుకోవాలని సూచించారు. కార్యక్రమం లో గ్రామ వ్యవసాయ సహాయకులు శేషయ్య, ఖాజాబీ ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ శేషారావు తదితరులు పాల్గొన్నారు.

## అపరాల పంటలలో కలుపు యాజమాన్య పద్ధతులపై అవగాహన



**హనుమంతునిపాడు, నవంబర్ 4, (ప్రభాతవార్త)**
మండల పరిధిలోని హనుమంతునిపాడు, ఆవులవారిపల్లి గ్రామాలలో మంగళవారం వ్యవసాయశాఖ అధికారి వి.రవి కుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పొలాలలో క్షేత్ర పరిశీలన నిర్వహించి రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మొంథా తుఫాన్ ప్రభావంతో అధిక వర్షాలకు లోనైన అపరాల పంట పొలాలలో తేమ శాతం ఎక్కువగా ఉండటం వలన మొక్కలు భూమిలో నుండి పోషకాలను సంగ్రహించే శక్తి కోల్పోయి పసుపు రంగులోకి మారి చనిపోయే అవకాశం ఉంటుందని కాబట్టి మొక్కలకు పిచికారి రూపంలో పోషకాలను అందించాలని తెలిపారు. ఇందుకోసం ఒక లీటరు నీటికి 10 గ్రాములు 19:19:19 లేదా 10 గ్రాముల పొటాషియం నైట్రేట్ (13-0-45)తో పాటు 3 గ్రాముల అన్నభేది అలాగే అర గ్రాము నిమ్మ ఉప్పు చొప్పున కలిపి మొక్కలపై పిచికారి చేసుకున్నట్లయితే పంటలను కాపాడుకోవచ్చని తెలిపారు.అలాగే అధిక వర్షాల సమయంలో కలుపు సమస్య ఎక్కువగా ఉంటుంది కాబట్టి కంది వంటి పంటలలో అంతర కృషిచేసి కలుపును నిర్మూలించుకోవాలని తెలిపారు.ఒక వేళ అంతరకృషి సాధ్యపడని పరిస్థితులలో కంది,మినుము పంటలలో సూచించిన కలుపు నివారణ మందులు అయినటువంటి క్విజలోఫాప్ ఇథైల్ 5శాతం(టర్గా సూపర్) 400 మిల్లీ లీటర్లు ఒక ఎకరాకు లేదా ఫెనాక్స్ ప్రాప్ ఇథైల్ 9శాతం(విప్ సూపర్) 250 మిల్లీ లీటర్లు ఒక ఎకరాకు చొప్పున 200 లీటర్ల నీటితో కలిపి పిచికారి చేసుకున్నట్లయితే సన్న ఆకు కలుపును నివారించుకోవచ్చని తెలిపారు.అలాగే వెడల్పాకు గడ్డి ఉన్నప్పుడు ఒక ఎకరాకు 200 మిల్లీ లీటర్ల ఇమజితపైర్(పర్స్యూట్) మందును నీటితో కలిపి పిచికారి చేసుకున్నట్లయితే కలుపును సమర్ధవంతంగా నిర్మూలించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఉడుముల సుబ్బారెడ్డి, స్థానిక నాయకులు గంట శ్రీనివాసరెడ్డి, తాతిరెడ్డి వీరనారాయణరెడ్డి, కూడలి దశరథ, ఆవుల బాలకాశిరెడ్డి, వ్యవసాయ సహాయకులు కొండ నవ్య, రైతులు పాల్గొన్నారు.

## ఆరె శ్యామలకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వెలుగోటి



**హనుమంతునిపాడు, నవంబర్ 4, (ప్రభాతవార్త)**
వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరె శ్యామల జన్మదిన వేడుకలు సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో వైఎస్సార్‌సీపీ యూత్ నాయకులు వెలుగోటి నరేంద్రరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ పోటీల్లో విజేతలుగా చిలకపాడు, హనుమంతరావు హైస్కూల్ విద్యార్థులు



**సంతనూతలపాడు, నవంబర్ 4, (ప్రభాతవార్త)**
సంతనూతలపాడు హైస్కూల్లో మంగళవారం నాడు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు, హైస్కూల్ విద్యార్థులకు మండల స్థాయిలో చెకుముకి టాలెంట్ టెస్ట్ పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ హైస్కూల్ విభాగంలో చిలకపాడు హైస్కూల్ టీం, ప్రైవేటు హైస్కూల్ విభాగంలో గంగవరం హనుమంతరావు హైస్కూల్ టీం ప్రథమ స్థానంలో నిలిచారు. వీరంతా ఈనెల 23వ తేదీన జిల్లా స్థాయిలో జరిగే చెకుముకి టాలెంట్ టెస్ట్ పోటీల్లో పాల్గొంటారు.విజేతలైన చిలకపాడు హైస్కూల్ విద్యార్థులు, గంగవరం హనుమంతరావు హైస్కూల్ హెచ్ఎం ఎం.ప్రమోద బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లానాయకులు మాస్టర్‌కోదాటికోటేశ్వరరావు,నల్లూరి వెంకటనరసింహం,ఉపాధ్యాయులు బి.రామాచారి, సుబ్బారావు, సింగయ్య, మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## శివాలయంలో నేడు ఘనంగా జరగనున్న జ్వాలా తోరణం వేడుకలు



**సంతనూతలపాడు, నవంబర్ 4, (ప్రభాతవార్త)**
సంతనూతలపాడులోని గంగా పార్వతీ సమేత త్రిపురాంతకస్వామి వారి ఆలయంలో ఈనెల 5వ తేదీన ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు జరగనున్నాయి. బుధవారం సాయంత్రం 6 గంటలకు ఆలయం ఎంట్రన్స్ నందు ప్రతి ఏడాది లాగా ఈ ఏడాది కూడా వైభవంగా జ్వాలాతోరణం వేడుకలు నిర్వహించేందుకు సిద్ధం చేశారు. ఈ సందర్భంగా దాత, ఆర్యవైశ్య నాయకులు, గ్రందె సంజీవరావు ఆధ్వర్యంలో వేలాది మందికి ప్రతి ఏడాదిలో భాగంగా ఈ ఏడాది కూడా ప్రసాదాలను పంపిణీ చేయనున్నారు. ఎండోమెంట్ ఈవో ఎన్.నారాయణరెడ్డి,ఆలయ చైర్మన్ శిఘాకొల్లి ఉమామహేశ్వరరావు, కమిటీ సభ్యులు, దాతలు ఈ వేడుకలను పర్యవేక్షిస్తున్నారు. ఈనెల 18వ తేదీన సంతనూతలపాడులోని శివాలయంలో మాస శివరాత్రి పురష్కరించుకొని సామూహిక కుంకుమ పూజలు, వేలాది మందికి అన్నదాన వేడుకలను నిర్వహిస్తున్నారు. ఆలయ అర్చకులు ఎస్.బుజ్జిబాబు శర్మ ఆధ్వర్యంలో స్వామివార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి.

## ముక్తాపురంలో ఘనంగా ఆర్మీజవాన్ అంత్యక్రియలు



**కొమరోలు, నవంబరు 4 ,(ప్రభాతవార్త)**
మండలంలోని ముక్తాపురం గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ హవల్దార్ బొంత భూతేశ్వరుడు అత్యక్రియలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. బొంత భూతేశ్వరుడు రాజస్థాన్లోని ఆర్మీలో హవాల్దారుగా పనిచేస్తూ ఉన్నారు. జనవరికి అతను పదవి విరమణ చేయబోతుండగా అంతలోనే గుండె జబ్బుతో ఈ నెల 1వ తేదీ సాయంత్రం మృతి చెందారు. మృతుడు ఆర్మీ జవాన్ గత 25 సంవత్సరాల క్రితం విధుల్లో చేరారు. వీరికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.విషయం తెలుసుకున్న కొమరోలు ఎస్సై నాగరాజు ముక్తాపురంలో పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలతో ఘన నివాళులర్పించారు.

## రోటరీ క్లబ్ఆఫ్ సింగరకొండ అద్దంకి ఆధ్వర్యంలో భారత మహిళా క్రికెట్ జట్టుకు అభినందనలు



**అద్దంకి , నవంబరు 4, (ప్రభాతవార్త)**
రోటరీ క్లబ్ఆఫ్ సింగర కొండ అద్దంకి ఆధ్వర్యంలో, భారత మహిళా క్రికెట్ జట్టు ప్రథమంగా ప్రపంచకప్‌ను గెలిచిన సందర్భంగా మహిళా జట్టుకు అభినందనలు తెలుపుతూ రోటరీ క్లబ్ వారు గోపాలరావు వీధిలోని రోటరీ కార్యాలయం నుండి పాత బస్టాండు పొట్టి శ్రీరాములు బొమ్మ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు బాచిన శివధర పూర్ణచంద్రరావు మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానంగా అన్నింట ఉద్యోగాలు క్రికెట్ ఆటలు వ్యాపారాలు అన్నిటిలో ముందంజలో ఉన్నారు అని పేర్కొన్నారు. సెక్రటరీ అళహరి హరిప్రసాద్ మాట్లాడుతూ మహిళా క్రికెట్ జట్టుకు అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలోఅధ్యక్ష, కార్యదర్సులు, సీనియర్ రోటీరియన్స్ డాక్టర్ ఉబ్బా దేవ పాలన, అద్దంకి లేని ప్రసాద్, చప్పిడి వీరయ్య, పసుపులేటి ఆంజనేయులు,మహమ్మద్ రఫీ , ఈ టి ఎల్ శ్రీనివాసాయ, గూడా లక్ష్మీ రెడ్డి,చిన్ని కామేశ్వరరావు, తమ్మన శ్రీనివాసరావు,శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## పేర్నమిట్ట రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో ఘనంగా కార్తీక మాస వేడుకలు



**సంతనూతలపాడు, నవంబర్ 4, (ప్రభాతవార్త)**
సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట గ్రామంలో గల గంగా పార్వతీ సమేతా రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో ఘనంగా కార్తీకమాస వేడుకలు జరుగుతున్నాయి. అక్టోబర్ 22వ తేదీన ప్రారంభమైన ఈ వేడుకలు ఈ నెల 20వ తేదీ వరకు జరుగుతున్నాయి. ఎండోమెంట్, దాతలు ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి.ఈ నెల 5న కార్తీక పౌర్ణమి పురష్కరించుకుని పలు కేంద్రాల నుంచి భక్తులు మహిళలు, వేలాదిగా తరలివస్తారు. ఎండోమెంట్ ఈవో ప్రసన్నలక్ష్మి ఈ వేడుకలను పర్యవేక్షిస్తున్నారు.ఆలయ అర్చకులు సోమరాజుపల్లి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

## పుట్టపర్తి సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాలు



**అద్దంకి , నవంబరు 4 , (ప్రభాతవార్త)**
పుట్టపర్తి శ్రీ సత్య సాయి బాబా వారి శత జయంతి ఉత్సవాల సందర్భంగా, అద్దంకి పుట్టపర్తి సాయి మందిరం వారి ఆధ్వర్యంలో, మంగళవారం సివి స్ట్రీట్,(సత్రం బడి), కట్టకిందపాలెంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలలో ఉచిత దంత వైద్యశిబిరాలు నిర్వహించినారు. ఈ శిబిరంలో వారాహి దంతవైద్య శాల డాక్టర్స్ చెన్నుపల్లి భావనా ప్రియ దర్శిని, యామిని కృష్ణ ప్రియాంక పాల్గొని మొత్తం 106 మంది విద్యార్థులకు దంత పరీక్షలు చేసి అవసరమైన సూచనలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. శ్యాం, సివి సుబ్బారావు, ఎంఇఒ 2 కెవి శ్రీనివాసరావు, సాయి సేవాదళ్ కన్వీనర్ చిన్ని శ్రీహరి, సభ్యులు చిన్ని ఉమాదేవి, ఎండి అంజాద్ భాష, చప్పిడి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## తిమ్మాయిపాలెం పాఠశాలలో బీర్సా ముండా 151 జయంతి వేడుకలు



**అద్దంకి, నవంబరు 4 ,(ప్రభాతవార్త)**
మండలంలోని తిమ్మాయిపాలెం గ్రామంలో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం వారి ఆదేశాల మేరకు బీర్సా ముండా 151 జయంతి వేడుకల్లో భాగంగా ప్రభుత్వం వారు 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జిల్లాలోని అన్ని పాఠశాలలో జన జాతీయ గౌరవం పఖ్వారా అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. గంగాధర్ గారు మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో అడవి బిడ్డల హక్కుల కోసం, ఆత్మగౌరవం కోసం పోరాడిన మహాయోధుడు, భగవాన్ బీర్సా ముండా గారు ఆయన కేవలం 25 ఏళ్లకే అమరుడైనా, ఆయన రగిలించిన పోరాట స్ఫూర్తి ఈనాటికీ సజీవంగా వుందన్నారు. ఆయన జీవితంలోని కొన్ని ముఖ్యమైన విశేషాలు: "ధర్తీ ఆబా" (భూపిత) ఆయనను గిరిజన ప్రజలు ముద్దుగా "ధర్తీ ఆబా" అని పిలుచుకుంటారు, అంటే "భూమికి తండ్రి" అని అర్థం. తమ భూమిని, సంస్కృతిని కాపాడటానికి వచ్చిన దైవ స్వరూపంగా ఆయన్ని భావించేవారు. "జల్, జంగల్, జమీన్" (నీరు, అడవి, భూమి)పై గిరిజనులకే హక్కు ఉందని ఆయన గర్జించారు.అని విద్యార్థులకు ఆయన గూర్చి చెప్పడం జరిగినది.ఈ కార్యక్రమం లో సిఆర్‌పి విద్యార్థులు ఒకేషన్నల్ టీచర్స్ పాల్గొన్నారు.

# క్రేన్ - మోటార్ సైకిల్ ఢీ

**- ఒకరు మృతి, ఇరువురికి గాయాలు**

**అద్దంకి, నవంబరు 4, (ప్రభాతవార్త)**
చెరువుకొమ్ముపాలెం గ్రామానికి చెందిన కంకణాల వీరాంజనేయులు (35) తన భార్య రేబికా కుమారి (30) , పిన్నమ్మ కంకణాల అరుణతో కలిసి మోటార్‌సైకిల్ పై పొగాకు పొలాలకు వెళ్తున్నారు. ఉదయం 10 గంటలకు అద్దంకి నుండి రేణంగివరం వెళ్ళు రోడ్ లో వెనుక నుండి వేగంగా వస్తున్న క్రేన్ బైక్‌ను ఢీకొట్టింది. ముగ్గురూ రోడ్డుపై పడిపోగా, రేబికా కుమారికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని స్థానికులు అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ డాక్టర్ రేబికా కుమారి మృతిచెందినట్లు తెలిపారు. అరుణ, వీరాంజనేయులు కు గాయాలు అయ్యాయి. మెరుగైన చికిత్స కోసం ఒంగోలు రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై అద్దంకి పోలీస్ కేసు నమోదు చేసి, పిఎస్ఐ వెంకటేశ్వర రెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

## చెకుముకి పోటీల్లో జిల్లాకు ఎంపికైన విద్యార్థులు



**కొమరోలు, నవంబర్ 4 (ప్రభాతవార్త)**
మండల స్థాయి చెకుముకి పోటీల్లో స్థానిక ఎస్బిఐ పాఠశాల ప్రతిభ చాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఈఓ కావడి వెంకటేశ్వర్లు బుర్ర పరీక్షలవెంకటరత్నములు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. పరీక్షల అనంతరం మండల స్థాయి విజయతలను ప్రకటించారు. మండల పరిధిలో జరిగనటువంటి చెకుముకి సైన్స్ సంబరాలో ఎస్‌బిఎన్‌ఆర్‌ఎం పాఠశాల విద్యార్థులు ప్రథమ ఎం ఛాయా, పి చరణ్, ఎ భావన బృంద, ద్వితీయ స్థాయిలో ఎం సాత్విక్, ఎం హనుమ సుబ్రమణ్యం, కె ఇందులు విజేతలుగా నిలిచారు. ముందుగా కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారులు కావడి వెంకటేశ్వర్లు మరియు బొర్రా వెంకటరత్నం మరియు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె శివ నాగేశ్వర రావు మండల స్థాయి చెకుముకి ప్రశ్నాపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి కె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించు కోవాలన్నారు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంచి శాస్త్రవేత్తలుగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షులు అబ్బూరి అల్లూరయ్య, మండల కార్యదర్శి బి ఈశ్వర్ కుమార్, జెవివి జిల్లా కార్యదర్శి ఎ.విశ్వరూపం, కోశాధికారి ఎం సత్యం, వివిధ పాఠశాలల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### సబ్సిడీపై శనగ, మినుము విత్తనాల సరఫరాను రైతులు సద్వినియోగ పరుచుకోవాలి

**- మండల వ్యవసాయాధికారిణి పావని**



**సంతనూతలపాడు, నవంబర్ 4, (ప్రభాతవార్త)**
ప్రభుత్వం సబ్సిడీపై శనగ, మినుము విత్తనాలను సరఫరా చేస్తున్నట్లు రైతులు దీనిని సద్వినియోగపరుచుకోవాలని సంతనూతలపాడు మండల వ్యవసాయాధికారిణి పి.పావని కోరారు. సంతనూతలపాడు మండలంలోని గురవారెడ్డి పాలెం, రుద్రవరం గ్రామాలలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయాధికారిణి పావని రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో రాయితీపై శనగలు, మినుములు ఇస్తున్నామని, కావాల్సిన రైతులు గ్రా మవ్యవసాయ సహాయకులను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పేర్కొన్నారు. శనగలు జేజీ-11రకం పూర్తి ధర రూ.78లు, సబ్సిడీ ధర రూ.19.50లు, రైతు చెల్లించాల్సిన ధర రూ.58.50 రూపాయలు, శనగలు(కేఏకే -2రకం) పూర్తి ధర రూ.78లు, సబ్సిడీ ధర రూ.1950లు, రైతు చెల్లించాల్సిన ధర రూ.58.50లు, మినుములు(వీబీఎన్-8రకం) పూర్తి ధర రూ.138లు, సబ్సిడీ ధర రూ.41.40లు, రైతు చెల్లించాల్సిన ధర రూ.96.90లు అని ధరల వివరాలను ఏవో పావని తెలిపారు. పొలాలు కౌలుకు తీసుకొని సాగు చేసుకుంటున్న కౌలు రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారుల్ని సంప్రదించి తప్పనిసరిగా సీసీఆర్సీ కార్డులు(కౌలు కార్డులు) తీసుకున్నట్లయితే వ్యవసాయశాఖలో అమలవుతున్న పథకాలకు కౌలు రైతులు కూడా అర్హులు అవుతారని తెలిపారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటల వివరాలను రైతులు రైతు సేవా కేంద్రాలలోని గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కేవీ సుబ్బారెడ్డి, గురవారెడ్డిపాలెం, రుద్రవరం గ్రామాల గ్రామ వ్యవసాయ సహాయకులు డి.సాయి కృష్ణ, వి.బాలసుబ్రహ్మణ్యం, పశుసంవర్ధక సహాయకులు ఎస్‌కే రెహానా,ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

### భారీ వర్ష ఎస్టీ కాలనీ బాధితులకు దాత శేషయ్య ఆధ్వర్యంలో

## నిత్యవసర వస్తువులు పంపిణీ

**సంతనూతలపాడు, నవంబర్ 4, (ప్రభాతవార్త)**
తుఫాన్ వల్ల కురిసిన భారీ వర్షాలకు ఇబ్బందులు పడిన సంతనూతలపాడు మండలం కామేపల్లి వారిపాలెం ఎస్టీ కాలనీ బాధితులకు మంగమూరు గ్రామానికి చెందిన ముప్పరాజు శేషయ్య, పద్మావతి దంపతులు నిత్యవసూర వస్తువులను పంపిణీ చేశారు. 43 మంది ఎస్టీ కాలనీ బాధితులు ఒక్కొక్కరికి 10 కిలోల బియ్యం,కిలో కందిపప్పు, లీటర్ పామాయిల్, పావు కిలో చింతపండు తదితర నిత్యవసర వస్తువులను దాత శేషయ్య, పద్మావతి దంపతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంగమూరు ఎన్ఎస్పీ నీటి సంఘం అధ్యక్షులు, టీడీపీ నాయకులు అబ్బూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## తుఫాన్ అనంతరం శనగ పంట సాగు చేయండి



**కొమరోలు, నవంబర్ 4(ప్రభాతవార్త)**
మండలంలో శనగ పంట వేసేందుకు రైతులు ఈనెల 4,5 తేదీల్లో తుఫాను ఉన్న నేపథ్యంలో తుఫాను అనంతరం శనగ పంట సాగు చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రాజశ్రీ తెలిపారు. మండలంలోని రాజుపాలెం, ఎడమకల్లు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో మండల వ్యవసాయాధికారి కె. రాజశ్రీ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ మరియు అనుబంధ శాఖలైన ఉద్యాన, పశుసంవర్ధక, మైక్రో ఇరిగేషన్ శాఖల ద్వారా అందిస్తున్న సేవలు మరియు పథకాలను గ్రామస్థాయిలో వివరించుట మరియు రైతుల సమస్యలను తెలుసుకొని వాటికి పరిష్కార మార్గాలు తెలియజేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని మండల వ్యవసాయ అధికారి తెలియజేశారు. ఈనెల 4,5 తేదీలలో తుఫాన్ హెచ్చరిక ఉన్న కారణాన్ని గుర్తించి, వాతావరణం అనుకూలించిన తర్వాత శనగ పంట వేయాలని రైతులకు తెలియజేశారు. శనగ పంటలో ఎండు తెగులు నివారించేందుకు తప్పనిసరిగా ట్రైకోడెర్మా విరిడితో విత్తన శుద్ధి చేయాలని తెలిపారు. పొగాకు కు ప్రత్యామ్నాయ పంటల గురించి తెలియజేసి, ఎవరు కూడా నల్ల బర్లీ పొగాకు సాగు చేయరాదని తెలిపారు.కార్యక్రమంలో గ్రామవ్యవసాయ సహాయకులు వెంకటేశ్వర్లు,సులేమాన్ రైతులు పాల్గొన్నారు.

Main tab page 6_Main tab page 6.qxd 11/4/2025 11:27 PM Page 1



## కనిగిరి శివాలయంలో శుభ్రతా కార్యక్రమం

**కనిగిరి, నవంబర్ 4, ప్రభాతవార్త**



కనిగిరి పట్టణంలోని రామాలయం సమీపంలో ఉన్న పురాతన ప్రసిద్ది గాంచిన శివాలయంలో మంగళవారం శుభ్రతా కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ కమీషనర్ పిల్లి కృష్ణమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది ఆలయం పరిసరాల్లో శానిటేషన్ పనులు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో సున్నం, బ్లీచింగ్ పొడి వేయించి పరిశుభ్రత చర్యలు చేపట్టారు. కార్యక్రమాన్ని కనిగిరి మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ నాయబ్ రసూల్ పర్యవేక్షించారు. పట్టణంలో పవిత్ర క్షేత్రాలు, దేవాలయాల పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు మున్సిపాలిటీ ప్రత్యేక దృష్టి సారించినట్లు అధికారులు తెలిపారు.

## కనిగిరి టౌన్‌లో బుధవారం విద్యుత్ అంతరాయం

**కనిగిరి, నవంబర్ 4, ప్రభాతవార్త**



కనిగిరి పట్టణంలోని టౌన్-1, టౌన్ -3 ఫీడర్లకు సంబంధించి లైను మరమ్మత్తులు, విద్యుత్ పరివర్తకముల సెట్టింగ్ వర్కుల కారణంగా బుధవారం ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది. ఈ సమయంలో కందుకూరు రోడ్డు, చెప్పుల బజార్, నక్కల తిప్ప, గార్లపేట బస్టాండ్, రామయ్య నాయుడు హాస్పిటల్, ఎండీఓ ఆఫీస్, ఇందిరా కాలనీ, ఎన్జీవో కాలనీ, సాయిబాబా మందిరం పరిసరాలు వంటి ప్రాంతాలలో విద్యుత్ అందుబాటులో ఉండదు. విద్యుత్ అధికారి పవన్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ మరమ్మతు పనులకు సహకరించాలని, ముందస్తుగా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## ఆపదలో ప్రాణదాతగా రహంతుల్లా - రక్తదానంతో మహిళకు ప్రాణదానం

**కనిగిరి, నవంబర్ 4, ప్రభాతవార్త**



ఆపద సమయంలో రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని మరోసారి నిరూపితమైంది. ఒంగోలు వెంకటరమణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మహిళకు ఆపరేషన్ నిమిత్తం అత్యవసరంగా ఏ పాజిటివ్ రక్తం అవసరమైంది. ఈ సమాచారం స్నేహహస్తం చారిటబుల్ ట్రస్టు ద్వారా అందగానే, సేవాభావంతో ముందుకు వచ్చిన సేవా సైనికుడు రహంతుల్లా వెంటనే స్పందించి రక్తదానం చేశారు. అతని తక్షణ చర్యతో మహిళ ప్రాణాలు రక్షించబడ్డాయి. రక్తదాన ఆవశ్యకతను ప్రజలకు తెలియజేస్తూ నిరంతరం సేవలందిస్తున్న స్నేహహస్తం మిత్రులు అభినందనీయులు. ఆపదలో ఉన్న వారికి జీవం అందించి ప్రాణదాతగా నిలిచిన రహంతుల్లా సేవా స్ఫూర్తి ప్రశంసనీయం. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ సుధీర్ మాట్లాడుతూ చిరునవ్వుతో రక్తదానం చేస్తే ఆపదలో ఉన్న వారికి జీవం పోస్తాం. వారి కుటుంబాలకు ఆనందాన్ని అందిస్తాం. ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం ఎంత గొప్పదో, రక్తదానం చేయడం అంతకంటే గొప్పది అన్నారు. రక్తదానం మానవతా ధర్మమని, ప్రతి ఒక్కరూ అవసరమైనప్పుడు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

## కార్తీక పౌర్ణమి వేళ శివాలయాల భద్రతా ఏర్పాట్లు

### - భక్తులు నిబంధనలు పాటించాలి - సీఐ ఖాజావలి

**కనిగిరి, నవంబర్ 4, ప్రభాతవార్త**



కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా కనిగిరి పట్టణంలోని శివాలయాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం నేపథ్యంలో పోలీసులు ముందస్తు భద్రతా చర్యలను చేపట్టారు. మంగళవారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షేక్ ఖాజావలి, ఎస్సై టి.శ్రీరామ్ నేతృత్వంలో పోలీసులు పట్టణంలోని ప్రధాన శివాలయాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఆలయ ప్రాంగణం, పార్కింగ్ స్థలాలు, లైటింగ్ సదుపాయాలు, గుంపు నియంత్రణ చర్యలను పరిశీలించి సంబంధిత సిబ్బందికి సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ ఖాజావలి మాట్లాడుతూ కార్తీక మాస పవిత్రత దృష్ట్యా ఈనెల 5న జరగనున్న కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు, డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ ఆదేశాల మేరకు శివాలయాలు, నదులు, చెరువులు వంటి భక్తుల రద్దీ ప్రాంతాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పుణ్యస్నానాలు, పూజా కార్యక్రమాల సందర్భంగా భక్తులు తప్పనిసరిగా పోలీసు నిబంధనలు పాటించాలన్నారు. ఆలయ కమిటీ సభ్యులు క్యూలైన్లను ఏర్పాటు చేసి తొక్కిసలాటలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భక్తులు దీపాలు వెలిగించే సమయంలో ఇతర వస్తువులు లేదా వ్యక్తులకు అంటుకోకుండా అగ్ని ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని హెచ్చరించారు. పిల్లలు, వృద్దుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కనిగిరి సర్కిల్ పరిధిలో తుఫాన్ ప్రభావం వల్ల వాగులు, చెరువులు నిండిపోయినందున, పుణ్య స్నానాల సమయంలో లోతైన ప్రాంతాలకు వెళ్లరాదని భక్తులకు హెచ్చరిక జారీ చేశారు. కార్తీక పౌర్ణమితో పాటు రానున్న మరిన్ని రెండు కార్తీక సోమవారాలు కూడా ఈ జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా సురక్షితంగా ప్రశాంతంగా పూజా కార్యక్రమాలు జరుపుకునేందుకు పోలీసు శాఖ పూర్తి ఏర్పాట్లు చేసినట్లు సీఐ ఖాజావలి తెలిపారు. ప్రజలు పోలీసులు, ఆలయ సిబ్బందితో సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఆర్థిక సహాయం అందజేసిన ముస్లిం మైనార్టీ నాయకులు

### - ఇస్లాం అంటేనే పరోపకారం

**పామూరు, నవంబర్ 4, ప్రభాతవార్త**



పామూరు సీఎస్‌పురం రోడ్డు నందు నివాసం ఉంటున్న సయ్యద్ బాదుల్లా లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న సమాచారం తెలుసుకొని బాదుల్లాకు హాస్పిటల్ వైద్య ఖర్చుల నిమిత్తం వారి కుటుంబానికి రూ.12,500 లు ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ గౌస్, మండల ముస్లిం మైనార్టీ నాయకులు కావేరి రసూల్, టౌన్ మైనార్టీ నాయకులు మోబినా మౌలాలి, కోడిగుంపల నాయబ్ రసూల్, సలాం షేక్ ఖాజా మొహిద్దిన్, పఠాన్ ఖాజావలి, షేక్ హుస్సేన్, షకీబ్, నసీర్, టీడీపీ మహిళా నాయకురాలు సయ్యద్ రజియా, బాదుల్లాబీ పాల్గొన్నారు.

## ఎన్నో ఏళ్ల శ్రమకు ఫలితం దక్కింది

### - టీడీపీ మహిళా నాయకురాలు రజియా సయ్యద్

**పామూరు, నవంబర్ 4, ప్రభాతవార్త**



దశాబ్దాలుగా చూస్తున్న ఎదురుచూపులకు భారత మహిళా క్రికెట్ జట్టు అందించిన విజయానికి భారత మహిళాగా హృదయపూర్వక అభినందనలు తెలిపిన తెలుగుదేశం పార్టీ నాయకురాలు రజియా సయ్యద్. మహిళా క్రికెట్ వరల్డ్ కప్‌లో 7 సార్లు ఛాంపియన్‌గా నిలిచిన కంగారులను, మట్టి కరిపించి ఫైనల్‌కు చేరుకున్న మన ఆడ బిడ్డలు తది సమరంలో దక్షిణాఫ్రికాను కూడా ఓడించి కప్‌ని గెలవడం భారతదేశానికి గర్వకారణమని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. మహిళల వన్డే వరల్డ్ కప్ అద్భుతమైన ఆల్ రౌండ్ ప్రదర్శనతో సమిష్టిగా రానిచ్చి ఫైనల్‌లో గొప్ప విజయానికి కైవసం చేసుకుని చరిత్ర సృష్టించిన భారత మహిళా క్రికెట్ జట్టుకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ ప్రదర్శన చూసి ప్రపంచమంతా పులకించిపోయారు. ప్రపంచానికి భారత మహిళా శక్తి ఏమిటో చాటిచెప్పిన శుభ సందర్భం దేశ మహిళా క్రికెట్ రాబోయే రోజుల్లో మేలి మలుపు తిరగడానికి ఈ అద్భుతం విజయం పని చేస్తుంది. రాబోయే రోజుల్లో ఈ విజయం పరంపర కొనసాగాలని కోరుకుంటూ హార్మన్ ప్రీత్ కౌర్‌కు జట్టు సభ్యులకు నా అభినందనలు తెలియజేస్తున్నానని రజియా సయ్యద్ అన్నారు.

## వైద్యకళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం: దద్దాల

**కనిగిరి, నవంబర్ 4, ప్రభాతవార్త**



కూటమి ప్రభుత్వం తలపెట్టిన ప్రభుత్వ వైద్యశాలల ప్రైవేటీకరణను అడ్డుకుని తీరుతామని కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ హెచ్చరించారు. మంగళవారం కనిగిరి మండలం వంగపాడు పంచాయతీ ఎగువపల్లి గ్రామంలో రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజల సంతకాలు సేకరణ చేశారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ అర్హులైన పేద, మధ్య తరగతి విద్యార్థుల కోసం జగన్ ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులను ఏర్పాటు చేసింది. కానీ ఈ కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటీకరించే ప్రయత్నం దారుణం. వైద్యాన్ని ప్రైవేటు చేతుల్లోకి అప్పగిస్తే పేద రోగులకు ఉచిత వైద్యం ఎలా అందుతుంది అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం తక్షణం పీపీపీ విధానాన్ని విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక విధానాల ద్వారా కొద్ది మంది నాయకులకు లాభం చేకూర్చే ప్రయత్నాలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. కోటి సంతకాల సేకరణకు నియోజకవర్గ ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, కటికల వెంకటరత్నం, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, రావులపల్లి తిరుపతయ్య, నరాల వెంకటరెడ్డి, పాశం కొండయ్య, పోలాక రమణారెడ్డి, మార్తాల వెంకటేశ్వరరెడ్డి, ద్వారశిల శేశిరెడ్డి, పోలాక శ్రీకాంత్‌రెడ్డి, ఉడుముల మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చెకుముకి మండల స్థాయిలో ప్రతిభ కనపరిచిన కిజిజి విద్యార్థులు

**దర్శి, నవంబర్ 4, ప్రభాతవార్త**



పొదిలిలో జడ్పీహెచ్‌ఎస్ గర్ల్స్ హైస్కూల్ నందు జరిగిన చెకుముకి మండల స్థాయి పోటీలలో దర్శి మండలం ప్రైవేటు పాఠశాల విభాగంలో కిజిజి హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం పొందారు. డి.జోష్న, చిరుమానేశ్వర్, బి.హర్షిణిలు జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కాబడ్డారు. ఈ సందర్భంగా దర్శి మండల జేవీవీ అధ్యక్షులు కేవీ రమణారెడ్డి, పాఠశాల హెచ్ఎం ఆంథోని, సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు వారికి అభినందనలు తెలియజేశారు.

## ఆధార్ అనేబుల్ ఏజెంట్లు జాగ్రత్తలు పాటించాలి

### - ఏజెంట్ల అవగాహన సదస్సులో డీఎస్పీ లక్ష్మీనారాయణ

**దర్శి, నవంబర్ 4, ప్రభాతవార్త**



దర్శి సబ్ డివిజన్ పరిధిలోని రివకరీ ఏజెంట్స్, ఆధార్ అనేబుల్ పేమెంట్ సిస్టం నిర్వహించే వారికి దర్శిలోని పీజీఎన్ కాంప్లెక్స్ నందు మంగళవారం దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా వీరు ఏమి చేయాలి ఏమి చేయకూడదు అనే విషయాలను గురించి క్షుణ్ణంగా దర్శి డీఎస్పీకి తెలియజేయడం జరిగింది. ఈ సమావేశానికి దర్శి సబ్ డివిజన్ నుండి సుమారు 300 మంది పాల్గొనగా దర్శి సీఐ వై.రామారావు, పొదిలి సీఐ, త్రిపురాంతకం సీఐ తదితరులు పాల్గొన్నారు.

## మాక్ అసెంబ్లీకి మారెళ్ళ విద్యార్థిని

**ముండ్లమూరు, నవంబర్ 4, ప్రభాతవార్త**



రాజ్యాంగ దినోత్సవం నేపథ్యంలో నియోజకవర్గ స్థాయి వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు సోమవారం దర్శి జడ్పీ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించారు. ఇందులో మారెళ్ళ జడ్పీహెచ్‌ఎస్ స్కూల్ విద్యార్థినీ కే.శ్రావణ్ సాయి ప్రతిభ చాటి విజేతగా నిలిచింది. ఈనెల 24 నుంచి 26 వరకు రాజధాని అమరావతిలో సీఎం చంద్రబాబునాయుడు సమక్షంలో నిర్వహించే మాక్ అసెంబ్లీ లో పాల్గొనేందుకు ఆమె అర్హత పొందినట్లు హెచ్ఎం కే.శ్రీనివాసరావు, ఎస్ఎంసీ చైర్మన్ యల్లయ్య, జి.కోటేశ్వరరావు, రామకృష్ణ, జి.అనురాధ, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

## పులిపాడు, ఉల్లగల్లులో పొలం పిలుస్తోంది

**ముండ్లమూరు, నవంబర్ 4, ప్రభాతవార్త**



మండలంలోని పులిపాడు, పెద్ద ఉల్లగల్లు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఏ.తిరుమలరావు మాట్లాడుతూ రైతులందరూ వేసిన ప్రతి పంటకు ఈ పంట ద్వారా పంట నమోదు చేయించుకోవాలని తెలియజేశారు. ఈ పంట నమోదుకి ఆఖరు తేదీ ఈనెల 8వ తేదీ అని, రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హులైన కౌలు రైతులందరూ సంబంధిత వీఆర్వోని కలిసి కౌలు కార్డులు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు విజయ నిర్మల, క్రాంతి రత్న, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## సీఐటీయు జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

**ముండ్లమూరు, నవంబర్ 4, ప్రభాతవార్త**



సీఐటీయు కార్మిక ఉద్యోగ ప్రజల పక్షాన నిలబడి పోరాడుతున్న సీఐటీయు ప్రకాశం జిల్లా 13వ మహాసభలు జయప్రదం చేయాలని ముండ్లమూరు పీహెచ్‌సీలో సీఐటీయు నాయకులు బి.హనుమంతరావు, వెల్లంపల్లి ఆంజనేయులు ప్రచారం చేశారు. వీధి వ్యాపారులు ఇతర సంఘటితంగా కార్మికుల సంక్షేమానికి సమగ్ర చట్టం కోసం పోరాడుతుంది, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, స్కీం వర్కర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, 12వ పీఆర్సీ కమీషన్ వేయాలని ఐఆర్ ప్రకటించాలని డీఏలు పెండింగ్ బకాయిలు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతుంది.

## స్వదేశీ వస్తువు వినియోగం గురించి బీజేపీ అవగాహన

**ముండ్లమూరు, నవంబర్ 4, ప్రభాతవార్త**



మండల ప్రవాస యోజన పర్యటనలో భాగంగా స్వదేశీ వస్తువు వినియోగం గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశానుసారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు సీవీఎన్ మాధవ్ జిల్లా అధ్యక్షులు సీహెచ్ శ్రీనివాసరావు సారధ్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమంలో ముండ్లమూరు మండలం బసాపురం గ్రామంలో పర్యటించి అవగాహన కల్పించడం జరిగింది. జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు తిండి నారాయణరెడ్డి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్న శ్రీనివాసరావు, ముండ్లమూరు మండల బీజేపీ అధ్యక్షుడు మందలపు వెంకట శేషయ్య, కూటమి నాయకులు సందర్ సుబ్బారావు, డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ ఈ కార్యక్రమానికి పాల్గొనడం జరిగింది.

## అధికారులు సమన్వయంతో పనిచేయాలి: ఎమ్మెల్యే ఉగ్ర

**కనిగిరి, నవంబర్ 4, ప్రభాతవార్త**



కనిగిరి నియోజకవర్గంలో వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మంగళవారం అమరావతి మైదానంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కారమయ్యే విధంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా పరిష్కరించగలిగే అర్జీలను ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. చేయలేని అర్జీల విషయంలో ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. మన ప్రాంతం క్షామపీడిత ప్రాంతమని గుర్తు చేసిన ఎమ్మెల్యే, వర్షాకాలంలో పడే వర్షపు నీరు వృధా కాకుండా ఉండేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని, చెరువులపై సమగ్ర నివేదిక రూపొందించి, ఎక్కడా లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్అండ్‌బి, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యాశాఖ, హౌసింగ్, విద్యుత్, ఆర్టీసీ, ఎంపీడీవోలు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.


## టీడీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గయాజ్ భాషాకు ఎమ్మెల్యే ఉగ్ర సన్మానం

**కనిగిరి, నవంబర్ 4, ప్రభాతవార్త**



కనిగిరి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడిగా షేక్ గయాజ్ భాషాను నియమించిన సందర్భంగా మంగళవారం అమరావతి మైదానంలో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ గయాజ్ భాషా తెలుగుదేశం పార్టీకి సేవలందిస్తూ అనేక మంచి కార్యక్రమాలతో పార్టీకి విశేష గుర్తింపు తెచ్చుకున్న నాయకుడు అని పేర్కొన్నారు. ఇటువంటి అనుభవజ్ఞులు పార్టీకి తోడుగా ఉండడం ఎంతో సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ గయాజ్ భాషా మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు, విధానాలు ప్రతి ఇంటికి చేరేలా కృషి చేస్తాను, కనిగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి నేతృత్వంలో అభివృద్ధి వేగంగా జరుగుతోంది. భవిష్యత్తులో మరిన్ని ప్రజా కార్యక్రమాల కోసం ఆయనతో కలిసి పని చేస్తాను అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కనిగిరి టీడీపీ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, గుడిపాటి ఖాదర్, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు వివి మనోహరరావు, తెలుగు యువత అధ్యక్షుడు అచ్చాల రవి, పాతూరు నాగ, నజముద్దిన్, షేక్ జానీ, నారపుశెట్టి నరసయ్య నాయుడు, షేక్ మునీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తీర్ణత శాతాన్ని పెంచడానికి కృషి చేయాలి



**చీరాల, నవంబర్ 4, ప్రభాతవార్త**

2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ ప్రవేశాలు, పరీక్ష ఫీజు ముగిసినందున రాబోయే పరీక్షల సమయంలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచడం కొరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలనుగూర్చి వివరించడం జరిగింది. డిస్ట్రిక్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ జుబేర్ తెలిపారు. మంగలవారం స్థానిక సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే యూనిట్ 3 పరీక్షలు ముగిసినందున రాబోయే రోజులలో విద్యార్థులు మరింత శ్రద్ధతో చదవాలని ఆయన అన్నారు. ఇక్కడ పరీక్షా కేంద్రం మంజూరు చేయాల్సి ఉందని అందులో భాగంగా తరగతి గదులను, ల్యాబ్‌ను పరిశీలించడం కూడా జరిగిందని ఆయన అన్నారు. విద్యార్థుల హాజరు బోధనా సిబ్బంది హాజరు, ల్యాబ్ సౌకర్యాలు, లైబ్రరీ, శుభ్రత పరిస్థితులను పరిశీలించారు. విద్యార్థుల శిక్షణ నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రిన్సిపాల్ కు సూచించారు. తరగతులు క్రమం తప్పకుండా నిర్వహించాలని అన్నారు. విద్యార్థుల హాజరు శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కళాశాల విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యాస పరిస్థితులు, పాఠశాల వాతావరణం, బోధన విధానం గురించి వివరాలు తెలుసుకున్నారు. చివరిగా ఇక్కడి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ తనిఖీలలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి తైక్వాండోలో మెరిసిన లక్ష్మీప్రియ

**వేటపాలెం, నవంబర్ 4, ప్రభాతవార్త**



స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ 69వ అండర్-17 తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీలలో వేటపాలెం బాలికోన్నత పాఠశాల విద్యార్థిని యార్లగడ్డ లక్ష్మీప్రియ 48-52 కేజీల విభాగంలో రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానం కైవసం చేసుకున్నట్లు ప్రధానోపాధ్యాయులు దేవరకొండ సరోజిని తెలియజేశారు. ఈనెల 1వ తేదీ నుండి మూడోవ తేదీ వరకు ఏలూరులో నిర్వహించిన ఈ పోటీలలో తృతీయ స్థానం సాధించి కాంస్య పతాకాన్ని లక్ష్మీ ప్రియ సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల పీడీలు జే.దేవబిక్షం, జే.శ్రావణి, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

## తుఫాన్ బాధిత కుటుంబాలను పరామర్శించిన కరణం వెంకటేష్‌బాబు

**వేటపాలెం, నవంబర్ 4, ప్రభాతవార్త**



చీరాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబు వేటపాలెం మండల పరిధిలోని దేశాయిపేట పంచాయతీ విఘ్నేశ్వర కాలనీలో తుఫాన్ కారణంగా నీట మునిగిన చేనేత మగ్గాలను, గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేష్‌బాబు మాట్లాడుతూ తుఫాన్ కారణంగా రైతన్నలతో పాటు నేతన్నలు కూడా తీవ్రంగా నష్టపోయారని, ఈ కాలనీ వాసులు వర్షపు నీరు గృహాల మధ్యలోనే ఉండడం వల్ల ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని అధికారులు తక్షణమే స్పందించి ఆ నీటిని మోటార్ల సహాయంతో తోడించి శానిటేషన్ చేయాలని పంచాయతీ అధికారులకు సూచనలు చేశారు. అదే విధంగా పందిళ్ళపల్లి గ్రామంలో తుఫాన్ బాధితుల కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కీర్తి వెంకటరావు, కీర్తి రాఘవులు, ప్రకాశం, శివారెడ్డి, శ్రీనివాసరెడ్డి, శ్రీను, వేటపాలెం మండల అధ్యక్షుడు సాదు రాఘవరావు, మహిళా అధ్యక్షురాలు సీతా మహాలక్ష్మీ, ఖాదర్, ఉమామహేశ్వర రావు, రమణారెడ్డి, సుబ్బారావు, వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు. నియోజకవర్గ, మండల పరిధిలోని వైఎస్సార్‌సీపీ వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, తదితర నాయకులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీశ్రీ కాళహస్తీశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే మద్దులూరి

**చీరాల, నవంబర్ 4, ప్రభాతవార్త**



శ్రీశ్రీశ్రీ కాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానాన్ని కుటుంబ సభ్యులతో కలిసి చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి దేవస్థాన చైర్మన్ సాయి ప్రసాద్, శ్రీ కాళహస్తి ధర్మకర్తల మండలి సభ్యులు కొమ్మనబోయిన రజిని, డోలా దిలీప్ కన్నా, టీడీపీ శ్రీ కాళహస్తి టౌన్ అధ్యక్షుడు ఢిల్లీ బాబు పాల్గొన్నారు.

**యువ నాయకులు మహేంద్రనాథ్‌ని సన్మానించిన దేవస్థాన బోర్డు చైర్మన్:**

అదే విధంగా చీరాల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి శ్రీ మద్దూలూరి మహేందర్‌నాథ్‌ని శ్రీ కాళహస్తి దేవస్థానం బోర్డు చైర్మన్ కొట్టేసాయి ప్రకాష్ ఘనంగా సన్మానించారు.

## కబడ్డీలో సత్తా చాటిన విద్యార్థినులు

**నాగులుప్పలపాడు, ప్రభాతవార్త**



మండలంలోని బి.నిడమానూరు హైస్కూల్లో మండల స్థాయి కబడ్డీ పోటీలలో అండర్-14 బాలికల నందు జడ్పీహెచ్‌ఎస్ మాచవరం విద్యార్థులు ప్రథమ స్థానంలో, ఉప్పుగుండూరు విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.

## విద్యార్థుల భవిష్యత్తుకు క్రీడలే మార్గం

**నాగులుప్పలపాడు, నవంబర్ 4, ప్రభాతవార్త**



విద్యార్థుల భవిష్యత్తుకు, క్రమ శిక్షణకు క్రీడలే పునాది రాళ్ళని నాగులుప్పలపాడు మండల విద్యాశాఖాధికారి టి.రవికుమార్ తెలిపారు. మంగళవారం హెచ్‌నిడమానూరు హైస్కూల్ నందు జరిగిన మండల స్థాయి కబడ్డీ పోటీలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎంఈఓ-2 ఈ.రమణయ్య మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని అన్నారు. హెచ్ నిడమానూరు హైస్కూల్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో, స్థానిక పీడీటీ రమాదేవి ఆధ్వర్యంలో అండర్-17, అండర్-14 బాలుర, బాలికల కబడ్డీ ఎంపికలు జరిగాయి. మంగళవారం జరిగిన పోటీలలో అండర్-17, అండర్-14 బాలుర విభాగంలో హెచ్ నిడమానూరు విన్నర్స్‌గా నిలిచింది. బాలికల విభాగంలో అండర్-17 నందు ఉప్పుగుండూరు హైస్కూల్, అండర్-14 నందు మాచవరం హైస్కూల్ విద్యార్థినులు విన్నర్స్‌గా నిలిచారు. స్థానిక హైస్కూల్ స్కౌట్స్ అండ్ గైడ్స్ పలు సేవలందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బి.శివప్రసాద్, నాగులుప్పలపాడు మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ స్థల వివాదం.. రోడ్డెక్కిన ఎస్సీ కాలనీ వాసులు

**టంగుటూరు, నవంబర్ 4, ప్రభాతవార్త**

టంగుటూరు మండలం కాకుటూరివారిపాలెంలో కమ్యూనిటీ స్థల వివాదం మంగళవారం జరిగింది. దీంతో ఎస్సీ కాలనీ వాసులు రోడ్డెక్కారు. కమ్యూనిటీ స్థలంలో ప్రహరి గోడ నిర్మాణంలో తలెత్తిన వివాదం. తమ కమ్యూనిటీ స్థలంలో ప్రహరీ గోడ నిర్మాణాన్ని కార్యదర్శి ఉద్దేశపూర్వకంగానే అడ్డుకుని స్థలాన్ని ఆక్రమించాలని చూస్తున్నారని ఆరోపణ, సమస్య జఠిలం కాకుండా రంగంలోకి దిగి సమస్యాత్మక స్థలాన్ని పరిశీలించినా ఒంగోలు ఆర్డీవో కళావతి, సమస్యలను ఆర్డీవోకు వివరించిన గ్రామస్తులు. సమస్యను పరిష్కరిస్తానని ఆర్డీవో హామీ ఇచ్చారు.

## చీమకుర్తి విద్యార్థి శ్రీనివాస్ ప్రతిభ

**చీమకుర్తి, అక్టోబర్ 4, ప్రభాతవార్త**



రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా జరిగిన నియోజకవర్గస్థాయి పోటీల్లో చీమకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి శ్రీనివాస్ ఉత్తమ ప్రతిభను కనబరిచారు. ఈ పోటీల్లో గెలుపొంది రాష్ట్రస్థాయికి వెళ్లినటువంటి తొమ్మిదవ తరగతి విద్యార్థి నడగల శ్రీనివాసును పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్ వి షణ్ముఖ కుమార్, ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు. మేకింగ్ ఇండియా త్రు వికసిత్ ఆంధ్రప్రదేశ్ అనే అంశం పై ఎలక్యూషన్ పోటీ నందు విజేతగా నిలిచి, భారత రాజ్యాంగం విలువలు అనే అంశం పై క్విజ్ పోటీ లో నియోజకవర్గస్థాయిలో గెలుపొంది రాష్ట్ర స్థాయి కి ఎంపిక కావడం జరిగింది. నోడగల తవితయ్య, లక్ష్మీల కుమారుడు శ్రీనివాస్.

## కనిగిరిలో నేడు శ్రీసాయి కృష్ణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం

**కనిగిరి, నవంబర్ 4, ప్రభాతవార్త**

కనిగిరి పట్టణంలోని పామూరు రోడ్డులో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా ఆధునిక వైద్య సదుపాయాలతో నిర్మించిన శ్రీ సాయి కృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ బుధవారం ఘనంగా ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా డాక్టర్ పెరుగు మురళీకృష్ణ డాక్టర్ యన్నాబత్తిన హరిత దంపతులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత దశాబ్దంగా ప్రజలకు విశ్వసనీయమైన ఆరోగ్య సేవలు అందిస్తూ పేరుపొందిన ఈ ఆసుపత్రి, కొత్త భవనంలో మరింత విస్తృతమైన వైద్య విభాగాలతో ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందించేందుకు సిద్ధమైంది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వైద్యులు, స్నేహితులు, ఆత్మీయులను హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దంపతులు కోరారు.

5-11Pg5 9_5-11Pg5.qxd 04/Nov/25 10:39 PM Page 1





# 'సర్'పై మమత భారీ నిరసన

## ఆందోళనకారులను ముందుండి నడిపించిన ముఖ్యమంత్రి

**కోల్‌కతా, నవంబర్ 4:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్‌లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఆ ఆందోళనకు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నాయకత్వం వహించారు. మంగళవారం కోల్‌కతా వీధుల్లో నిర్వహించిన భారీ ర్యాలీని ముందుండి నడిపించారు. ఈ సమగ్ర సవరణ బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం కుమ్మక్కై నిర్వహిస్తోన్న నిశ్శబ్ద రిగ్గింగ్ అని తృణమూల్ కాంగ్రెస్ ఆరోపించింది. బెనర్జీతో పాటు ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీ కూడా పాల్గొన్నారు. మొత్తం 3.8 కిలోమీటర్ల మేర ఈ మార్చ్ కొనసాగింది. దాంతో ఆ దారులన్నీ తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలతో నిండిపోయాయి. అయితే ఈ నిరసనలపై బిజెపి తీవ్రంగా మండిపడింది. తీవ్రంగా మండిపడింది. భారత రాజ్యాంగ విలువలకు వ్యతిరేకంగా టిఎంసి వ్యవహరి స్తోందని విమర్శించారు. మమతా బెనర్జీ దీనిలో లోపాలను ఎత్తి చూపాలనుకుంటే సుప్రీంకోర్టును ఆశ్రయించాలి అని వ్యాఖ్యలు చేశారు. రెండో దశలో 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సరవణను చేపట్టనున్నట్లు ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించిన విషయం తెలిసిందే. అండమాన్ నికోబర్, చత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, లక్షద్వీప్, మధ్యప్రదేశ్, పుద్దుచ్చేరి, రాజస్థాన్,

తమిళనాడు, యుపి, పశ్చిమబెంగాల్‌లో జరగనున్న రెండో దశలో 51 కోట్ల మంది ఓటర్లు భాగం కానున్నారు అని తెలిసింది. ఇసి ప్రకటించినట్లుగా ఈ రోజు నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటికే బీహార్ ఎస్ఐఆర్ పూర్తయిన సంగతి తెలిసిందే. ఎన్డీయే పార్టీలు మినహా ఇసి చేపట్టిన ఎస్ఐఆర్‌ను విపక్ష పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. ఎన్నికల సంఘం ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ పేరిట బిజెపితో కలిసి ఓట్ల చోరీకి ప్రయత్నిస్తోందని విపక్ష కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోంది. గత కొన్నేళ్లుగా దేశంలో జరుగుతున్న అన్ని ఎన్నికల్లో ఇదే విధంగా ఓట్ల చోరీ జరిగిందని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు చేసిన సంగతి తెలిసిందే.

# ఇజ్రాయెల్‌కు మద్దతిస్తే.. మా సహకారం ఉండదు

### అమెరికాకు తేల్చి చెప్పిన ఇరాన్



**టెహ్రాన్, నవంబరు 4:** ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేని అమెరికాను ఉద్దేశిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్ పాలనకు మద్దతు ఇవ్వడం ఆపేవరకు యుఎస్‌కు సహకరించేది లేదని తేల్చి చెప్పారు. టెహ్రాన్‌లో విద్యార్థులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఖమేనీ ఈ వ్యాఖ్యలు చేసినట్లు స్థానిక మీడియా పేర్కొంది. ఇరాన్ సహకరించాలని అమెరికన్లు కోరుకుంటున్నారని ఖమేనీ అన్నారు. అయితే ఇజ్రాయెల్ పాలనకు మద్దతు ఇవ్వడం పూర్తిగా ఆపేసేంత వరకు యుఎస్‌కు ఇరాన్ సహకరించదన్నారు. సైనిక స్థావరాలను తొలగించడంతోపాటు మధ్యప్రాచ్యంలో అగ్రరాజ్యం జోక్యం చేసుకోవడం ఆపేస్తే దానితో కలుస్తామన్నారు. ఈ సందర్భంగా వాషింగ్టన్ అహంకారంతో వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. అమెరికాతో అణుచర్చలు తిరిగి ప్రారంభించడానికి తొందరపడటం లేదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఇటీవల పేర్కొన్నారు. ఇదే క్రమంలో పరోక్ష చర్చలకు సిద్ధంగా ఉన్నామన్నారు.

**ఆ ప్రాంతంలోని హమాస్ ఉగ్రవాదులను వదిలిపెట్టం : నెతన్యాహు**

తమ నియంత్రణలో ఉన్న రఫా ప్రాంతంలోని 200 మంది హమాస్ ఉగ్రవాదులను వదిలిపెట్టమని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు పేర్కొన్నారు. వారికి ఎలాంటి సురక్షిత మార్గం ఉండబోదని ప్రధాని కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా హమాస్‌ను నిరాయుధీకరణ చేసేందుకు నెతన్యాహు కట్టుబడి ఉన్నట్లు వెల్లడించింది. ఆయుధాలను వదిలేయడానికి అంగీకరిస్తే హమాస్‌కు సురక్షిత మార్గాన్ని అందించేందుకు ఇజ్రాయెల్ అంగీకరించే అవకాశాలు ఉన్నాయంటూ స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. దీంతోపాటు మిగిలిన బందీల మృతదేహాలను అప్పగిస్తే.. రెడ్‌క్రాస్ వాహనాల్లో ప్రత్యేక కారిడార్ నుంచి హమాస్ ఫైటర్లను తరలించే సాధ్యాసాధ్యాలను మధ్యవర్తులు చర్చించినట్లు అల్‌జజీరా వార్తాసంస్థ పేర్కొంది. అయితే, ఈ కథనాలను ఇజ్రాయెల్ ప్రభుత్వాధికారులు తీవ్రంగా ఖండించారు. ఇవి పూర్తిగా అసంబద్ధమైనవని ఆ దేశ ఆర్థిక మంత్రి బెజలెల్ స్మోట్రిచ్ ఎక్స్‌లో రాసుకొచ్చారు. ఈ విషయంపై జాతీయ భద్రతా మంత్రి ఇటీమర్ బెన్‌గ్విర్ నెతన్యాహుతో సంప్రదింపులు జరిపారు. 200 మంది హమాస్ ఉగ్రవాదులను చంపాలని లేదా జైలులో పెట్టాలని డిమాండ్ చేశారు.

## హర్యానాలో క్రికెట్ కోచ్‌పై విచక్షణా రహితంగా కాల్పులు



### దుండగుల దాడిలో మృతిచెందిన క్రికెటర్, కోచ్

**గనౌర్,(హర్యానా), నవంబరు 4:** హర్యానాలోని గనౌర్ పట్టణంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. స్థానిక క్రికెటర్, కోచ్ అయిన రామ్‌కరణ్‌ను కొందరు దుండగులు కాల్చి చంపారు. సబ్‌డివిజనల్ ఆసుపత్రి సమీపంలో జరిగిన ఈ హత్యతో పట్టణంలో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కొనసాగుతున్న రాజకీయ కక్షలే ఈ హత్యకు దారితీశాయని పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం ముందురోజు సాయంత్రం ఆసుపత్రి వెలుపల రద్దీగా ఉండే ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. ఒక వాహనంలో వచ్చిన దుండగులు రామ్‌కరణ్‌పై విచక్షణారహితంగా కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. తీవ్ర గాయాలపాలైన ఆయనను వెంటనే ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనను పలువురు ప్రత్యక్షంగా చూసినట్లు సమాచారం. ఈ హత్య వెనుక బలమైన రాజకీయ వైరం ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి కోడలు ప్రస్తుతం వార్డ్ నెం 12 కౌన్సిలర్‌గా పనిచేస్తున్నారు. నిందితులలో ఒకరిగా భావిస్తున్న సునీల్ లంబూ గతంలో గనౌర్ మున్సిపల్ కౌన్సిల్‌కు యాక్టింగ్ చైర్మన్‌గా వ్యవహరించారు. గత మున్సిపల్ ఎన్నికల నుంచి ఈ రెండు కుటుంబాల మధ్య విభేదాలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ కాల్పుల ఘటనతో స్థానికంగా తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. వ్యాపారులు తమ దుకాణాలను మూసివేశారు. సోనేపట్ సీనియర్ పోలీస్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. పోలీసులు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని, ఫోరెన్సిక్ బృందాలతో ఆధారాలు సేకరించారు. సమీపంలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తు న్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గనౌర్ పోలీసులు నిందితులపై హత్య కేసు నమోదు చేశారు. నిందితులను పట్టుకు నేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘట నలు జరగకుండా పట్టణంలో అదనపు భద్రతను ఏర్పాటు చేశారు.

# బీహార్‌లో ప్రచారానికి తెర

## - రేపటి పోలింగ్ కోసం ఓటర్లకు తాయిలాలు పంపిణీ - బరిలో తేజస్వి, డిప్యూటీ సిఎం, పలువురు మంత్రులు - ఇసి పకడ్బందీ ఏర్పాట్లు.. భద్రత కట్టుదిట్టం

**పాట్నా, నవంబరు 4:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి తొలి దశ ప్రచారం ముగిసింది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా, వివిధ రాష్ట్రాల బిజెపి ముఖ్య మంత్రులు ఎన్‌డిఏ అభ్యర్థుల తరుఫున ప్రచారం చేయగా, మహాకూటమి తరఫున కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, ఆర్‌జెడి అధ్యక్షుడు లాలూప్రసాద్ యాదవ్, సిఎం అభ్యర్థి తేజస్వి యాదవ్ హోరాహోరీగా ప్రచారం నిర్వహించారు. చివరి రోజున ఆయా పార్టీల నేతలు, స్టార్ క్యాంపెయినర్లు ర్యాలీలు, రోడ్ షోలతో హోరెత్తించారు. ఎన్నికల ప్రచారం ముగియగా, ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి అభ్యర్థుల తాయిలాలు పంపిణీకి శ్రీకారం చుట్టారు. కొన్ని ప్రాంతాల్లో ఓటర్లకు నగదు పంపిణీ చేస్తూ ఫ్లైయింగ్ స్క్వాడ్‌కు పట్టుబడ్డారు. భారీగా నగదు, మద్యం, వివిధ వస్తు సామాగ్రిని ఎన్నికల అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇక తొలి దశ ఎన్నికలకు సంబంధించి ఈనెల 6వ తేదీ గురువారం 18 జిల్లాల్లోని 121 నియోజకవర్గాల్లో పోలింగ్ జరుగనుంది. 1,314 మంది అభ్యర్థుల భవితవ్యం ఏమిటో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకొని తీర్పు ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించిన ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇప్పటికే ఆయా పోలింగ్‌కు అవసరమైన సామాగ్రి ఎన్నికల సిబ్బందికి అందజేసింది. బుధవారం సాయంత్రానికల్లా ఆయా పోలింగ్ కేంద్రాలకు యంత్ర సామాగ్రితో చేరుకోనున్నారు. ఎన్‌డిఏ, ఇండియా కూటమి మధ్య తీవ్ర పోటీ నెలకొంది. అధికారం తిరిగి దక్కించుకోవాలని సిఎం నితీశ్ నేతృత్వంలోని ఎన్‌డిఏ, ఈసారి ఎలాగైనా విజయదుందుభి మోగించాలని ఆర్‌జెడి సిఎం అభ్యర్థి తేజస్వి యాదవ్ శ్రమటోడ్చారు. ఇటు ఎన్‌డిఏ, అటు ఇండియా కూటమికి తొలి దశ ఎంతో కీలకం. ఇక తొలి దశలోనే మహామహులు బరిలో ఉన్నారు. వీరిలో మహా కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి, ఆర్‌జెడి అగ్రనేత తేజస్వి యాదవ్, డిప్యూటీ సిఎంలు సామ్రాజ్ చౌదరి, విజయ్ సిన్హా, మంత్రులు నితిన్ రాబిన్, మంగల్ పాండే, ప్రముఖ గాయని మైథిలీ ఠాకూర్, మాజీ కేంద్ర మంత్రి రాం క్రిపాల్ యాదవ్ భవితవ్యం పరీక్షించుకుంటున్నారు.



**మోడీపై ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు**

**రాహుల్ పెళ్లి ఎప్పుడంటూ కేంద్రమంత్రి చురక**

పంచాయతీ నుంచి పార్లమెంట్ ఎన్నికల వరకు ఏదైనా ఎన్నిక జరిగినా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బిజీగా ప్రచారం చేస్తూనే ఉంటారని, ఇప్పుడు బీహార్‌లో కుమారుడి పెళ్లికి తిరుగుతున్నట్లుగా పర్యటిస్తున్నారంటూ ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రజలు ఎన్నిసార్లు కేవలం మోడీ ముఖం చూసి ఓట్లు వేస్తారని ఆయన ప్రశ్నించారు. ఖర్గే వ్యాఖ్యలపై బిజెపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "ఖర్గే గారూ, మీ యువరాజు రాహుల్ గాంధీ వివాహం ఎప్పుడైనా జరిగితే మాకు ఆహ్వానం పంపండి. ఆ వివాహానికి మేము తప్పకుండా హాజరవుతాం" అంటూ కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ వ్యంగ్యంగా అన్నారు.

## ఫరీదాబాద్‌లో పట్టపగలే బాలికపై కాల్పులు!

**ఫరీదాబాద్, నవంబరు 4:** హర్యానా రాష్ట్రంలోని ఫరీదాబాద్ నగరంలో ఒక దుండగుడు నడిరోడ్డుపై 17 ఏళ్ల బాలికపై కాల్పులు జరిపాడు. కాల్పులకు తెగబడిన యువకుడు గత కొన్ని రోజులుగా ఆమెను వెంబడిస్తున్నాడు. ఈ ఘటన నగరంలోని ఒక ప్రైవేటు లైబ్రరీ వెలుపల చోటు చేసుకుంది. వీరిద్దరు నిత్యం ఆ లైబ్రరీకి వస్తున్నట్లు అక్కడి సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యాలను బట్టి తెలుస్తోంది. కాల్పులకు పాల్పడిన వ్యక్తి ఆ బాలిక దినచర్యను తెలుసుకుని నిత్యం ఆమె రాక కోసం వేచి చూస్తున్నాడని విచారణలో తేలిందని అధికారులు తెలిపారు. బాలిక సంఘటన స్థలానికి రావడానికి కొద్దిసేపటి ముందు నిందితుడు ఆ ప్రాంతానికి వచ్చి వేచి చూస్తున్నట్లు సీసీటీవీ ఫుటేజీలో గుర్తించారు.



## నేపాల్ జన్‌జెడ్ ఆందోళనలు చూసారు కదా! ఇప్పటికిప్పుడు మీ పిటిషన్ విచారణచేయలేం..

### అశ్లీలకంటెంట్ నిషేధంపై పిటిషన్ విచారణలో చీఫ్‌జస్టిస్ గవాయ్ హితవు


**న్యూఢిల్లీ, నవంబరు 4:** ఇంటర్నెట్ లో మితిమీరిపోతున్న అశ్లీల కంటెంట్ పై నిషేధం విధించాలంటూ దేశ అత్యున్నత న్యాయ స్థానంలో పిటిషన్ దాఖలైంది. విచ్చలవిడిగా అందుబాటులో ఉన్న ఈ అశ్లీల వీడియోలు, క్లిప్పులు ఎదిగే పిల్లల మనసులను కలుషితం చేస్తాయని, తీవ్ర దుష్పరిణామాలకు కారణమవుతాయని పిటిషనర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పిటిషన్ ను పరిశీలించిన సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని డివిజనల్ బెంచ్ కీలక వ్యాఖ్యలు చేసింది. నేపాల్ లో ఇటీవల జరిగిన జెన్ జెడ్ ఆందోళనలను ప్రస్తావించింది. ఇంటర్నెట్ లోని పలు సైట్లపై నిషేధం విధించడం వల్ల నేపాల్‌లో చోటుచేసుకున్న పరిణామాలు చూశారు కదా అంటూ పిటిషనర్ ను ప్రశ్నించింది. ఇప్పటికిప్పుడు ఈ పిటిషన్ ను విచారించలేమని చెబుతూ 4 వారాలకు వాయిదా వేసింది. ఈ నెల 23న సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ఈ పిటిషన్ పై విచారణకు ఆయన సుముఖంగా లేరని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. డిజిటలైజేషన్ తర్వాత దేశంలో ఇంటర్నెట్ వాడకం విపరీతంగా పెరిగిందని, చిన్నాపెద్దా తేడా లేకుండా, అక్షరాస్యతతో సంబంధం లేకుండా అందరూ నెట్ వాడుతున్నారని పిటిషనర్ చెప్పారు. కోవిడ్ తర్వాత చిన్నారుల్లో కూడా మొబైల్, ట్యాబ్, ల్యాప్ టాప్ వాడకం పెరిగిందని గుర్తుచేశారు. ఈ క్రమంలో ఇంటర్నెట్ లో అశ్లీల కంటెంట్ ను నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. పోర్న్ కట్టడికి సంబంధించి జాతీయ స్థాయిలో ఓ పాలసీ తీసుకురావాలంటూ కేంద్రాన్ని ఆదేశించాలని పిటిషనర్ కోర్టును అభ్యర్థించారు. ఇంటర్నెట్లో పోర్న్‌ను ప్రత్యక్షంగానో పరోక్షంగానో ప్రోత్సహించే సైట్లు కోట్ల సంఖ్యలో అందుబాటులో ఉన్నాయని పిటిషనర్ చెప్పారు. ఈ వెబ్ సైట్లకు కేంద్రం ఎందుకు అనుమతిస్తోందని ప్రశ్నించారు. ఒక్క మన దేశంలోనే 20 కోట్ల అశ్లీల వీడియోలు, వీడియో క్లిప్పులు ఆన్ లైన్ లో అమ్మకానికి ఉన్నాయని చెప్పారు. డిజిటలైజేషన్ తర్వాత ఆన్ లైన్ లో అశ్లీల కంటెంట్ కేవలం ఒక్క క్లిక్ తో అందరికీ అందుబాటులోకి వచ్చిందన్నారు. ఆన్ లైన్ లో విచ్చలవిడిగా అందుబాటులో ఉన్న ఈ అశ్లీల కంటెంట్ వల్ల ఎదిగే పిల్లల మనసులు కలుషితమవుతాయని, ఇది దుష్పరిణామాలకు దారితీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

# భారతీయ విద్యార్థులకు కెనడా వీసా షాక్!

## భారీ సంఖ్యలో వీసా దరఖాస్తుల తిరస్కరణ

**టొరంటో, నవంబరు4:** ఉన్నత విద్య కోసం కెనడా వెళ్లాలనుకుంటున్న భారతీయ విద్యార్థులకు ఆ దేశ ప్రభుత్వం గట్టి షాక్ ఇస్తోంది. ఒకప్పుడు భారతీయ విద్యార్థులకు ప్రధాన గమ్యస్థానంగా ఉన్న కెనడా, ఇప్పుడు వారి దరఖాస్తులను పెద్ద ఎత్తున తిరస్కరిస్తోంది. ఈ ఏడాది ఆగస్టు నెలలో భారతీయ విద్యార్థులు చేసుకున్న స్టడీ పర్మిట్ దరఖాస్తులలో ఏకంగా 74 శాతం తిరస్కరణకు గురైనట్లు ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2023 ఆగస్టులో ఇది కేవలం 32 శాతంగా ఉండటం గమనార్హం. కెనడా ప్రభుత్వం వరుసగా రెండో ఏడాది అంతర్జాతీయ విద్యార్థుల వీసాల జారీపై పరిమితులు విధించింది. దేశంలోకి వచ్చే తాత్కాలిక వలసదారుల సంఖ్యను తగ్గించడం, స్టూడెంట్ వీసాలకు సంబంధించి జరుగుతున్న మోసాలను అరికట్టడమే లక్ష్యంగా ఈ కఠిన నిబంధనలను అమలు చేస్తోంది. ఈ కొత్త నిబంధనల ప్రభావం భారత్ నుంచి వచ్చే దరఖాస్తుదారులపై తీవ్రంగా పడింది. ఆగస్టు 2023లో 20,900గా ఉన్న భారతీయ విద్యార్థుల దరఖాస్తుల సంఖ్య, 2025 ఆగస్టు నాటికి కేవలం 4,515కు పడిపోయింది. వీసాల తిరస్కరణ వెనుక ప్రధాన కారణంగా వీసా మోసాలని కెనడా ఇమ్మిగ్రేషన్ విభాగం పేర్కొంది. 2023లో దాదాపు 1,550 దరఖాస్తులు నకిలీ అడ్మిషన్ లెటర్లతో వచ్చినట్లు గుర్తించామని, వాటిలో చాలా వరకు భారత్ నుంచే ఉన్నాయని తెలిపింది. గత ఏడాది పటిష్ఠమైన వెరిఫికేషన్ వ్యవస్థ ద్వారా 14,000కు పైగా నకిలీ లెటర్లను గుర్తించినట్లు వెల్లడించింది. దీంతో పాటు, విద్యార్థులు తమ ఖర్చుల కోసం చూపించాల్సిన ఆర్థిక నిల్వల నిబంధనలను కూడా కఠినతరం చేసినట్లు ఇమ్మిగ్రేషన్ శాఖ ప్రతినిధి వివరించారు. ఈ విషయంపై ఒట్టావాలోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. వీసాల జారీ కెనడా అంతర్గత విషయమైనప్పటికీ, ప్రపంచంలోనే అత్యుత్తమ ప్రతిభావంతులైన విద్యార్థులు భారత్‌లో ఉన్నారని, వారి వల్ల కెనడా విద్యాసంస్థలు ఎంతో ప్రయోజనం పొందాయని గుర్తు చేసింది. భారతీయ విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంపై కెనడాలోని పలు ప్రముఖ యూనివర్సిటీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

## కటకటాల వెనక్కి ఇజ్రాయెల్ సైనిక న్యాయవాది!



**టెల్ అవీవ్, నవంబరు 4:** ఇజ్రాయెల్ సైన్యంలో ఉన్నత స్థాయి న్యాయవాదిగా పనిచేసిన మేజర్ జనరల్ యిఫాత్ టోమర్ యెరుషాల్మి ఇప్పుడు కటకటాల వెనుక ఉన్నారు. వారం రోజుల వ్యవధిలో జరిగిన నాటకీయ పరిణామాలు దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తున్నాయి. ఉన్నపళంగా రాజీనామా చేయడం, కొద్దిసేపు అదృశ్యం కావడం, ఆ తర్వాత టెల్ అవీవ్ బీచ్‌లో కనిపించడం, చివరికి అరెస్ట్ కావడం వంటి పరిణామాలు ఇజ్రాయెల్‌ను కుదిపేస్తున్నాయి. పాలస్తీనా ఖైదీపై ఇజ్రాయెల్ సైనికులు అత్యంత దారుణంగా లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసులో కీలకమైన సర్వైలెన్స్ వీడియోను తానే లీక్ చేసినట్లు యిఫాత్ గత వారం అంగీకరించారు. సైనికుల దురాగతం తీవ్రతను బయటపెట్టేందుకే తాను ఈ పనిచేశానని ఆమె తెలిపారు. అయితే ఆమె చర్యపై ఇజ్రాయెల్‌లోని తీవ్రవాద రాజకీయ నాయకుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఒత్తిడికి తలొగ్గి ఆమె రాజీనామా చేసినప్పటికీ, ఆమెపై వ్యక్తిగత దూషణలు ఆగలేదు. ఈ క్రమంలో, యిఫాత్ తన కుటుంబానికి ఓ రహస్య సందేశం పంపి, కారును బీచ్ వద్ద వదిలి అదృశ్యమయ్యారు. ఆమె ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చనే ఆందోళనతో మిలిటరీ డ్రోన్లతో గాలింపు చేపట్టారు. చివరికి ఆదివారం రాత్రి ఆమె బీచ్‌లో ప్రాణాలతో కనిపించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కానీ, అప్పటి నుంచి ఆమెపై విమర్శల దాడి మరింత పెరిగింది. ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మద్దతుదారు, టీవీ వ్యాఖ్యాత యినోన్ మగల్ ఇక ఆమెను వేధించడం కొనసాగించవచ్చని ఎక్స్‌లో పోస్ట్ చేయడం వివాదాస్పదమైంది. యిఫాత్ ఫోన్‌లలో ఒకటి కనిపించకుండా పోవడంతో, సాక్ష్యాలను నాశనం చేయడానికే ఆమె ఆత్మహత్య నాటకమాడారని కొందరు ఆరోపిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారం ఇజ్రాయెల్‌లో రెండేళ్లుగా యుద్ధం జరుగుతున్నప్పటికీ అంతర్గత విభేదాలు ఎంత తీవ్రంగా ఉన్నాయో చూపిస్తోంది. కోర్టు విచారణలో భాగంగా, మోసం, నమ్మకద్రోహం, న్యాయ విచారణకు ఆటంకం కలిగించడం వంటి అభియోగాలపై యిఫాత్ కస్టడీని బుధవారం వరకు పొడిగిస్తున్నట్లు జడ్జి ప్రకటించారు. ప్రస్తుతం ఆమెను సెంట్రల్ ఇజ్రాయెల్‌లోని మహిళల జైలులో ఉంచారు. ఇదే కేసుకు సంబంధించి మాజీ చీఫ్ మిలిటరీ ప్రాసిక్యూటర్ కల్నల్ మటన్ సోలోమెష్‌ను కూడా అరెస్ట్ చేసినట్లు ఇజ్రాయెల్ మీడియా తెలిపింది. 2024 జూలై 5న స్దే టెయిమాన్ సైనిక జైలులో పాలస్తీనా ఖైదీపై కొందరు సైనికులు విచక్షణారహితంగా దాడి చేసి, లైంగిక దాడికి పాల్పడ్డారని అభియోగాలున్నాయి.

## సంక్షిప్తంగా..

### బంగ్లా పాఠశాలల్లో మ్యూజిక్, పిఇటి టీచర్ల నియామకం రద్దు



ఢాకా, నవంబరు 4: **బంగ్లాదేశంలోని** పాఠశాలల్లో మ్యూజిక్, పిఇటి టీచర్ల నియామకాలను రద్దు చేస్తున్నట్లు అక్కడి తాత్కాలిక ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో సంగీత, నృత్య ఉపాధ్యాయులను నియమించాలని అక్కడి విద్యా మంత్రిత్వ శాఖ ఇటీవల నిర్ణయం తీసుకుంది. అయితే ఈ చర్యలను ఇస్లాం వ్యతిరేక అజెండాగా అభివర్ణించిన బంగ్లా ఇస్లాం ఛాందసవాదులు యూనస్ ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా సృష్టించిన మ్యూజిక్, పిఇటి టీచర్ల పోస్టులను రద్దు చేస్తున్నట్లు విద్యా శాఖ అధికారి మసూద్ అక్తర్‌ఖాన్ ప్రకటన విడుదల చేశారు. ఈ పోస్టులను రద్దు చేయడానికి గల కారణాలను మీడియా ప్రశ్నించగా... ఆయన సమాధానం ఇవ్వడానికి నిరాకరించారు. స్థానిక మీడియా వర్గాలు వెల్లడించిన కథనాల ప్రకారం.. యూనస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బంగ్లాలో ప్రభుత్వ నిర్ణయాల్లో ఇస్లాం ఛాందసవాదుల జోక్యం పెరిగిపోతోంది.

### మణిపూర్‌లో ఎన్‌కౌంటర్.. నలుగురు ఉగ్రవాదులు హతం



**ఇంఫాల్, నవంబరు 4:** భద్రతా బలగాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో యునైటెడ్ కుకీ నేషనల్ ఆర్మీ (యుకెఎన్ఎ)కి చెందిన నలుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. మణిపూర్‌లోని ఖన్పీ గ్రామంలో మంగళవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. భద్రతా బలగాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. ఖన్పీ గ్రామంలో 17 మంది యుకెఎన్ఎ ఉగ్రవాదులు దాగి ఉన్నారన్న సమాచారం మేరకు ఆర్మీ బలగాలు, అసోం రైఫిల్స్‌కు చెందిన పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ డాన్ పేరుతో గాలింపు చేపట్టారు. ఈ సందర్భంగా ఉగ్రవాదులు బలగాలపై కాల్పులు జరిపారు. దాంతో భద్రతా బలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో నలుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. మరో ఉగ్రవాదిని బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. మిగతా 11 మంది ఉగ్రవాలు పారిపోయారు.

### సూపర్‌పవర్‌గా ఎదుగుతున్న భారత్: అలెగ్జాండర్ స్టబ్

**హెల్సింకి, నవంబరు 4:** ప్రపంచ రాజకీయాల్లో భారత్ ప్రాముఖ్యత అంతకంతకూ పెరుగుతోన్న వేళ, ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా, చైనాల తర్వాత ప్రపంచంలో తదుపరి సూపర్ పవర్‌గా భారత్ నిలుస్తుందని ఆయన జోస్యం చెప్పారు. అదే సమయంలో, ఇంతటి ప్రాధాన్యత కలిగిన భారత్‌కు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (యూఎన్ఎస్‌సి)లో శాశ్వత సభ్యత్వం లేకపోవడం సరికాదని స్పష్టం చేశారు. తాను భారత్‌కు గొప్ప అభిమానినని పేర్కొన్నారు. విదేశీ వ్యవహారాల్లో భారత్ అనుసరిస్తున్న స్వతంత్ర విధానాలను ఆయన ప్రశంసించారు. అంతర్జాతీయ వేదికలపై, ముఖ్యంగా ఐక్యరాజ్యసమితిలో భారత్ వంటి దేశాల పాత్ర మరింత పెరగాల్సిన అవసరం ఉందని స్టబ్ అభిప్రాయపడ్డారు. భద్రతా మండలిని సంస్కరించాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు.

### ముందుగా మేం అణుపరీక్షలను పునరుద్ధరించం: పాక్



**ఇస్లామాబాద్, నవంబరు 4:** రష్యా, చైనా, ఉత్తరకొరియా, పాకిస్థాన్ వంటి దేశాలు అణ్వాయుధాలను పరీక్షిస్తున్నాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇస్లామాబాద్ స్పందించింది. ఈ విషయంపై పాకిస్థాన్‌కు చెందిన ఓ ఉన్నతాధికారి అంతర్జాతీయ మీడియాకు వివరణ ఇస్తూ.. తామెప్పుడు ఇతర దేశాల కంటే ముందుగా అణు పరీక్షలను పునరుద్ధరించబోమన్నారు. అణు పరీక్షలను నిర్వహించిన మొదటి దేశం కాదని.. అదేవిధంగా అణుపరీక్షలను తిరిగి ప్రారంభించే మొదటి దేశంగానూ తాము ఉండబోమని స్పష్టం చేశారు. ఈ విషయంపై చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ సైతం స్పందించారు. బాధ్యతాయుతమైన అణ్వాయుధ దేశంగా చైనా ఎల్లప్పుడూ ఆత్మరక్షణ అణువ్యూహాన్ని సమర్థిస్తుందన్నారు. అణు పరీక్షలు నిలిపి వేయాలనే విషయంలోనూ తాము అదే నిబద్ధతకు కట్టుబడి ఉంటామన్నారు.

5-11pg6exHMNWJQE 10_5-11pg6exHMNWJQE.qxd 04/Nov/25 10:43 PM Page 1



# అమరావతి అభివృద్ధికి రూ.32,500 కోట్లు




- నిధుల సమీకరణకు సిఆర్‌డిఏ ప్రణాళికలు ● ఎడిబి, వరల్డ్ బ్యాంక్ నుంచి రూ.14,000 కోట్లు
- ఎన్‌ఏబిఎఫ్ఐడి నుంచి రూ.10 వేల కోట్లు ● నాబార్డు నుంచి రూ.7,000 కోట్లు రుణాలు
- ఏపిపిఎఫ్‌సి నుంచి రూ.1500 కోట్లు మంజూరు ● మరింత వేగంగా రాజధాని పనులు

విజయవాడ, నవంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని అభివృద్ధి చేయడానికి రూ. 32,500 కోట్ల నిధులు సమీకరించేందుకు రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సిఆర్‌డిఏ) ప్రణాళికలు సిద్ధం చేసింది. అందుకోసం ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు, నాబార్డు సహాత పలు ఆర్థిక సంస్థల నుంచి రుణం తీసుకోవాలని నిర్ణయించింది. కాగా, ఇప్పటికే సిఆర్‌డిఏ ప్రపంచ బ్యాంకు, ఎడిబిల నుంచి రూ.15,000 కోట్ల రుణం తీసుకుంది. హడ్కో నుంచి తీసుకున్న రూ.11 వేల కోట్లతో కలిపి మొత్తం రూ.26,000 కోట్ల లోన్ తీసుకుంది. ఇప్పుడు మరిన్ని నిధుల సమీకరణ కోసం ప్రయత్నిస్తోంది. రూ.32,500 కోట్లలో.. ప్రపంచ బ్యాంకు, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ) సంయుక్తంగా రూ.14,000 కోట్ల రుణం మంజూరు చేయనున్నాయి. ఇక నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్సింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ (ఎన్ఏబిఎఫ్ఐడి) నుంచి రూ.10,000 కోట్లు నిధులు సమకూరనున్నాయి. నాబార్డు రూ.7000 కోట్లు సమకూర్చనుండగా.. ఆంధ్రప్రదేశ్ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఏపిపిఎఫ్‌సి) రూ. 1500 కోట్లు మంజూరు చేయనుంది. ఏపిపిఎఫ్‌సి ఇవ్వనున్న లోన్‌పై ఇప్పటికే ఒప్పందం కూడా కుదిరింది.



అమరావతి ప్రాజెక్టుపై ప్రపంచ బ్యాంకు మొదటినుంచి సానుకులంగానే ఉంది. రాజధాని నిర్మాణం కోసం లోన్ ఇచ్చేందుకు 2019కి ముందు నుంచే సిద్ధంగా ఉంది. మాజీ ముఖ్యమంత్రి జగన్ హయాంలో పనులు ముందుకు సాగకపోవడం వల్ల ఈ ప్రక్రియ నిలిచిపోయింది. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. ప్రపంచ బ్యాంకుతో సంప్రదింపులు జరిపారు. ఈ నేపథ్యంలో రూ.15,000 కోట్లు లోన్ ఇచ్చేందుకు ప్రపంచ బ్యాంకు ఆమోదం తెలిపింది. ఈ మొత్తంలో ప్రపంచ బ్యాంకు, ఎడిబి సంయుక్తంగా సుమారు రూ.13,500 కోట్లు ఇచ్చాయి. మిగతా రూ.1,500 కోట్లు మ్యాచింగ్ గ్రాంట్ కింద కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది. కాగా, ఈ నిధులతో సిఆర్‌డిఏ 50 పనులు చేపడుతుతోంది. రాజధాని నిర్మాణం కోసం ఇటీవల మరో రూ.14 వేల కోట్లు రుణం ఇచ్చేందుకు కూడా ప్రపంచ బ్యాంకు, ఎడిబి ఆసక్తి చూపించాయి. దీనికి సంబంధించిన ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం ఈ వారంలోనే కేంద్ర ఆర్థిక శాఖకు అందజేసే అవకాశం ఉంది. కేంద్రం ఓకే చెబితే.. ప్రపంచ బ్యాంకు, ఎడిబిల బోర్డుల ఆమోదం కోసం ఫైల్ వెళ్తుంది. కాగా, ఈసారి కూడా ఈ రూ.14,000 కోట్లలో కొంత మొత్తాన్ని మ్యాచింగ్ గ్రాంట్‌గా సమకూర్చాల్సి వస్తుంది. మరి గతంలో లాగానే దాన్ని కేంద్రం ఇస్తుందా లేక రాష్ట్ర ప్రభుత్వమే భరించాలా అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ రుణం మంజూరు అయితే.. రాజధాని అభివృద్ధి పనుల్లో వేగం పెరుగుతుంది.



స్వర్ణముఖి నది తీరాన స్నానఘట్టాల దృశ్యం

# శ్రీకాళహస్తీరాలయంలో భక్తుల ఇబ్బందులెన్నెన్నో...

**ఈశ్వర భక్తులతోపాటు... అయ్యప్ప భక్తుల తాకిడి**

**స్నానాలకు కటకట... పనిచేయని స్నానఘట్టాల షవర్లు**

**నదిలో స్నానం చేద్దామంటే అనువుగా లేని చోటు**

శ్రీకాళహస్తి, నవంబరు 4 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి కార్తీక మాసం ప్రారంభం నుంచి అయ్యప్ప భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. ప్రతి రోజూ శబరిమల వెళ్ళు తెలుగు రాష్ట్రంలోని అయ్యప్ప భక్తులు, అలాగే దర్శనం చేసుకొని తిరుగు పయనంలో శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వస్తారు. అయితే ఇక్కడకు వచ్చిన భక్తులు రాత్రి బస చేసి వేకువ జామున స్నానమాచరించి స్వామి వారిని దర్శించుకోవటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో ఆలయానికి వచ్చే భక్తులు 'స్వర్ణముఖి తీరాన' కైలాసనాధ స్నానఘట్టాలను ఏర్పాటు చేసారు. ఇక్కడ మహిళలు, పురుషులు వేర్వేరుగా స్నానమాచరించటానికి స్నాన ఘట్టాలను ఏర్పాటు చేసారు. వాటికి షవర్లు ఏర్పాటు చేసారు. భక్తుల సౌకర్యార్థం సదుపాయాలు కల్పించుటకు దేవస్థానం లక్షలు వెచ్చిస్తుంది. కానీ పర్యవేక్షణ కొరవడుతుంది. భక్తులు పడుతున్న బాధలను దేవస్థానం అధికారులు పట్టించుకోవటం లేదు. ప్రస్తుతం స్నానఘట్టాల్లో వాల్స్ పనిచేయక పోవటంతో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. స్నానమాచరించి దర్శనానికి వెళ్ళాలంటే కొళాయిలు పని చేయటం లేదు. పని చేస్తున్న ఒకటి ఆర కొళాయిల వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుంది. ఓ వైపు సూర్యోదయానికి ముందే స్వామి అమ్మవార్లను దర్శించుకోవాలనుకునే భక్తులకు నిరాశ తప్పటం లేదు. స్వర్ణముఖి నదిలో దిగి స్నానమాచరిద్దామనుకుంటే 'ఇసుకాసురుల దాహానికి' నదిలో మడుగులు ఏర్పడ్డాయి. ఎక్కడ కాలుపెడితే ఏమౌతుందో అని భయభ్రాంతులు అవుతున్నారు. అధికారులు స్పందించి స్నానఘట్టాల వద్ద కొళాయిలు సరిచేసి భక్తులకు స్నానమాచరించే విధంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# 7న కళ్యాణదుర్గానికి మంత్రి లోకేష్

- మహిళలతో ప్రత్యేక సమావేశం ● 8న కనకదాసు విగ్రహం ఆవిష్కరణ
- ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు



అనంతపురం, నవంబరు 4 ప్రభాత వార్త బ్యూరో: తెలుగుదేశం పార్టీ యువనేత, మంత్రి నారా లోకేష్ ఈ నెల 7, 8 తేదీల్లో అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియో జకవర్గానికి వస్తున్నారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు ఆహ్వానం మేరకు మంత్రి నారా లోకేష్ ఇక్కడికి వస్తున్నారు. 7న కళ్యాణదుర్గంలో ఆ నియోజకవర్గంలోని మహిళా మణులతో ఎమ్మెల్యే సురేంద్ర బాబు ఏర్పాటు చేసే ప్రత్యేక సమావేశంలో మంత్రి లోకేష్ పాల్గొననున్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్న లక్ష్యంతో వారికి దిశ దశను మంత్రి లోకేష్ ద్వారా తెలియజేయాలన్న ఉద్దేశ్యంతో ఎమ్మెల్యే సురేంద్రబాబు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 7వ తేదినే పార్టీ క్రియాశీలక కార్యకర్తలను కూడా కలుసుకుని, ఆ రోజు రాత్రి కళ్యాణదుర్గంలోనే బస చేయనున్నారు. 8వ తేదిన కురుబ కులస్తుల ఆరాధ్య దైవమైన కనకదాసు జయంతి ఉత్సవాలలో కళ్యాణదుర్గంలో మంత్రి లోకేష్ పాల్గొననున్నారు. ఇందులో భాగంగా ఎక్కడా లేనివిధంగా కళ్యాణదుర్గంలో కనకదాస సర్కిల్‌లో 9.50 అడుగులతో తయారు చేసిన కనకదాస విగ్రహాన్ని కూడా మంత్రి నారా లోకేష్ చేతులు మీదుగా ప్రారంభించనున్నారు. కనకదాస సర్కిల్‌ను అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు భారీ సన్నాహాలు చేస్తున్నారు.

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో వాల్మీకులతోపాటు కురుబలు కూడా ఎక్కువగా ఉన్నందున భారీ కనకదాసు విగ్రహాన్ని ఏర్పాటు చేసి మంత్రి నారాలోకేష్ చేతులు మీదుగా ఆవిష్కరింప చేయాలని ఎమ్మెల్యే సురేంద్రబాబు గట్టి ప్రయత్నాల్లో ఉన్నారు. అందులో భాగంగా మంత్రి నారా లోకేష్ కళ్యాణదుర్గం రాక ప్రోగ్రాం కూడా ఖరారైంది. మంగళవారంలో మంత్రి నారాలోకేష్ పర్యటన విజయవంతం చేయాలన్న ఆలోచనతో ఎమ్మెల్యే సురేంద్రబాబు, ఎంపిలు అంబికా లక్ష్మినారాయణ, బికె పార్థసారధి, జిల్లా కలెక్టర్ ఆనంద్, జిల్లా ఎస్పీ డి.జగదీష్, ఇతర అధికారులతో పాటు టిడిపి నాయకులు అవినాష్, తేజ, బోరంపల్లి ఆంజినేయులు తదితర ముఖ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. 7, 8 తేదీల్లో జరగబోయే కార్యక్రమాలను మంత్రి నారా లోకేష్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సురేంద్రబాబు గట్టి పట్టుదలతో ఉన్నారు.

# ఆదరణ 3.0కి రూ.వెయ్యి కోట్లు

- చేతివృత్తిదారులను ప్రోత్సహించడమే లక్ష్యం ● మంత్రి ఎస్.సవిత వెల్లడి



విజయవాడ, నవంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి: చేతివృత్తిదారులను ప్రోత్సహించేందుకు ఆదరణ 3.0 పథానికి రూ.వెయ్యి కోట్లు కేటాయించినట్లు బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. మంత్రి సవిత మీడియాతో మాట్లాడుతూ . బిసిలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ప్రతి బిసి కుటుంబం నుంచి ఒకరు పారిశ్రామికవేత్తగా ఎదరాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సూపర్ సిక్స్ పథకాలలో అధికంగా లబ్ధిపొందేది బిసిలేనని, మెగా డిఎస్సిలోను బిసి వార్గాల అభ్యర్థులు అధిక సంఖ్యలో ఎంపికయ్యారని వెల్లడించారు. ఆదరణ పథకం అమలుపై కార్పొరేషన్ డైరెక్టర్లు, చైర్మన్ల సలహాలు, సూచనలు ప్రభుత్వానికి నివేదించి పథకాన్ని మరింత పారదర్శకంగా ఎటువంటి లోపాలు లేకుండా అమలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు.

**నేతన్నలను అన్ని విధాలా ఆదుకుంటాం**

నేతలన్నలనను అన్ని విధాల అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని చేనేత ఐక్య కార్యాచరణ సమితి నాయ కులు కలిశారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

ఆప్కో షోరూములు, ఆన్‌లైన్‌లో విక్రయాలు పెంచేలా చర్యలు తీసుకుంటు న్నట్లు మంత్రి తెలిపారు. మొంథా తుపాను కారణంగా నష్టపోయిన నేత కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుం టుందని చెప్పారు. 50 కిలోల బియ్యం, నిత్యావ సరాలు పంపిణీ చేయడంతోపాటు, నూలు, ఇతర రసా యనాలు నీటిపాలైన నేత కార్మికులకు రూ.5 వేలు సాయం చేస్తున్నట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో చేనేత ఐక్య కార్యాచరణ సమితి నాయకులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, పి.బాలకృష్ణ, రామనాథం, పూర్ణచంద్ర బాబు, కోటేశ్వరరావు, బాలజీ, కుమారి, రామారావు కృష్ణారావు తదితరులు ఉన్నారు.

**లోకోమోటర్ దివ్యాంగులకు ఉచితంగా త్రీ వీలర్ మోటర్ సైకిళ్లు**

# 25లోగా దరఖాస్తులు చేసుకోవచ్చు

విజయవాడ, నవంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో అర్హులైన లోకోమోటర్ దివ్యాంగులకు ఉచితంగా రెట్రోఫిట్టెడ్ మోటరైజ్డ్ వాహనాల మంజూరు పథకానికి అర్హులై అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర దివ్యాంగులు, వృద్ధుల సహాయ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బి. రవిప్రకాష్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుకూల వాహనం నడపడానికి అవసరమైన డ్రైవింగ్ లైసెన్స్ ఉండి, రెగ్యులర్ డిగ్రీ, ఆ పై ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులు, పదో తరగతి ఉత్తీర్ణులై స్వయం ఉపాధితో జీవిస్తూ రాష్ట్రానికి చెందినవారై ఉండాలన్నారు. అర్హులైన వారు, పూర్తి వివరాలకు సంబంధిత వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా 25 నవంబరు 2025 లోపు దరఖాస్తు చేసుకోవాలని రవిప్రకాష్ రెడ్డి తెలియజేశారు.



మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేస్తున్న ఎస్పీ తుషార్ డూడి

# భారీగా మొబైల్ ఫోన్లు రికవరీ

**చిత్తూరు ఎస్పీ తుషార్ డూడి వెల్లడి**

చిత్తూరు, నవంబరు 4 ప్రభాతవార్త: చిత్తూరు క్రైం పోలీసులు చాట్‌బాట్, సిఇఐఆర్ సేవల ద్వారా మంగళవారం మరో 63 లక్షల రూపాయల విలువైన 315 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. చిత్తూరు పోలీసు గెస్ట్‌హౌస్‌లో మంగళవారం ఎస్పీ తుషార్ డూడి 'మొబైల్ రికవరీ మేళా'ను నిర్వహించి ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు పోలీసులు స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లను అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 13 దశల్లో 8.55 కోట్ల రూపాయల విలువైన 4,106 మొబైల్ ఫోన్లను చాట్‌బాట్, సిఇఐఆర్ సేవల ద్వారా స్వాధీనం చేసుకుని మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వారికి అందజేసినట్లు వివరించారు. మొబైల్ ఫోన్‌ను ఎలాంటి ఫిర్యాదు లేకుండా, పోలీస్ స్టేషన్‌కు వెళ్ళకుండా, ఎఫ్ఐఆర్ నమోదు కాకుండా, ఇంట్లో కూర్చొని పోలీసు వారి చాట్‌బాట్, సిఇఐఆర్ సేవల ద్వారా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను మళ్ళీ పొందవచ్చునన్నారు. జిల్లాలో 13వ విడతలో 315 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందిస్తున్నామన్నారు. పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను చిత్తూరు క్రైమ్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ ఉమామహేశ్వర్‌రావుతో పాటు చాట్‌బాట్ సిబ్బంది బాపూజీ, రఘురామన్‌ల ఆధ్వర్యంలో మొబైల్ ఫోన్లను రికవరీ చేశారన్నారు. పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు మన రాష్ట్రంలోనిదే కాకుండా ఇతర రాష్ట్రాలైన తెలంగాణ, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర రాష్ట్రాల నుండి మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందిస్తున్నామన్నారు. మొబైల్ ఫోన్లకు సంబంధించి మరిన్ని పెండింగ్‌లు వున్నాయని వాటిని సైతం త్వరలో రికవరీ చేస్తామన్నారు.

# ప్రభుత్వ రంగ సంస్థలు జవాబుదారీతనంతో పనిచేయాలి

**శాసన సభ పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ ఛైర్మన్ కూన రవికుమార్**



విజయవాడ, నవంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రభుత్వ రంగ సంస్థలు పారదర్శ కంగా, జవాబుదారీతనంతో పనిచేయాలని రాష్ట్ర శాసన సభ పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ ఛైర్మన్ కూన రవికుమార్ అన్నారు. మంగళ వారం కూన రవికుమార్ అధ్యక్షతన రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్, రాష్ట్ర వైద్య సేవలు. మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్, ఎపి ఏవియేషన్ కార్పొరేషన్, ఎపి ఎయిర్‌పోర్ట్స్ అభివృద్ధి కార్పొరేషన్ కార్యకలాపాలపై కమిటీ సమీక్షించింది. కమిటీ ఛైర్మన్ కూన రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం నుండి నిధులు పొందుతున్న ప్రతి సంస్థ విధిగా గణాంకాలు, ఆడిట్, విత్తం వివరాలు పక్కాగా ఉండాలన్నారు. ప్రతి ఆర్థిక సంవత్సరంలోగా తనిఖీలు పూర్తి కావాలని స్పష్టం చేశారు. శాసన సభ పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ ప్రభుత్వ రంగ సంస్థల పని సామర్థం, జవాబుదారీతనాన్ని పరిశీలిస్తుందని చెప్పారు. సంస్థలు మంచి పనితీరుతో పనిచేయడం వలన ఆదాయం పెరుగుటకు అవకాశం ఉందని తెలిపారు. ప్రతి సంస్థ వార్షిక కార్యకలాపాలు, వార్షిక ఆదాయం, వ్యయంపై విధిగా నివేదికలు సమర్పించాలని ఆయన స్పష్టం చేశారు. ప్రతి సంస్థ కార్యకలా పాలను క్షుణ్ణంగా విచారణ చేశారు. ఆడిట్ అభ్యంతరాలను సైతం సంస్థలు సమర్పించాలని ఆయన చెప్పారు. సంస్థలు నిర్దేశిత కాలంలో సమర్పించక పోవడానికి అంతర్యాలను ఆరా తీసారు. వచ్చే బడ్జెట్ సమావేశాల నాటికి నివేదికలు తాజా పరచాలని ఆదేశించారు. ఎపి పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ మినహా ఇతర అధికారులు హాజరు కావడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ సమీక్షను నిర్వహించలేదు. డెయిరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ హాజరు కాకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్పొరేషన్ ఇతర అధికారులు హాజరు కావడం పట్ల సమీక్షను నిర్వహించలేదు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్, గిడ్డి సత్యనారాయణ, కుమార్ రాజా వర్లా, వసంత వెంకటకృష్ణ ప్రసాద్, బుమ్మిరెడ్డి రామగోపాల రెడ్డి, ఎపి అటవీ అభివృద్ధి సంస్థ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డా.ఎస్.ఎస్.శ్రీధర్, రాష్ట్ర వైద్య సేవలు మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గిరీషా, ఎపి ఎయిర్ పోర్టుల అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రవీణ్ ఆదిత్య, కాంట్రాక్టర్ ఇషాక్ భాషా, గౌతు శిరీష ఐతబతుల ఆనందరావు, జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజా వలి, డిప్యూటీ కలెక్టర్ విజయ లక్ష్మి, కమిటీ సహాయ కార్యదర్శి యు.నాగమునయ్య, ప్రిన్సిపాల్ ఆడిట్ అండ్ అకౌంట్స్ జనరల్ కార్యాలయ సీనియర్ ఆడిట్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# కార్తీక పౌర్ణమి సందర్భంగా పటిష్ట భద్రతా చర్యలు

నెల్లూరు క్రైమ్, నవంబరు 4 ప్రభాతవార్త: ప్రజలు సురక్షితంగా, ప్రశాంతంగా కార్తీక పౌర్ణమి పండుగ జరుపుకోవాలని ఎస్పీ అజిత వేజెండ్ల ఆకాంక్షించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా నేడు జిల్లా పరిధిలోని శివాలయాలు, పవిత్ర దేవాలయాలు తదితర ప్రాంతాల్లో కూడా భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో, జిల్లా పోలీస్ శాఖ పటిష్ట భద్రతా చర్యలను చేపట్టిందని ఎస్పీ పేర్కొన్నారు. భక్తుల భద్రత, సౌకర్యం దృష్ట్యా అన్ని సబ్ డివిజన్‌ల పోలీస్ స్టేషన్ల పరిధిలోని ఆలయాల వద్ద పూర్తిస్థాయి బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. రద్దీ అధికంగా ఉన్న ప్రదేశాల్లో క్యూలైన్ వ్యవస్థలు, పార్కింగ్ సౌకర్యాలు, ట్రాఫిక్ నియంత్రణ అంశాలను సమగ్రంగా పర్యవేక్షించాలని ఆమె ఆదేశించారు. భక్తులు ప్రశాంతంగా దర్శనం చేసుకునే విధంగా క్యూలైన్‌లు ఎటువంటి ఆటంకం లేకుండా ఉండేలా, మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లల కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని, నిరంతర గస్తీ ఏర్పాటు చేయాలని సూచించారు. నదీ, సముద్రం తదితర స్థాన వాటికల వద్ద అప్రమత్తంగా ఉంటూ నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. రద్దీగా ఉండే ఆలయాలు, ఘాట్ల వద్ద తోపులాటలు, తొక్కిసలాటలు జరగకుండా క్యూ లైన్లలో మాత్రమే ముందుకు సాగాలన్నారు. రద్దీ అధికంగా ఉన్న సమయాల్లో ప్రజలు సహనం పాటించి, పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

**తుపాను బాధితులను పరామర్శించే అర్హత**

# జగన్‌కు లేదు: మంత్రి సవిత

విజయవాడ, నవంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి: మొంథా తుపాను బాధితులను పరామర్శించే అర్హత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లేదని మంత్రి ఎస్.సవిత అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. తుపాను ఎప్పుడు రాష్ట్రంపై ప్రభావం చూపుతన్నా ఆయన రాష్ట్రంలో ఉండరని విమర్శించారు. తుపాను నష్టం అంచనాలు పూర్తయి కేంద్రానికి నివేదిక కూడా వెళ్లిపోయాక ఇప్పుడు పరామర్శ అంటూ జగన్ వెళుతున్నారని మండిపడ్డారు. రైతులను అప్పుడు ఇప్పుడు ఎప్పుడు ఆదుకున్న పార్టీ టీడీపీ, కూటమి ప్రభుత్వమే అని స్పష్టం చేశారు. జగన్ అధికారంలో ఉండగా అమరావతి రైతులను ముప్పుతిప్పలు పెట్టారని, ఇప్పుడు రైతుల పరామర్శ అంటారా అంటూ మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి హయంలో కేంద్రం ఇచ్చే సాయంతో కలుపుకుని ఏడాదికి ఇచ్చింది రైతుభరోసాగా రూ.13,500 మాత్రమే అని చెప్పుకొచ్చారు. కానీ కూటమి సర్కార్ ఏడాదికి రూ.20 వేలు అన్నదాత సుఖీభవ కింద అందిస్తోందని, రైతుల సంక్షేమం చూస్తోందని తెలిపారు. రైతు అమ్మిన ధాన్యానికి డబ్బులు ఇవ్వకుండా జగన్ సర్కార్ ఎగవేస్తే వాటిని కూటమి తీర్చిందని చెప్పారు. పంట కొనుగోలు చేసిన 24 గంటల నుంచి 48 గంటల్లోగా రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తోందని మంత్రి సవిత పేర్కొన్నారు.

**దళిత, గిరిజన పారిశ్రామికవేత్తలకు**

# వందశాతం రాయితీలివ్వాలి

విజయవాడ, నవంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలోని దళిత, గిరిజన పారిశ్రామికవేత్తలకు రాయితీలను నూరు శాతం వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. 7,675 దళిత, 1,320 గిరిజన పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం రూ.1,200 కోట్ల రాయితీలను తక్షణమే విడుదల చేయాల్సి ఉందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి రాయితీలు అందకపోవడంతో దళిత, గిరిజన పారిశ్రామికవేత్తలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు రాష్ట్రం స్వర్గధామమని దేశ విదేశాల్లో పెట్టుబడిదారుల వెంటపడి అనేక రాయితీలు కల్పిస్తుందని, రాష్ట్రానికి చెందిన దళిత, గిరిజన పారిశ్రామికవేత్తలకు ఏళ్ల తరబడి రాయితీలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేయడం సరైందికాదని అన్నారు. గత నాలుగేళ్లుగా వీరికి ఒక్క రూపాయి చెల్లించకపోవడం దుర్మార్గమని వెల్లడించారు. విశాఖ భాగస్వామ్య సదస్సుకు రూ.300 కోట్లు కేటాయించిన ప్రభుత్వం, దళిత, గిరిజన పారిశ్రామికవేత్తల రాయితీల చెల్లింపునకు కేవలం రూ.206 కోట్లు కేటాయించడాన్ని తప్పుబట్టారు.

# కేంద్ర 8వ వేతన సంఘాన్ని ఏర్పాటుచేస్తూ గెజిట్ జారీ

గుంతకల్లు రైల్వే, నవంబరు 4 ప్రభాతవార్త: కేంద్ర 8వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటుచేస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. జస్టిస్ రంజన ప్రకాశ్ దేశాయ్ అధ్యక్షతన పార్ట్ టైం సభ్యుడిగా ప్రొఫెసర్ పులక్ ఘోష్, మెంబర్ సెక్రటరీగా పంకజ్ జైన్‌లను నియమించారు. కేంద్ర ప్రభుత్వ సర్వీసులలోని మంత్రిత్వశాఖల పనితీరు, వేతన విధానం, సుప్రీంకోర్టు, వివిధ రాష్ట్రాల హైకోర్టులు, కేంద్ర పాలిత రాష్ట్రాల న్యాయాధికారుల వేతనాలు, ఉత్పాదకత ప్రతిపాదిత బోనస్ చెల్లింపు ప్రక్రియ, గ్రాట్యుటీ, జాతీయ పెన్షన్ పథకం, ఏకీకృత పెన్షన్ పథకాలను సమీక్షించి, అధ్యయనం చేసి నిర్ణీత 18 నెలలలోపు నివేదికను సమర్పించాలని కేంద్రం తన గెజిట్ నోటిఫికేషన్‌లో 8వ వేతన సంఘాన్ని ఆదేశించింది.

# అవినీతి రహితంగా పనిచేయండి: డిఆర్ఎం



గుంతకల్లు రైల్వే, నవంబరు 4, ప్రభాతవార్త: రైల్వే సిబ్బంది అవినీతి రహితంగా పనిచేసి రైల్వే పరువు ప్రతిష్టలను కాపాడాలని డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా అన్నారు. విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా మంగళ వారం స్థానిక రైల్వే ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. అత్యాశతో అక్రమార్జనలకు పాల్పడి విజిలెన్స్, సిబిఐలకు పట్టుబడి అవమానాలను ఎదుర్కోవడం కంటే ఉన్న దాంట్లో సంతృప్తి పొందాలన్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడే వారికి సమాజంలో ఎంత మాత్రం విలువ ఉంటుందనేది ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. కేవలం సదరు వ్యక్తులపైనే కాకుండా దాని ప్రభావం కుటుంబ వ్యవస్థపై సైతం తీవ్రంగా ఉంటుందని పేర్కొన్నారు. విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో హిందీ భాషలో తాండూరుకు చెందిన లోకో పైలట్ రవి రాబర్ట్ ముర్ముకు ప్రథమ బహుమతి లభించగా, గుత్తిలో లోకో పైలట్‌గా పనిచేస్తున్న భోలా ప్రసాద్‌కు ద్వితీయ బహుమతి లభించింది.

అలాగే ఆంగ్లభాషలో నంద్యాలకు చెందిన సీనియర్ ఏఎల్‌పి అఖిల్ సింగ్‌కు ప్రథమ బహుమతి లభించగా, ధర్మవరంకు చెందిన లోకో పైలట్ వి.కిశోర్ కుమార్‌కు ద్వితీయ బహుమతి లభించింది. విజేతలకు డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే విజిలెన్స్ ఉన్నతాధికారులు బి.శివప్రసాద్, ఎస్ ఆర్ షెల్కే, డిపిఓహెచ్ ఎల్ఎన్ ప్రసాద్, ఆయా విభాగాల సంబంధిత అధికారులు రైల్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# బెదిరింపులకు భయపడం

**- వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి విమర్శ**

అనంతపురం, నవంబరు 4 ప్రభాతవార్త బ్యూరో: అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ భూ కబ్జాలు, దౌర్జన్యాలు, డబుల్ రిజిస్ట్రేషన్లపై ప్రశ్నిస్తే వ్యక్తిగత బెదిరింపులకు పాల్పడుతున్నారని, మీ బెదిరింపులతో మా గొంతు నొక్కే ప్రయత్నం చేస్తే భయపడే ప్రసక్తి లేదని వైసిపి అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. జిల్లా వైసిపి కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. జిల్లాలో అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల అవినీతి, దౌర్జన్యాలు, కబ్జాలను ప్రశ్నిస్తే వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని విమర్శించారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తనకు 450 ఎకరాలు ఉన్నాయని ఆరోపించారని ఆ భూములు ఎక్కడున్నాయో చూపిస్తే మంచిదని ఎద్దేవా చేశారు. తమ కుటుంబం సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో కొనసాగుతున్నా ప్రజా సంక్షేమం కోసమే పని చేశామని, తమ చరిత్ర తెరిచిన పుస్తకం లాంటిదని ఆయన స్పష్టం చేశారు. మీ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. మీ దౌర్జన్యాలు, అక్రమార్జనలపై పోరాడుతూనే ఉంటామని హెచ్చరించారు. బెదిరింపులతో మా గొంతు నొక్కే ప్రయత్నం చేసినా వెనకడుగు వేసే ప్రసక్తి ఉండదని ఆయన స్పష్టం చేశారు.


కరువు మండలాల ప్రకటనలో అనంతపురం జిల్లాలో ఒక్క మండలాన్ని కూడా ప్రకటించక పోవడంతో జిల్లా రైతాంగానికి తీరని అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతిని ధులు, అధికారులు కళ్లు తెరిచి కరువు మండలాలుగా ప్రకటించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల పక్షాన ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. విలేకర్ల సమావేశంలో రైతు విభాగం జిల్లా అధ్యక్షులు నారాయణరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు నరసింహులు, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పెన్నోభిలేసు, ఎస్సీ సెల్ నగరాధ్యక్షులు పసలూరు ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

5-11P□g7exHMNWJQE 11_5-11P□g7exHMNWJQE.qxd 05/Nov/25 12:31 AM Page 1



# భారత్‌లో పెట్టుబడులకు అపార అవకాశాలు

## నార్వే వ్యాపారవేత్తలతో ఎంపీ పుట్టా మహేష్ కుమార్



ఏలూరు, నవంబరు 4 ప్రభాతవార్త: అధికారిక పర్యటనలో ఉన్న ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సహా ఏడుగురు సభ్యుల భారత ఎంపీల బృందం సోమవారం, మంగళవారంలలో అనేక ప్రత్యేక కార్యక్రమాలు, సదస్సులలో బిజీ బిజీగా పాల్గొన్నారు. సోమవారం ఉదయం నార్వే రాజధాని ఓస్లోలోని ఇన్స్టిట్యూట్ ఫర్ సోషల్ రీసెర్చ్ భవనంలో సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ జెండర్ ఈక్వాలిటీ వారు నిర్వహించిన లింగ సమానత్వంలో నార్వే ప్రయాణం అనే ప్రత్యేక కార్యక్రమంలో భారత ఎంపీల బృందం పాల్గొన్నారు. మధ్యాహ్నం నార్వే ఇండియా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో భారత్‌తో ఇప్పటికే వాణిజ్య సంబంధాలు కలిగి ఉన్న పలువురు వ్యాపారవేత్తలు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత్‌లో పెట్టుబడులకు గల అవకాశాలను నార్వే పారిశ్రామికవేత్తలకు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వివరించారు. 140 కోట్లకు పైగా జనాభా ఉన్న భారత మార్కెట్ పై దృష్టి పెట్టాలని నార్వే పారిశ్రామికవేత్తలను ఎంపీ కోరారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో నార్వే డైరెక్టర్ ఫర్ చిల్డ్రన్ యూత్ అండ్ ఫ్యామిలీ ఎఫైర్స్ వారు నిర్వహించిన ప్రత్యేక అవగాహన సదస్సులో ఎంపీలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లింగ సమానత్వం కోసం నార్వే అనుసరించిన విధానాలు, అందులో ఎదురైన సవాళ్లు, అమలుచేస్తున్న చట్టాలపై నార్వే అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా భారత బృందానికి వివరించారు. పర్యటన మూడోరోజు మంగళవారం భారత ఎంపీలు నార్వే పార్లమెంట్‌ను సందర్శించారు. దేశ పార్లమెంట్‌లో వివిధ సభా సంఘాలతో సమావేశమయ్యారు. విదేశీ వ్యవహారాలు, సాంస్కృతిక, రక్షణ, పరిశ్రమలకు చెందిన స్టాండింగ్ కమిటీ సభ్యులతో జరిగిన సమావేశాల్లో పాల్గొన్న పుట్టా మహేష్ కుమార్ బృందం, పార్లమెంట్ సమావేశాలు జరిగే తీరును సభా గ్యాలరీల నుండి వీక్షించారు. నార్వేయన్ ఏజెన్సీ ఫర్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో డిజిటల్ పబ్లిక్ గూడ్స్ అనే అంశంపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో భారత ఎంపీల బృందం పాల్గొంది. ఈ సమావేశంలో మాట్లాడిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ డిజిటలైజేషన్ ద్వారా భారతదేశంలో అమలు చేస్తున్న సేవలను వివరించారు.

# కొలికపూడి వర్సెస్ కేశినేని



## ఎమ్మెల్యే, ఎంపీ మధ్య మాటల వివాదం
## క్రమశిక్షణ కమిటీ ముందు ఇద్దరూ హాజరు
## ఎవరి వాదన వారు వినిపించిన నేతలు
## గీత దాటొద్దని అధిష్టానం హెచ్చరికలు



విజయవాడ, నవంబరు 4, ప్రభాతవార్త ప్రతినిధి: తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ కమిటీ ముందు తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), కొలికపూడి మధ్య వివాదం నేపథ్యంలో ఇరువురూ క్రమశిక్షణ కమిటీ ముందు హాజరుకావాలని ఇటీవల పార్టీ ఆదేశించింది. ప్రభుత్వం ఏర్పడిన 16నెలల కాలంలో ఎమ్మెల్యే కొలికిపూడి 3వ సారి క్రమశిక్షణ కమిటీ ముందుకు వచ్చారు. ఎక్కడా లేని సమస్య తిరువూరులోనే ఎందుకు వస్తోందంటూ ఇప్పటికే పలుమార్లు అధినేత చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం కొలికపూడి శ్రీనివాసరావు హాజరయ్యారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో పాటు క్రమశిక్షణ కమిటీలోని కొనకళ్ల నారాయణరావు, వర్ల రామయ్య, ఎంఎ షరీఫ్, పంచుమర్తి అనురాధ ఎదుట ఆయన హాజరై వివరణ ఇచ్చారు. ఎంపీ కేశినేని చిన్ని సైతం క్రమశిక్షణ కమిటీ ముందుకు వచ్చారు. వరుస వివాదాలకు కేంద్రబిందువుగా మారుతున్న ఇద్దరు నేతలపై తెలుగుదేశం అధిష్టానం సీరియస్‌గా ఉంది. ఇద్దరు నేతలను విచారణ అనంతరం క్రమశిక్షణ కమిటీ అధినేతకు నివేదించనున్నట్లు వివరించారు.

### ఇరువురి మధ్య వివాదం

గత కొన్ని రోజులుగా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, విజయవాడ ఎంపీ చిన్నిల మధ్య వాగ్వాదం నడుస్తున్న విషయం తెలిసిందే. అయితే ఆ మాటల యుద్ధం కాస్తా బ్యాంకు లావాదేవీల వరకు వెళ్లింది. ఎమ్మెల్యే టికెట్ కోసం డబ్బులు ఇచ్చానంటూ తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి బ్యాంక్ స్టేట్మెంట్ విడుదల చేశారు. ఎంపీ చిన్ని అనుచరులకు ఎంత డబ్బులు ఎక్కడ ఇచ్చింది వివరాలతో కొలికపూడి వాట్సప్ స్టేటస్ పెట్టారు. 2024 ఎన్నికల్లో తిరువూరు టీడీపీ టిక్కెట్ కోసం కేశినేని చిన్ని తనను రూ.5 కోట్లు అడిగితే వివిధ మార్గాల్లో వాటిని ఎంపీ మనుషులకు ఇచ్చినట్లు కొలిపూడి వెల్లడించారు. తాను ఇచ్చిన డబ్బు మొత్తం వివరాలపై రేపు మాట్లాడుకుందాం అని స్టేటస్‌లో పెట్టారు. కొలికపూడి ఆరోపణలపై స్పందించిన ఎంపీ కేశినేని చిన్ని వివాదం అధిష్ఠానం దృష్టికి వెళ్లిందన్నారు. అంతా అధిష్టానం చూసుకుంటుందని స్పష్టం చేశారు. మొన్నటివరకు కొలికపూడి తనను దేవుడన్నారని ఇప్పుడు దెయ్యం ఎందుకయ్యానో సమాధానం చెప్పాలన్నారు. చంద్రబాబు, లోకేశ్, పవన్‌ను విమర్శించే వారిని తాను శత్రువుల్లాగే చూస్తానని స్పష్టం చేశారు. వైఎస్సార్సీపీ నేతలతో అంటకాగే నాయకుడిని తాను కాదన్నారు.

### కఠిన చర్యలకు వెనకాడబోను

తిరువూరు విభేదాలపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. ఈ వ్యవహారాన్ని పార్టీ క్రమశిక్షణ కమిటీకి అప్పగించారు. కొలికిపూడి శ్రీనివాసరావు, కేశినేని చిన్నీ ఇద్దరినీ పిలిచి మాట్లాడాలని సూచించిన సంగతి తెలిసిందే. ఇరు వర్గాల నుంచి వివరణ తీసుకుని తనకు నివేదించాలని ఆదేశించారు. విదేశీ పర్యటన ముగించుకుని వచ్చాక తాను ఇద్దరితో మాట్లాడతానని తెలిపారు. పార్టీ క్రమశిక్షణ ఎవరు ఉల్లఘించినా ఉపేక్షించేది లేదని తేల్చిచెప్పారు. విభేదాలు కొలిక్కిరాకుంటే కఠిన చర్యలకు వెనుకాడనని స్పష్టం చేసారు.

# విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ఎన్నారైల భాగస్వామ్యాన్ని పెంపొందించాలి

- ఎగుమతులు, దిగుమతులపై ఎన్నారైలలో అవగాహన పెంచే చర్యలు చేపట్టాలి
- ఎపి ఎన్నార్టీ ఐకానిక్ టవర్ నిర్మాణ పురోగతిపై సమీక్షలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్



గన్నవరం(కృష్ణా), నవంబరు 4 ప్రభాతవార్త: వివిధ దేశాలలో కీలక స్థానాల్లో పనిచేస్తున్న ఎన్నారైలతో ఓ క్లబ్ ఏర్పాటు చేసి, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అన్ని అవకాశాలను వారికి వివరించి, వారి ద్వారా పెట్టుబడులను ఆకర్షించే దిశగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సూక్ష్మ చిన్న, మధ్యతరహాపరిశ్రమలశాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. విదేశాల్లో స్థిరపడిన పారిశ్రామికవేత్తలను రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే విధంగా వారిని ప్రోత్సహించాలని, పారిశ్రామిక విధానాన్ని వారికి అర్థమయ్యే విధంగా ప్రభుత్వం అమలుచేసే వివిధ కార్యక్రమాలను వారికి వివరిస్తూ పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలను ఎన్నారై క్లబ్ ద్వారా నిర్వహించాలని మంత్రి సూచించారు. విదేశీ సంస్థలలో కీలక స్థానాలలో పనిచేసే ముఖ్య కార్యనిర్వహణాధికారులు, ఛీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్లు, చీఫ్ టెక్నికల్ ఆఫీసర్లను ఈ క్లబ్‌లో భాగస్వాములను చేయాలని తెలిపారు. ఇదే సమయంలో ఎపి ఎన్నార్టీ అధ్యక్షుడు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఈ పెట్టుబడులను ఆకర్షించే విషయంలో శక్తివంచన లేకుండా కృషి చేయాలని మంత్రి పేర్కొన్నారు. అదేవిధంగా ఎగుమతిదారులు, దిగుమతిదారులతో సైతం ఓ క్లబ్ ఏర్పాటు చేసి అందరినీ ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి, ఎగుమతులు, దిగుమతులలో ఉన్న మెళకువలను తెలియజేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఎగుమతులను ప్రోత్సహించాలని మంత్రి పలు సూచనలు చేశారు. 135 దేశాల్లో ఉన్న తెలుగువారికి ఎగుమతులు, దిగుమతులపై స్పష్టమైన అవగాహన పెంపొందించడం ద్వారా రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే వివిధ రంగాల్లోని వస్తువులను డిమాండ్ పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. అమరావతిలో నిర్మించతలపెట్టిన ప్రవాసాంధ్రుల ఐకానిక్ టవర్ నిర్మాణ పనుల పురోగతిపై మంత్రి సమీక్షించారు. ఈ సమావేశంలో ఎపి ఎన్నార్టీ అధ్యక్షుడు వేమూరి రవికుమార్, సిఈఓ కృష్ణమోహన్ పాల్గొన్నారు.



దాతలకు దుర్గమ్మవారి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

# దుర్గమ్మవారి ఆలయంలో నేడు కోటి దీపార్చన

## పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షణ
## జ్వాలాతోరణం, సాయంత్రం అన్నదానం

ఇంద్రకీలాద్రి, నవంబరు 4 ప్రభాతవార్త: దుర్గమ్మవారి ఆలయంలో కార్తీకమాస పౌర్ణమి పర్వదినాన కోటి దీపార్చన నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. బుధవారం ఉదయం 5.55లకు గిరి ప్రదక్షణను శ్రీ కామధేను మాత ఆలయం వద్ద ప్రారంభించి కుమ్మరిపాలెం, విద్యాధరపురం, నాలుగుస్తంబాల సెంటర్, సితార, పాలఫ్యాక్టరి, కెబిఎన్ కాలేజ్, బ్రాహ్మణ వీధిలో శ్రీ స్వామి అమ్మవార్ల గిరి ప్రదక్షణ జరుగుతుందని ఈ కార్యక్రమాల్లో భక్తులు విశేషసంఖ్యలో పాల్గొనాలన్నారు. సాయంత్రం జరిగే కోటి దీపోత్సవం అనంతరం జ్వాలాతోరణం కార్యక్రమాన్ని శ్రీ మల్లేశ్వరస్వామివార్ల ఆలయం వద్ద నిర్వహిస్తామని అనంతరం 2500 మంది భక్తులకు అన్నదానం శ్రీ మల్లేశ్వరస్వామివార్ల ఆలయానికి వచ్చే దారిలో నిర్వహిస్తామన్నారు. 500 మంది సేవాదళ్ సభ్యులతో కోటి దీపోత్సవం నిర్వహిస్తామని ఇఓ, చైర్మన్‌లు తెలిపారు.

### వేదోక్తంగా కార్తీకమాస పూజలు



దుర్గమ్మవారి ఆలయంలో మంగళవారం కార్తీకమాస పూజలు వేదోక్తంగా నిర్వహించారు. ఇఓ, చైర్మన్లు కార్యక్రమంలో పాల్గొనగా వేదపండితులు అర్చనలు చేశారు. కార్తీకమాస పూజల్లో భక్తులు పాల్గొనాలని ఇఓ చైర్మన్లు తెలిపారు. సహస్ర దీపకాంతులతో శ్రీ స్వామి అమ్మవార్లు భక్తులను ఊంజల్ సేవలం దుకుని అనుగ్రహించారు. పవిత్ర కార్తీకమాసం సందర్భంగా సహస్ర లింగా ర్చన సేవలో పాల్గొనాలని భక్తులకు ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు తెలిపారు. అర్చకస్వాములు వేదమంత్ర పఠనాలతో శ్రీ స్వామి వారికి సేవలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. సాయం సంధ్యాకాలంలో శ్రీ స్వామి అమ్మవార్లు ఊంజల్‌పై భక్తుల సేవలందుకుని అనుగ్రహించారు. ఈ సందర్భంగా చతుర్వేద పఠనాలు పండితులు చేశారు.

### నిత్యాన్నదానానికి విరాళం

దుర్గమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన శ్రీతేజ నండూరి పేరిట రు.1లక్ష విరాళాన్ని మంగళవారం దాతలు అందించారు. వారికి దుర్గమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రం, మెమొంటోలు

# ఎపిలో కొత్తగా 8 నవజాత శిశు సంరక్షణ కేంద్రాలు



## మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

విజయవాడ, నవంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రుల్లో అప్పుడే పుట్టిన బిడ్డల కోసం అదనంగా మరో 8 ప్రత్యేక నవజాత శిశువుల సంరక్షణ కేంద్రాలు నెలకొల్పనున్నట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నేడొక ప్రకటనలో తెలిపారు. వీటి ద్వారా అదనంగా 80 పడకలు (వార్మర్స్) అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు. ఒక్కో ఎస్ఎన్‌సియు ఏర్పాటుకు రూ.60 లక్షలు అవసరం కాగా, 8 ఎస్ఎన్‌సియులకు మొత్తం రూ.4.80 కోట్లు ఖర్చవుతుందన్నారు. అలాగే ఒక్కో ఎస్ఎన్‌సియుకు నెలకు రూ.8.91 లక్షలు చొప్పున 8 ఎస్ఎన్‌సియుల నిర్వహణకు దాదాపు రూ.1.07 కోట్లు ఖర్చవుతుందని తెలిపారు.

### పిపిపి విధానంలో...

పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్(పిపిపి) విధానంలో ఈ 8 ఎస్ఎన్‌సియులు నడుస్తాయి. కోనసీమ జిల్లా అమలాపురం ఏరియా ఆసుపత్రి, చిత్తూరు జిల్లాలోని కుప్పం ఏరియా ఆసుపత్రి, అనంతపురం జిల్లా గుంతకల్ ఏరియా ఆసుపత్రి, కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు సీహెచ్సీల్లో ఈనెలాఖరులోగా సేవలు అందుబాటులోకొస్తాయి. ఏలూరు జిల్లా నూజివీడు ఏరియా ఆసుపత్రి, నెల్లూరు జిల్లా కావలి ఏరియా ఆసుపత్రి, సత్యసాయి జిల్లా కదిరి ఏరియా ఆసుపత్రి, తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రులలో కొత్త ఎస్ఎన్‌సియులు నవంబరులో అందుబాటులోకొస్తాయి. రాష్ట్రంలోని టీచింగ్, జిల్లా, ఏరియా ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో(దిబీద్బి) ఇప్పటికే 62 ఎస్ఎన్‌సియులు పనిచేస్తున్నాయని, వీటిలో 28 ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతమున్న 10 వార్మర్లు గల 11 ఎస్ఎన్‌సియులు, 5 వార్మర్లు గల 23 ఎస్ఎన్‌సియులలో అత్యవసర వైద్యాన్ని అవసరమైన శిశువులకు అందిస్తున్నారు. ఈ కేంద్రాల ద్వారా నవజాత శిశువులకు అధునాతన వైద్యం అందుతోంది.

### కూటమి ప్రభుత్వ హయాంలో ఇప్పటికే 4 ఎస్ఎన్‌సియులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ఇప్పటికే అనకాపల్లి, ప్రత్తిపాడు, హిందూపురం, నంద్యాలలో నవజాత శిశు సంరక్షణ కేంద్రాల్ని వైద్యారోగ్య శాఖ నెలకొల్పింది. అలాగే సత్తెనపల్లిలోని న్యూబోర్న్ స్టెబిలైజేషన్ యూనిట్‌ను ఎస్ఎన్‌సియుగా అప్‌గ్రేడ్ చేశారు. వీటితో పాటు అదనంగా మరో 8 ఎస్ఎన్‌సియులు ఏర్పాటుకానున్నాయి.

### శిశువులకు ఉత్తమ సేవలు


పుట్టినప్పట్నించి 28 రోజుల వరకు ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ కేంద్రాల్లో సేవలందిస్తారు. తక్కువ బరువుతో పుట్టిన శిశువులు, పచ్చకామెర్లు(నియోనేటల్ జాండిస్) వచ్చిన శిశువులు, హైపో థెర్మియా, ఎఆర్‌డియస్(శ్వాశ కోస సంబంధిత సమస్యలు), సెప్సిస్ వంటి సమస్యలు గల నవజాత శిశువులకు ఇక్కడ చికిత్స అందిస్తారు.



# మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి: కలెక్టర్ లక్ష్మీశా

విజయవాడ, నవంబరు 4 ప్రభాతవార్త: ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం సహాయక సంఘాల సభ్యులు మహిళా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా ఆకాంక్షించారు. విజయవాడ ఆర్డీఓ కావూరి చైతన్యతో కలిసి ఇబ్రహీంపట్నం గుంటుపల్లిలో మంగళవారం కలెక్టర్ పర్యటించారు. ఆకాంక్షిత మండలమైన ఇబ్రహీంపట్నం అన్ని రంగాల్లో అభివృద్ధి కోసం ప్రణాళికల రూపకల్పనపై అధికారులతో మాట్లాడారు. మహిళలు స్వయం సంవృద్ధి సాధించటంతోపాటు, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కోరారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి కుటుంబం నుండి ఒక పారిశ్రామికవేత్త కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్ళేందుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా మహిళలకు వివిధ రంగాల్లో తర్ఫీదునివ్వాలని కలెక్టర్ ఆదేశించారు. మహిళలు కొత్తకొత్త ఆలోచనలతో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సూచించారు. పదిమందికి ఉపాధి కల్పించే విధంగా ఆలోచించాలని, చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటుకు ప్రభుత్వం నుండి సహాయసహకారాలు అందిస్తామని హామి ఇచ్చారు. మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారని మహిళలు తమ శక్తిసామర్థ్యాలను గుర్తించి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ వెంట డిఆర్‌డిఏ పిడి ఏఎన్‌వి.నాంచారావు, ఎండిఓ శకుంతల, ఏబిపి కోఆర్డినేటర్ పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మంగళగిరిలో అయ్యప్ప స్వామి మహా పడిపూజలో మంత్రి లోకేష్




మంగళగిరి, నవంబరు 4 ప్రభాతవార్త: మంగళగిరి శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప భక్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఆలయ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్‌కు నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం మహా పడిపూజ కార్యక్రమాన్ని మంత్రి ఆసక్తిగా వీక్షించారు. స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మధు నంబూద్రి గురుస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, శివ స్వాములు, భవానీలతో పాటు పెద్దఎత్తున భక్తులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

నెల్లూరు క్రైమ్, నవంబరు 4 ప్రభాతవార్త: ప్రేమించిన అమ్మాయి దక్కదనే ఆలోచనతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకెళితే జిల్లా కేంద్రం నెల్లూరు నగరంలోని స్థానిక వెంకటేశ్వరపురంకు చెందిన వెంకయ్య, సుజాత దంపతులకు రోహిత్ (17) అని కుమారుడు మరో కుమార్తె ఉన్నారు. రోహిత్ తమ ఇంటికి సమీపంలోని యువతిని ప్రేమించాడు. విషయం అమ్మాయి తల్లిదండ్రులకు తెలియడంతో వారు రోహిత్ తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. దీంతో రోహిత్‌ను తల్లిదండ్రులు మందలించారు. కొద్ది రోజులు మెదలకుండా ఉన్న రోహిత్ సోమవారం సాయంత్రం మద్యం సేవించి యువతీ ఇంటికి వెళ్లి ఘర్షణకు దిగాడు. దీంతో విషయం పోలీస్ స్టేషన్ వరకు వెళ్లింది. రోహిత్ తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఇకపై ఎటువంటి పొరపాటు జరగదని హామీ ఇచ్చి రోహిత్‌ను ఇంటికి తీసుకువచ్చారు. మంగళవారం ఉదయం రోహిత్ తన గదిలో ఉరి వేసుకుని విగతజీవిగా ఉండడాన్ని కుటుంబ సభ్యులు గమనించారు. వెంటనే నవాబుపేట పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

# నేడు మరో 'సూపర్ మూన్'



కార్తిక పౌర్ణమి సందర్భంగా బుధవారం ఆకాశంలో కనువిందు చేయనున్న బీవర్ సూపర్‌మూన్‌కు సంబంధించి నాసా విడుదల చేసిన చిత్రం

## ఖగోళంలో కార్తిక పౌర్ణమి అద్భుతం
## దుబాయ్ సహా గల్ఫ్ దేశాల్లో ప్రకాశవంతంగా చంద్రుడు

హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త: ఖగోళంలో బుధవారం నాడు మరో అద్భుతం ఆవిష్కృతం కానుంది. కార్తిక పౌర్ణమి రోజున బీవర్ సూపర్ మూన్‌గా చంద్రుడు మరింత పెద్దదిగానూ ప్రకాశవంతం గానూ కనిపించనున్నాడు. బీవర్ సూపర్ మూన్ దుబాయ్ సహా పలు గల్ఫ్ దేశాలలోనే పెద్ద దిగా, ప్రకాశవంతంగా కనిపిస్తుం దని భారత్ సహా ఇతర ప్రపంచ దేశాల్లో సాధారణంగానే కనిపించనున్నాడని భారత అంతరిక్ష పరిశోధనా శాస్త్రవేత్త లతో పాటు నాసా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సాధారణ పౌర్ణమి చంద్రుడి కంటే ఎనిమిది శాతం పెద్దగా 16 శాతం అధిక కాంతితో చంద్రుడు ప్ర కాశవంతంగా కనువిందు చేయనున్నాడు. బీవర్ సూపర్ మూన్ సందర్భంగా చంద్రుడు భూమికి దగ్గరగా రానున్నాడు. ఈ ఏడాది అత్యంత పెద్ద ప్రకాశవంతమైన సూపర్ మూన్‌గా బీవర్ సూపర్ మూన్ నిలవనుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పౌర్ణమి రోజున చంద్రుడు భూమికి దగ్గరగా వచ్చే కక్ష్య బిందువుతో కలవడాన్ని సూపర్ మూన్‌గా పిలుస్తారు. కార్తిక పౌర్ణమి నాడు బీవర్ సూపర్ మూన్ కనువిందు చేయనున్న దుబాయ్ సహా గల్ఫ్ దేశాలలో చంద్రుడు భూమికి సుమారు మూడు లక్షల 56 వేల కిలోమీటర్ల దూరంలో వుంటాడని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇది సాధారం కంటే 30 వేల కిలోమీటర్ల తక్కువ దూరంగా వారంటున్నారు. ఈ ఏడాది కనిపించిన బ్లడ్ మూన్, హంటర్ మూన్‌ల కంటే బీవర్ సూపర్ మూన్ పెద్దద ని వారు చెబుతున్నారు. కాగా బీవర్ సూపర్ మూన్‌ను తమ దేశ ప్రజలు వీక్షించేం దుకోసం దుబాయ్‌లోని అస్ట్రానమి గ్రూప్ ఆపరేషన్స్ భారీగా ఏ ర్పాట్లు చేసింది. ప్రస్తుతం అక్కడ చలికాలం మొదలవగా ఇంతకాలం ఎండ వేడిమితో ఇబ్బందులు పడ్డ ప్రజలు కొంత ఉపశమనం పొందారు. ఈ నేపథ్యంలో దుబాయ్ సహా గల్ఫ్ దేశాల్లో బీవర్ సూపర్ మూన్‌ను వీక్షించేందుకు ప్రజలు ఎంతో ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారు.

## మహిళల వరల్డ్ కప్ ట్రోఫీతో..

# టాప్‌కు బ్రాండ్ వాల్యూ

### 20 నుండి 100% పెరిగిన ఫీజులు.. కొత్త తారలుగా ఉమెన్ ఇన్ బ్లూ టీమ్



**న్యూఢిల్లీ:** మహిళల వన్డే ప్రపంచ కప్ విజయం భారత మహిళా క్రీడాకారిణులకు ఒక కొత్త శకానికి నాంది పలికింది. ఆటతో పాటు, ఆర్థికంగా కూడా ఈ విజయం ఒక బలమైన పునాదిని వేసింది. చరిత్ర సృష్టించిన భారత మహిళల క్రికెట్ జట్టుకు ప్రపంచ కప్ విజయం కేవలం ట్రోఫీని మాత్రమే అందించలేదు, వారి బ్రాండ్ విలువను కూడా అమాంతం పెంచేసింది. దేశవ్యాప్తంగా అపారమైన అభిమానం, ప్రశంసలు దక్కించుకున్న ఈ ఉమెన్ ఇన్ బ్లూ టీమ్ సభ్యులు ఇప్పుడు అడ్వర్టైజింగ్ ప్రపంచంలో కొత్త తారలుగా వెలుగుతున్నారు. ఈ గెలుపు తర్వాత భారత క్రీడాకారిణుల బ్రాండ్ ఎండార్స్‌మెంట్ ఫీజులు 25 నుంచి 100 వరకు పెరిగాయి. స్మృతి మంధాన, హర్మన్‌ప్రీత్ కౌర్, దీప్తి శర్మ, షఫాలీ వర్మ వంటి స్టార్ ఆటగాళ్ల కోసం బ్రాండ్లు క్యూ కడుతున్నాయి. ప్రధానంగా జెమీమా రోడ్రిగ్స్ ఫీజు రెట్టింపు (100 శాతం పెరుగుదల) అయింది. ఈ బ్రాండ్ విలువ పెరుగుదలలో, సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియాపై అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడి భారత్‌ను ఫైనల్‌కు చేర్చిన జెమీమా ముందంజలో ఉంది. సెమీఫైనల్ మ్యాచ్ ముగిసిన వెంటనే బ్రాండ్‌ల నుంచి విపరీతమైన ఆసక్తి కనిపించింది. జెమీమా ఇప్పుడు ఒక్కో బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌కు రూ.75 లక్షల నుంచి రూ.1.5 కోట్ల వరకు ఛార్జ్ చేయనుంది. ఇప్పటికే రెడ్ బుల్, బోట్, నైక్ వంటి బ్రాండ్లకు అంబాసిడర్‌గా ఉన్న జెమీమా కోసం 10 నుండి 12 విభిన్న కేటగిరీలలోని బ్రాండ్‌లతో చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇతర ప్లేయర్ల పరిస్థితి చూస్తే ఇప్పటికే 20కి పైగా బ్రాండ్లను ఎండార్స్ చేస్తున్న స్టార్ ప్లేయర్‌లు స్మృతి మంధాన, హర్మన్‌ప్రీత్ కౌర్ ఎండార్స్‌మెంట్ ఫీజులు కూడా 30 నుండి 50 శాతం వరకు పెరుగుదల చోటు చేసుకుంది. వీరి ప్రస్తుత ఫీజు రూ.60 నుండి రూ.75 లక్షల వరకు ఉంది. ఇక యువ తారలైన షఫాలీ వర్మ, దీప్తి శర్మ కూడా బ్రాండ్‌ల నుంచి ఎక్కువ ఆసక్తి వ్యక్తమవుతోంది. వీరి ఫీజులు కూడా ఒక్కో బ్రాండ్‌కు రూ.40 నుండి రూ. 50 లక్షల వరకు పెరిగే ఛాన్స్ ఉంది.

## మే బ్యాంక్ ఛాంపియన్‌షిప్..

# ప్లేఆఫ్‌లోకి అదితి



**న్యూఢిల్లీ:** మేబ్యాంక్ ఛాంపియన్‌షిప్‌లో చివరి రోజున భారత్ ప్లేయర్ అదితి అశోక్ ఈవెన్ పార్ 72 రౌండ్ సాధించి టి27ను ముగించింది. మూడు బర్డీలు మరియు మూడు బోగీలతో,3వరౌండ్ తర్వాత టి12స్థానంలో నిలిచిన అదితి, 70-70-66-72 రౌండ్లతో నాలుగు రోజుల పాటు 10 అండర్ పార్ స్కోరుతో ఈ వారాన్ని ముగించింది. ఏడు అండర్ 65తో ఉన్న మియు యమషిత హై జిన్ చోయ్ (73) మరియు హన్నా గ్రీన్ (68)తో కలిసి ప్లే ఆఫ్‌లోకి ప్రవేశించింది. త్రీ వే ప్లేఆఫ్ కోసం వారందరూ 18అండర్‌తో టై అయ్యారు.మొదటి రౌండ్ నుంచి నాల్గవ రోజు ఇబ్బంది పడిన హై జిన్ చోయ్ ఒక ఓవర్ 73 పరుగులు చేసి ఫీల్డ్‌ను నడిపించగా, ఆ తర్వాత ఐదు స్ట్రోక్‌ల వెనుకబడి ఉన్న హన్నా గ్రీన్, ఫోర్అండర్ 68 పరుగులు చేసి ఆమెను అధిగమించింది. 18వ హోల్‌ను మొదటి ప్లే ఆఫ్ హోల్‌గా సెట్ చేయడంతో, జపాన్‌కు చెందిన యమషిత బర్డీ చేసిన తర్వాత టైటిల్‌ను దక్కించుకుంది, హన్నా గ్రీన్ మరియు హై జిన్ చోయ్ మాత్రమే సమానం చేయగలిగారు. ఇది టైటిల్ లేకుండా చోయ్ కెరీర్‌లో టాప్ 10లో 29వ స్థానాన్ని సంపాదించడాన్ని సూచిస్తుంది. నాల్గవ స్థానంలో నిలిచిన ఐదుగురు ఆటగాళ్లలో ప్రపంచ నంబర్ వన్ జీనో తితికుల్, సీ యంగ్ కిమ్, ఐ ఇవై, ఎ లిమ్ కిమ్ మరియు యాన్ లియు ఉన్నారు.




## వన్డే వరల్డ్ నంబర్1గా

# వోల్వార్ట్

**న్యూఢిల్లీ:** మహిళల వన్డే ప్రపంచ కప్‌ను తొలిసారి సాధించి సంబరాల్లో ఉన్న భారత్ మహిళా టీం వైస్ కెప్టెన్ స్మృతి మంధానకు ఎదురు దెబ్బ తగిలింది. ఇప్పటి వరకూ ఐసిసి వన్డే ర్యాంకింగ్స్‌లో ప్రపంచ నెంబర్ వన్ బ్యాటర్‌గా కొనసాగుతున్న స్మృతి తన అగ్రస్థానాన్ని కోల్పోయింది. ఇదే సమయంలో భారత్ చేతిలో ఓటమి పాలైన దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్ ఆ స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో ఐసిసి మహిళల వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో స్మృతి ప్రస్థానం ముగిసింది. టోర్నమెంట్ అంతటా వోల్వార్ట్ సంచలనాత్మక ఫామ్‌తో సెమీఫైనల్, ఫైనల్‌లో వరుసగా సెంచరీలు చేయడం ద్వారా ఆమెను ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేర్చింది. 25 ఏళ్ల ఆమె అద్భుతమైన 571 పరుగులు, కెరీర్‌లో అత్యధిక రేటింగ్ 814 సాధించి అగ్రస్థానానికి చేరుకుంది. ఇక టోర్నమెంట్ అంతటా నంబర్ 1 లో నిలిచి, టీం ఆఫ్ ది టోర్నమెంట్‌లో కూడా స్థానం సంపాదించిన స్మృతి ఇప్పుడు 811 రేటింగ్ పాయింట్లతో 2వ స్థానంలో దిగజారింది. సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియాపై జెమీమా రోడ్రిగ్స్ చేసిన మ్యాచ్ విన్నింగ్ సెంచరీ ఆమె కెరీర్‌లో తొలిసారిగా టాప్ 10లోకి ప్రవేశించడానికి దారితీసింది. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో దక్షిణాఫ్రికాకు చెందిన మారిజాన్ కాప్ సెమీఫైనల్లో ఇంగ్లాండ్‌పై 20 రన్స్‌కు 5 వికెట్లు పడగొట్టి ఇంగ్లాండ్‌కు చెందిన సోఫీ ఎక్లెస్టోన్‌ను అధిగమించి అగ్రస్థానంలో నిలిచింది. ప్రపంచ కప్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ దీప్తి శర్మ ఆల్ రౌండర్ ర్యాంకింగ్స్‌లో సెమీఫైనల్ మరియు ఫైనల్‌లో 7 వికెట్లు, 82 పరుగులతో సహకారం అందించడం ద్వారా నాల్గవ (392) స్థానానికి చేరుకుంది.

# నారాయణన్ 126వ రౌండ్‌కు అర్హత

### చెస్ వరల్డ్ కప్‌లో దక్షిణాఫ్రికా స్టీవెన్ ఓటమి



**న్యూఢిల్లీ:** చెస్ ప్రపంచ కప్ 2025 టైబ్రేక్ గేమ్ మొదటి సెట్‌లో దక్షిణాఫ్రికాకు చెందిన స్టీవెన్ రోజాస్‌ను ఓడించి, 128వ రౌండ్‌కు అర్హత సాధించిన మొదటి ఆటగాడిగా భారత ఎస్ఎల్ నారాయణన్ నిలిచాడు. మొదటి గేమ్‌లో నల్లజాతి వ్యక్తిగా సిసిలియన్ డిఫెన్స్‌ను ఆడి, వేగవంతమైన వెర్షన్‌లో నారాయణన్ పక్కా ప్రణాళికతో తెల్లజాతి డిఫెన్స్‌లను ఢీకొట్టాడు. అసమాన ఘర్షణతో తెల్లజాతి వ్యక్తితో కేవలం 22 కదలికలలో అద్భుతమైన విజయాన్ని సాధించాడు. టైబ్రేకర్ యొక్క మొదటి సెట్‌లో తన రెండు గేమ్‌లను గెలిచి ముందుకు సాగడంతో దీప్తయాన్ ఘోష్ చైనాకు చెందిన పెంగ్ జియోంగ్లియన్ కంటే మెరుగ్గా నిరూపించుకున్నాడు. కోల్‌కతాకు చెందిన ఈ భారత ఆటగాడు టైబ్రేకర్ యొక్క మొదటి గేమ్‌లో అత్యున్నత స్థాయిలో వైట్‌తో గెలిచాడు. తరువాత తన ప్రత్యర్థి చేసిన తప్పు ప్రదర్శనను సద్వినియోగం చేసుకుని అతనిపై ఆధిపత్యం సంపాదించాడు. మొదటి గేమ్‌లో నారాయణన్ తన పెంపుడు ఓపెనింగ్‌ను పునరావృతం చేసి సరైన స్పందనను పొందకపోగా, మిడిల్ గేమ్ సంక్లిష్టతలు ఎదుర్కొని దక్షిణాఫ్రికా ఆటగాడిని ఎదుర్కొన్నాడు. మొదటి గేమ్ పెద్దగా దెబ్బ లేకుండా ముగిసింది కానీ రెండవ గేమ్‌లో నారాయణన్ మొదటినుండే దాడితో తన సామర్థ్యాన్ని, ఆధిపత్యాన్ని సాధించాడు.

# రంజీ ట్రోఫీ: చివరి రోజు డ్రా

### ముంబయిపై రాజస్థాన్ ఆధిక్యం

**న్యూఢిల్లీ:** రంజీ ట్రోఫీ 2025-26లో భాగంగా చివరి రోజు మ్యాచ్ డ్రాగా ముగిసింది. ముంబైపై రాజస్థాన్ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంలో ఉంది. యశస్వి జైస్వాల్ మొదటి ఇన్నింగ్స్‌లో ఆపివేసిన చోటు నుంచి పుంజుకుని, రెండవ ఇన్నింగ్స్‌లో 156 (174 బాల్స్, 18 ఫోర్లు, ఒక సిక్స్) పరుగులు చేశాడు. కానీ రాజస్థాన్‌తో జరిగిన గ్రూప్ డి మ్యాచ్ డ్రాగా ముగియడంతో ముంబై ఒక్క పాయింట్‌తో సంతృప్తి చెందాల్సి వచ్చింది. రాజస్థాన్ బౌలర్లు మంగళవారం ఈ జోరును ఎదుర్కొనేందుకు శాయశక్తులా ప్రయత్నించినప్పటికీ, జైస్వాల్ మరియు ముషీర్ ఖాన్ (63, 115 బాల్స్, 9 ఫోర్లు) ఓపెనింగ్ భాగస్వామ్యానికి 149 పరుగులు జోడించారు. జైస్వాల్ బౌండరీలు బాదగా, ముషీర్ సమయం తీసుకుని చివరికి అర్ధ సెంచరీని పూర్తి చేశాడు. ఈ భాగస్వామ్యానికి అడ్డుకట్ట వేసేందుకు సీమర్ అనికేత్ మొదట ముషీర్‌ను కునాల్ సింగ్ రాథోడ్ క్యాచ్‌తో వెనక్కి నెట్టాడు. అయితే, జైస్వాల్ అజింక్య రహానేతో రాజస్థాన్ ఫాస్ట్ బౌలర్లను సులభంగా ఎదుర్కొన్నాడు. కానీ, అతను కూడా అజయ్ సింగ్ వేసిన బంతిని రాథోడ్ స్టంప్ చేయడంతో ఔట్ అయ్యాడు. యశస్విపై 150 పరుగులు సాధించడంతో డ్రాగా ముగిసే అవకాశం తప్పనిసరి ఏర్పడింది. టీ విరామానికి కొద్దిసేపటి ముందు రోజు ఆటను రద్దు చేయడానికి జట్లు పరస్పరం అంగీకరించాయి. దీంతో ముంబై 3 వికెట్లకు 269 పరుగులు చేసింది.



## వాణిజ్యం

# స్వల్పంగా తగ్గిన పసిడి ధరలు



**ముంబయి, నవంబరు 4:** బంగారం ధరలు మంగళవారం తగ్గుముఖం పట్టాయి. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం, అంతర్జాతీయంగా అమెరికా డాలర్ బలపడటం వంటి పరిణామాలు పసిడి ధరలపై తీవ్ర ప్రభావం చూపాయి. దీంతో పాటు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గిస్తుందన్న అంచనాలు బలహీనపడి బంగారం ధరల పతనానికి కారణం అయింది. ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ వెల్లడించిన వివరాల ప్రకారం, 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,19,916గా నమోదైంది. మరోవైపు, మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసిఎక్స్)లో డిసెంబర్ గోల్డ్ ఫ్యూచర్స్ ధర రూ.836 (0.69 శాతం) తగ్గి 10 గ్రాములకు రూ.1,20,573 వద్ద ట్రేడ్ అయింది. ఇదే సమయంలో డాలర్ ఇండెక్స్ 0.08 శాతం పెరిగి 99.95 వద్ద స్థిరంగా కొనసాగింది. బలమైన డాలర్, అమెరికా చైనా మధ్య తగ్గుతున్న వాణిజ్య ఉద్రిక్తతలు, అమెరికాలో వడ్డీ రేట్ల కోతకు అవకాశాలు తగ్గడం వంటి అంశాలు బంగారం ఆకర్షణను దెబ్బతీశాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అనలిస్ట్ మానవ్ మోదీ మాట్లాడుతూ, డాలర్ మూడు నెలల గరిష్ఠ స్థాయికి చేరడంతో బంగారం ధర ఔన్సుకు 4,000 డాలర్ల వద్ద కదలాడుతోంది. అమెరికా ఫెడరల్ ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా కీలక ఆర్థిక గణాంకాలు అందుబాటులో లేకపోవడంతో, డిసెంబర్ పాలసీ సమావేశం ముందు ఫెడ్ అధికారుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయని వివరించారు. మరోవైపు, ప్రపంచంలోనే అతిపెద్ద బంగారం వినియోగదారు అయిన చైనా, కొన్ని గోల్డ్ రిటైలర్లకు చాలాకాలంగా ఇస్తున్న పన్ను మినహాయింపు విధానాన్ని రద్దు చేసింది.
ఇది అక్కడి బంగారం కొనుగోళ్ల జోరుకు కళ్లెం వేసే అవకాశం ఉంది. అయితే, వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ తాజా నివేదిక ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా సెంట్రల్ బ్యాంకులు 2025 మూడో త్రైమాసికంలో బంగారం కొనుగోళ్లను త్రైమాసిక ప్రాతిపదికన 28శాతం పెంచాయి. నవంబర్ ఆరంభంలో బలహీనపడిన రూపాయి, కామెక్స్‌లో బంగారం 4,010 డాలర్ల పైన ఉండటం వంటివి పసిడికి మద్దతునిచ్చాయి. ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా గణాంకాలు విడుదల కాకపోవడంతో ఇన్వెస్టర్లు ఈ వారం వెలువడనున్న మాన్యుఫ్యాక్చరింగ్, నాన్ మాన్యుఫ్యాక్చరింగ్ పీఎంఐ గణాంకాల కోసం ఎదురుచూసారని ఎల్‌కెపి సెక్యూరిటీస్ రీసెర్చ్ అనలిస్ట్ జతిన్ త్రివేది తెలిపారు. అమెరికాచైనా, అమెరికా భారత్ వాణిజ్య చర్చల్లో చోటుచేసుకునే పరిణామాలు బంగారం ధరల్లో తీవ్ర ఒడుదొడుకులకు కారణమవుతాయని, ధరలు రూ.1,18,000 నుంచి రూ.1,24,000 మధ్య కదలాడవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# నికరలాభాల్లో ఎస్‌బిఐ దూకుడు!

### రూ.18,331 కోట్ల లాభం ప్రకటించిన బ్యాంకింగ్ దిగ్గజం



**ముంబయి, నవంబరు 4:** ప్రభుత్వ రంగంలోని బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా త్రైమాసిక ఫలితాల్లో భళా అనిపించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 జూలై సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.20,160 కోట్ల నికర లాభాన్ని అందుకుంది. గత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ఎస్‌బిఐ మొత్తం రూ.18,331 కోట్ల నికర లాభాన్ని అందుకగా ఈ ఏడాదిలో అది 10శాతం వృద్ధి నమోదుచేసింది. రూ.20 వేల కోట్లు దాటేసింది. సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికానికి గానూ స్టేట్ బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.1,29,141 కోట్ల నుంచి రూ.1,34,979 కోట్లకు పెరిగింది. ఇక వడ్డీ ద్వారా బ్యాంకుకు వచ్చిన ఆదాయం రూ.1,13,871 కోట్ల నుంచి రూ.1,19,654 కోట్లకు చేరింది. ఈ బ్యాంకు ఆస్తుల నాణ్యత సైతం మెరుగుపడినట్లు తెలిపింది. 2025, సెప్టెంబర్ 30 నాటికి ఎస్‌బిఐలో స్థూల నిరర్థక ఆస్తులు (జిపిఎ)లు గతేడాదితో పోలిస్తే 2.13 శాతం నుంచి 1.73 శాతానికి దిగివచ్చాయి. ఇక నికర మొండి బాకీల విలువ 0.53 శాతం నుంచి 0.42 శాతానికి తగ్గినట్లు బ్యాంక్ వెల్లడించింది. ఏకీకృత ప్రాతిపదికన ఫలితాలు చూసుకుంటే ఎస్‌బిఐ గ్రూప్ 7శాతం వృద్ధి నమోదు చేసింది. దీంతో రూ.21,137 కోట్ల నికర లాభాన్ని ఎస్‌బీఐ గ్రూప్ నమోదు చేసింది. గతఏడాది ఇదే సమయంలో ఈ గ్రూప్ మొత్తం రూ.19,743 కోట్ల నికర లాభాన్ని అందుకుంది. అలాగే కంపెనీ మొత్తం ఆదాయం సైతం రూ.1.63 లక్షల కోట్ల నుంచి రూ.1.75 లక్షల కోట్లకు చేరుకుంది. రాణించిన షేరు త్రైమాసిక ఫలితాల వేళ ఎస్‌బిఐ షేరు రాణించింది. క్రితం రోజు సరికొత్త గరిష్ఠాలను తాకింది. ఈ రోజు స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ ఇంట్రాడేలో చూసుకుంటే ఉదయం స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. ఆ తర్వాత కోలుకుంది. మార్కెట్ అంచనాలను ఎస్‌బీఐ అందుకుంటుందన్న వార్తల నేపథ్యంలో ఎస్‌బీఐ షేర్లు కొనేందుకు ఇన్వెస్టర్లు మొగ్గు చూపారు. దీంతో మరోసారి ఆల్ టైమ్ హై స్థాయి రూ. 959.30ని తాకింది. మార్కెట్లు ముగిసే నాటికి 0.52 శాతం లాభంతో రూ.954.60 వద్ద స్థిరపడింది.

## హిందూజా గ్రూప్ ఛైర్మన్ గోపీచంద్ హిందూజా కన్నుమూత



**లండన్, నవంబరు 4:** హిందూజా గ్రూపు ఛైర్మన్‌గోపిచంద్ పి హిందూజా లండన్‌లోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసారు. 85 ఏళ్ల హిందూజా పారిశ్రామిక రంగంలో జిపిగా పేరుపొందారు. గడచిన కొన్ని వారాలుగా ఆయన అస్వస్థతతో ఉన్నారు. హిందూజా కుటుంబంలో రెండోతరం ప్రముఖునిగా పారిశ్రామిక వేత్తగా ఆయన పేరుపొందారు. ఆయన సోదరుడు శ్రీచంద్ హిందూజా కన్నుమూసిన తర్వాత గోపీచంద్ హిందూజా గ్రూపు ఛైర్మన్‌గా బాధ్యతలుచేపట్టారు. 2023నుంచి ఆయన ఈ పదవిలో కొనసాగుతున్నారు. ఆయనకు భార్య సునీత, కుమారులు సంజయ్, ధీరజ్, కుమార్తె రీటా ఉన్నారు. కంపెనీ సమాచారం ప్రకారం ముంబయిలోని జైహింద్ కళాశాలనుంచి 1959లో ఆయన పట్టభద్రుడయ్యారు. వెస్ట్‌మినిస్టర్ వర్సిటీనుంచి లాలో డాక్టరేట్‌పొందారు. అలాగే ఆర్థిక శాస్త్రంలో లండన్‌లోని రిచ్‌మండ్ కళాశాలనుంచి డాక్టరేట్ పొందారు. కుటుంబ వ్యాపారంలో గోపిచంద్ హిందూజా1950లోనే చేరారు.భారత్ మధ్యప్రాచ్య ట్రేడింగ్ సంస్థగా నిలిచిన హిందూజా అనతికాలంలోనే గ్లోబల్‌గ్రూపుగా అవతరించింది. ఆటోమోటివ్, బ్యాంకింగ్, ఆర్థికసేవలు, ఐటిరంగం, హెల్త్‌కేర్, రియల్ ఎస్టేట్, పవర్, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగాల్లో బహుముఖంగా విస్తరించడంలో కీలకంగా వ్యవహరించింది. అశోక్ లేల్యాండ్, ఇండస్ ఇండ్ బ్యాంకు, నెక్స్ట్‌డిజిటల్‌వంటివి ప్రపంచ వ్యాప్త గుర్తింపు పొందాయి. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 2లక్షలమంది పనిచేస్తున్నారు. 1979లోనే ఇరాన్‌నుంచి లండన్‌కు కేంద్ర కార్యాలయాన్ని తరలించింది.

## భారత్‌కు అప్పగింతపై చోక్సీ సుప్రీంకోర్టులో అప్పీలు!




**న్యూఢిల్లీ, నవంబరు 4:** పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) కుంభకోణంలో ప్రధాన నిందితుడు, పరారీలో ఉన్న వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీ భారత్‌కు తనను అప్పగించే ప్రక్రియను నిలిపివేసేందుకు మరో న్యాయ పోరాటానికి దిగాడు. తనను భారత్‌కు అప్పగించ వచ్చంటూ బెల్జియంలోని ఆంట్వెర్ప్ అప్పీల్ కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ అక్కడి సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఈ మేరకు అక్టోబర్ 30న పిటిషన్ దాఖలు చేసినట్లు అధికారులు వెల్లడించారు. చోక్సీ అప్పీల్ కారణంగా, సుప్రీంకోర్టు తీర్పు వెలువడేంత వరకు అతడిని భారత్‌కు అప్పగించే ప్రక్రియ నిలిచిపోనుంది. ఈ విషయాన్ని ఆంట్వెర్ప్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కెన్ విట్పాస్ తెలిపారు. రూ. 13,000 కోట్ల పీఎన్‌బీ స్కామ్‌లో చోక్సీపాత్ర రూ. 6,400కోట్లుగా ఉందని సిబిఐ ఆరోపించింది. ఈ కుంభకోణం బయటపడటానికి కొద్ది రోజుల ముందు, 2018 జనవరిలో చోక్సీ దేశం విడిచిపారిపోయి ఆంటిగ్వా అండ్ బార్బుడాలో తలదాచుకున్నాడు. ఇటీవల అనారోగ్య చికిత్స నిమిత్తం బెల్జియంవెళ్లగా భారత ఏజెన్సీలు గుర్తించాయి. ముంబైలోని ప్రత్యేక న్యాయస్థానం జారీ చేసిన అరెస్ట్ వారెంట్ల ఆధారంగా, 2024 ఆగస్టు 27న భారత్ చోక్సీని అప్పగించాలని బెల్జియంను కోరింది. ఈ అభ్యర్థనను విచారించిన ఆంట్వెర్ప్ జిల్లాకోర్టు, 2024 నవంబరు 29న చోక్సీని భారత్‌కు అప్పగించవచ్చని తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ చోక్సీ ఆంట్వెర్ప్ అప్పీల్ కోర్టును ఆశ్రయించాడు. భారత్‌కు వెళ్తే తనకు ప్రాణహాని ఉందని, సరైన న్యాయం జరగదని, హింసకు గురిచేసే అవకాశంఉందని వాదించాడు. అయితే, చోక్సీ వాదనలను అప్పీల్ కోర్టు అక్టోబర్ 17న తోసిపుచ్చింది. అతని వాదనలకు సరైన ఆధారాలు లేవని స్పష్టం చేసింది. భారత్‌లో చోక్సీ భద్రత, జైలు సౌకర్యాలు, వైద్య అవసరాలు, మానవ హక్కుల పరిరక్షణపై భారత ప్రభుత్వం బెల్జియంకు పలు హామీలు ఇచ్చింది.

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు!

### ఐటి, మెటల్ రంగాల్లో పెరిగిన అమ్మకాల ఒత్తిడి



**ముంబయి, నవంబరు 4:** భారత స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టాలతో ముగిశాయి. ట్రేడింగ్ రెండో అర్ధభాగంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి), మెటల్ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో సూచీలు పతనమయ్యాయి. ఉదయం లాభాలతో సానుకూలంగా ప్రారంభమైనప్పటికీ, ఆ జోరును నిలబెట్టుకోలేకపోయాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 519.34 పాయింట్లు నష్టపోయి 83,459.15 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, నిఫ్టీ కూడా 165.70 పాయింట్లు క్షీణించి 25,597.65 వద్ద ముగిసింది. ఇంట్రాడే సెషన్‌లో సెన్సెక్స్ ఒక దశలో 0.11 శాతం లాభపడినప్పటికీ, చివరికి నష్టాల్లోకి జారుకుంది. బెంచ్‌మార్క్ సూచీలతో పాటు బ్రాడర్ మార్కెట్లు కూడా బలహీనపడ్డాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.42 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.82 శాతం చొప్పున నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే, ఒక్క నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్ సూచీ మాత్రమే 0.39 శాతం లాభంతో గ్రీన్‌లో నిలిచింది. అత్యధికంగా నిఫ్టీ మెటల్ సూచీ 1.44 శాతం పతనమవ్వగా, ఆటో రంగం 0.86 శాతం, ఐటీ రంగం 0.06 శాతం నష్టపోయాయి. సెన్సెక్స్ స్టాక్స్‌లో పవర్ గ్రిడ్, టాటా మోటార్స్, టాటా స్టీల్, మారుతీ సుజుకీ ప్రధాన నష్టాల్లో నిలిచాయి. మరోవైపు, టైటాన్, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్లు లాభాలను నమోదు చేశాయి. ప్రతికూల అంతర్జాతీయ సంకేతాలు, కొన్ని హెవీవెయిట్ స్టాక్స్‌లో లాభాల స్వీకరణ ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. సెలవుల కారణంగా ఈ వారం ట్రేడింగ్ రోజులు తక్కువగా ఉండటంతో పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరించారని వారు తెలిపారు. నిఫ్టీ 25,600 మార్కు దిగువకు చేరడంతో స్వల్పకాలికంగా బలహీనత కొనసాగవచ్చు. తక్షణ మద్దతు 25,570 వద్ద ఉంది. ఒకవేళ నిఫ్టీ నిర్ణయాత్మకంగా 25,800 స్థాయిని దాటితేనే బేరిష్ ధోరణి ముగిసి, మార్కెట్‌లో కొత్త కొనుగోళ్లు రావచ్చని మార్కెట్ నిపుణులు అంచనావేసారు.




## సత్వరసేవలకోసం ఇండియా పోస్ట్ 'డాక్‌సేవా యాప్'

**న్యూఢిల్లీ, నవంబరు 4:** తపాలా సేవలను ప్రజలకు మరింత చేరువచేసే లక్ష్యంతో ఇండియాపోస్ట్ మార్పులు చేస్తోంది. శరవేగంగా సేవలు అందించేందుకు కొత్తయాప్‌ను ప్రవేశపెట్టింది. తపాలాశాఖ మొత్తం సేవలన్నీకూడా స్మార్ట్‌ఫోన్‌ద్వారానే వినియోగించుకునేలా డాక్‌సేవ పేరిట యాప్‌ను విడుదలచేసింది. ఇక పోస్టాఫీస్ మీజేబులోనే అన్న నినాదంతో పోస్టల్ శాఖ తన ఎక్స్ ఖాతాలోకూడా పోస్టుచేసింది. పార్సిల్‌ట్రాకింగ్, పోస్టేజి కాలిక్యులేషన్, ఫిర్యాదుల నమోదు, బీమా ప్రీమియం చెల్లింపులు వంటి సేవలు పొందవచ్చు స్పీడ్‌పోస్టు, మనీ ఆర్డర్ వివరాలను రియల్‌టైమ్‌లోట్రాక్‌చేసుకోవచ్చు. దేశీయ అంతర్జాతీయ పార్శిల్ సేవలకు ఎంత ఛార్జి అవుతుందో తక్షణమే లెక్కించుకోవచ్చు. స్పీడ్‌పోస్టు, రిజిస్టరుపోస్టు, పార్సిల్‌బుకింగ్‌సేవలను గంటల తరబడి లైన్‌లోఉండాల్సి అవసరంలేకుండా యాప్‌ద్వారానే పూర్తి చేయవచ్చు.కార్పొరేట్‌కస్టమర్లకోసం ప్రత్యేక యాక్సెస్‌ను కూడా ఏర్పాటుచేసారు. ప్లేస్టోర్, యాపిల్ యాప్ స్టోర్‌లో డాక్ సేవా యాప్ అని టైప్‌చేసి డౌన్‌లోడ్‌చేసుకోవచ్చు. మొబైల్‌లో యాప్ డౌన్‌లోడ్ అయ్యాక ఈమెయిల్ ఐడి, లేదా మొబైల్ నంబరుతో రిజిస్టరుఅవ్వాలి. ఒటిపితో లాగిన్ అయి సేవలు పొందవచ్చు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps